
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి



# గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 22 - సంచిక 6
నవంబర్ 2017

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లో సంప్రదించగలరు.
040-39560330

## లో వెలుగు

గాలి తాకిడికి ప్రమిదలోని దీపం ఆరిపోయింది. ఎన్నెన్నో దీపాలు ఆరిపోయాయి. అలా ఆరిపోయిన దీపాలలో ఇది ఒకటి. వెలుగు లేకపోతే జీవితం కారుచీకటిలో మునిగిపోతుంది. ఈ చీకటి ఎప్పుడూ భయపెడుతూ ఉంటుంది. చీకటిలో ప్రాణం వణుకుతుంది. ఊపిరి తీసుకోవడం కూడ కష్టమవుతుంది.

జీవితమే కాక జగత్తు కూడ చీకటితో చుట్టుముట్టబడి ఉంది. చీకటిని పూర్తిగా తొలగించే దీపం ఈ జగత్తులో లేదు. ఉన్న దీపాలు గాలి తాకిడికి ఆరిపోయి చీకటిలో మునిగిపోతాయి. దీపాలు వెలుగుతాయి, ఆరిపోతాయి. అయినా చీకటి దట్టంగా మిగిలే ఉంటుంది. జగత్తులో వ్యాపించి ఉన్న చీకటి శాశ్వతమైనది. ఈ జగత్తులోని దీపాలను నమ్ముకునేవారు అమాయకులు. ఎందుకంటే ఈ దీపాలన్నీ చివరికి చీకటి ఓడిపోయి ఆరిపోయేవే.

చీకటితో నిండిన ఈ జగత్తుకు ఆవల మరో లోకం ఉంది. అక్కడ వెలుగే వెలుగు. మన ఈ జగత్తులో వెలుగు క్షణికమైనది, తాత్కాలికమైనది. కానీ, ఆ ఆంతరిక జగత్తులో చీకటి క్షణికమైనది, తాత్కాలికమైనది కాదు, ఆ వెలుగు శాశ్వతమైనది. ఆశ్చర్యమేమంటే - వెలుగుల లోకం మనకు చాలా దగ్గరగా ఉంది. చీకటి బయట ఉంది. వెలుగు మన లోపల ఉంది.

ఆంతరిక లోకపు వెలుగు, లో వెలుగు, మేలుకోనంతవరకు ఏ దీపమూ మనకు నిర్భయత్వాన్ని ఇవ్వజాలదు. కనుక - మట్టి దీపాలపై, మృణ్మయ దీపాలపై నమ్మకాన్ని వదులుకోవాలి. చిన్మయ జ్యోతిని అన్వేషించాలి. ఎందుకంటే ఆ జ్యోతియే నిర్భలత్వానికీ, ఆనందానికీ పుట్టిల్లు. మనం చీకటిని చూచి గాబరాపడతాం. వెలుగును కోరుకుంటాం. మన అసలు అస్తిత్వం వెలుగేనని దీనివల్ల స్పష్టమవుతోంది. ఎందుకంటే - వెలుగే వెలుగు కోసం ఆరాటపడగలుగుతుంది. వెలుగు కోసం తపన ఎక్కడ పుడుతోందో అక్కడే వెదుకు. ఆంతరిక లోకపు వెలుగుకు, లో వెలుగుకు, చిన్మయజ్యోతికి జన్మస్థలం అక్కడే దాగి ఉంది.

# విషయసూచిక


1. **సంపాదకీయం:** లో వెలుగు 3
2. **విషయసూచిక & సద్గురు వచనామృతం** 4
3. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-65:** వేచి ఉన్న భవిష్యత్తు 5
4. **జీవన సాధనకు పావన ప్రేరణ:** త్యాగమయ జీవనమే సౌశీల్య సాధనం 9
5. **నాలుగు సూత్రాల జీవన సాధన** 11
6. **అధికార వాంఛయే అభ్యుదయానికి అడ్డుగోడ** 12
7. **నిజమైన ప్రేమ** 13
8. **సరియైన నాయకత్వం** 14
9. **మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-8:** అవ్యాజమైన మాతృప్రేమ 15
10. **జీవన సాధనకు పావన ప్రేరణ:** ఋషిత్వాన్ని ప్రసాదించిన పంచాగ్ని విద్య 17
11. **ప్రజ్ఞా యోగానికి నాలుగు సోపానాలు** 19
12. **చింతించకండి - చింతన చెయ్యండి** 22
13. **ఆధ్యాత్మిక దృష్టికోణం అలవర్చుకోవాలి** 24
14. **శిష్య సంజీవని-7:** తనకు తాను స్వామియైనవాడే అసలైన యజమాని 26
15. **బోధ కథ:** ఇచ్ఛయే ప్రపంచము 28
16. **పర్యావరణ సంతులన చాలా అవసరం** 31
17. **వయస్సు కాదు ఉత్సాహమే జీవితానికి కొలబద్ద** 33
18. **సమాజ ఋణాన్ని తీర్చుకోవడానికే సేవ** 35
19. **పద్యం - మన సంస్కృతి నేపథ్యం** 36
20. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** మానవ జీవితం యొక్క గౌరవపూర్ణమైన శ్రేష్ఠత్వము-6 38
21. **నా వారితో నా మాట:** నవసృజన యువసంకల్ప సమారోహం "యుగ సృజేత" 42
22. **ఆరోగ్య సూత్రాలు-3:** డెంగీ జ్వరం 45
23. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48




# సద్గురు వచనామృతం

## జీవితానికి ఐదు సిద్ధాంతాలు

క్రమబద్ధమైన జీవితానికి ప్రథమ ఆవశ్యకతలు ఏమంటే సిద్ధాంతం, ఆచరణ ద్వారా దాని నిరూపణ. ఇందులో 'కర్తవ్యం' ప్రపథమం. కర్తవ్యానికి అతి స్పష్టమైన అర్థం ఏమంటే - తన పనిలో తన్మయత్వం, ఇతరులకు మార్గం చూపుతానని పదేపదే చెప్పే వ్యక్తికి తన మార్గం అసలు తెలియదు.

జీవితం యొక్క రెండవ సిద్ధాంతం "నిజాయితీ". చెప్పేదే చేయి, చేసేదే చెప్పు అన్నది దీని మూల మంత్రం. రకరకము లయిన టక్కరులకూ, మోసకారులకూ, కపటులకూ, దూరం కావడం దాని పని. నిజాయితీ వలన మనిషిపట్ల విశ్వాసం ఉత్పన్నమవుతుంది. ఈ విశ్వాసమే సంపూర్ణ సుఖం సమృద్ధులకు జనని. నాలుగవ సిద్ధాంతం 'ఉదారత'. మిత వ్యయంతో దీనికి పరోక్ష సంబంధం ఉన్నది. మితవ్యయం చేయని వాడు ఉదారుడు కాలేడు. "ఆత్మ సంయమనం" జీవితం యొక్క అయిదవ, ఆఖరి సిద్ధాంతం.

సిద్ధాంతాలు అయిదూ విజయానికి అయిదు మార్గాలు. జీవనపథానికి వెలుగు చూపే అయిదు కిరణాలు. ప్రారంభంలో ఆచరణ ద్వారా వీటి నిరూపణ కష్టం కావచ్చు. అయితే అభ్యాసం మనల్ని ఈ సిద్ధాంతాలతో మమేకం చేస్తుంది.

*- అఖండజ్యోతి, అక్టోబరు, 1951*

*అనువాదం:* ఊటుకూరు సత్యనారాయణ గుప్త


## పండుగలు

| | |
|---|---|
| **నవంబర్ 2017** | |
| **04-11-2017** | **కార్తీక పౌర్ణమి / గురునానక్ జయంతి** |
| **14-11-2017** | **బాలల దినోత్సవం** |
| **డిసెంబర్ 2017** | |
| **03-12-2017** | **దత్తాత్రేయ జయంతి** |
| **25-12-2017** | **క్రీస్తు జయంతి (క్రిస్మస్)** |
| **29-12-2017** | **వైకుంఠ ఏకాదశి** |
| **30-12-2017** | **శ్రీ రమణ మహర్షి జయంతి** |

**ఆత్మస్తుతి, పరనింద తగవు**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-65

# వేచి ఉన్న భవిష్యత్తు



ఒక చెక్క బల్ల, కుర్చీ ఉన్న చిన్నగదిలో అఖండ జ్యోతి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరాలు తీసుకోవడానికి, లెక్కలు చూడడానికి భూదేవశర్మ అనే వృద్ధ స్వతంత్ర సేనాని వస్తూండేవారు. ఒక రిజిస్టరులో అఖండజ్యోతి సభ్యుల పేర్లు, చిరునామాలు వ్రాయించుకున్నారు. మరోదాంట్లో లెక్కలు వ్రాసేవారు. పత్రిక సభ్యుల సంఖ్య అప్పటికే వెయ్యి దాటింది. భూదేవశర్మగారు మాత్రమే ఆ గదిలో కూర్చునేవారు. శ్రీరామ్ కార్యాలయానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోయేవారు. కూర్చోవాలన్నప్పుడు మరో కుర్చీ వేసుకునేవారు. పూజగది పక్కనే మరో గదిలోనే నేల మీద ఆసనం పరుచుకుని చాలా సేపు అక్కడే కూర్చునేవారు. ఎదురుగా ఒక వ్యాసపీఠం ఉండేది. పక్కన కొన్ని పుస్తకాలుండేవి. ఆయన్ని కలవడానికి వచ్చేవాళ్ళు ఆ గదిలోనే కూర్చునేవారు. ఎవరూ రాని సమయంలో శ్రీరామ్ అధ్యయనం, రచనలు చేస్తూండేవారు. సంప్రదించడానికి వచ్చేవారి సంఖ్య పెరగడంతో రోజూ మధ్యాహ్నం రెండింటి తరువాత మాత్రమే కలుస్తారని సమయం నిర్ధారించారు. దాని ముందు శ్రీరామ్ చదవడం, రాయడం, ఉత్తరాలకి జాబులు వంటి మిగిలిన పనులు పూర్తి చేసుకునేవారు. బయటికి వెళ్ళి చేయవలిసిన పనులు కూడా అప్పుడే పూర్తి చేసుకునేవారు. సాధారణంగా రెండింటి తరువాత వారు ఆ గదిలోనే ఉండేవారు. దాని పేరు కూడా 'సంప్రదింపుల గది' అయిపోయింది.

1946 కల్లా ఈ క్రమం స్థిరపడిపోయింది. అఖండజ్యోతి ముద్రణ, ప్రచురణ వ్యవస్థ కూడా ఒక దారినపడింది. ఆ మధ్యలోనే అఖండజ్యోతి విశేష సంచికలు కూడా ప్రచురించారు. వాటి కోసం తీసుకున్న అప్పు కూడా తీరిపోయింది. సాహిత్యం, సంప్రదింపుల క్షేత్రంలో మొదలుపెట్టిన పనులు చిన్నగా ఊపందుకుంటున్న రోజులవి. అప్పుడే ఉన్నట్టుండి ఒక వివాదం తలెత్తింది.

ఆ రోజులలో మథుర ఆర్యసమాజానికి శ్రీరామ్ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించేవారు. కొన్ని నెలల క్రితం విగ్రహారాధన విషయమై వివాదాలు చోటుచేసుకున్నాయి. గాయత్రిని ఒక దేవత రూపంలో చూడకండి అని శ్రీరామ్ ఆర్యసమాజ కార్యకర్తలకి చెప్తూండేవారు. అప్పుడు చాలా వరకు అభ్యంతరాలను వెనక్కి తీసుకుని శ్రీరామ్‌కు బాధ్యతలనిచ్చారు. అఖండజ్యోతి సంపర్క క్షేత్రం పెరిగిన కొద్దీ, శ్రీరామ్ చుట్టూరా శ్రద్ధాళువులు గుమిగూడడం మొదలైనప్పటి నుండి మళ్ళీ ఆ కార్యకర్తలే అదే వివాదాన్ని లేవనెత్తారు. ఆదివారం యజ్ఞాల్లో మొదట గుసగుసలాడేవారు. తరువాత శ్రీరామ్‌కి వినబడేలా చర్చించారు. వాటికి జవాబివ్వకుండా వేచి ఉండడం సబబుగా తోచింది శ్రీరామ్‌కు. ఒక రోజు ఆర్యసమాజ కార్యకర్తల టీమ్ అఖండజ్యోతి ఆఫీసుకు రానే వచ్చింది.

ద్వారకా ప్రసాద్ అనే కార్యకర్త నేతృత్వంలో మరో నలుగురైదుగురు వచ్చారు. ఉన్నట్టుండి గదిలోకి వచ్చీ రాగానే అరవడం మొదలుపెట్టారు. మీరు గాయత్రి పూజను ప్రచారం చేయడమైనా మానండి లేదా ఆర్యసమాజ ప్రధాని పదవి నుండి వైదొలగండి అన్నారు. శ్రీరామ్ వినయంగా, " అసలు మీరు ఏ అధికారంతో ఇలా అంటున్నారో నాకు తెలియదు. ఆర్యసమాజం మీ వ్యక్తిగత సంస్థ అయి ఉంటే నేను వెంటనే నిర్ణయం తీసుకునేవాడిని. కాని ఇది వందల వేల మంది నమ్ముతున్న ఆధ్యాత్మిక సంస్థ. వారందరి ముందు నా భావాలు బయటపెట్టకుండా సమాజం బాధ్యతల నుండి తప్పుకోవడం కుదరదు" అన్నారు.

"విగ్రహారాధనకు సంబంధించి స్వామి దయానందుల వారి సిద్ధాంతాలు స్పష్టంగా ఉన్నాయి. ఆ విషయమై ఎవరూ ఎవరికీ సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు." అన్నారు ద్వారకా ప్రసాద్. "స్వామి దయానందుల వారే గనక నా భావాలు విని ఉంటే ఆయన కూడా ఒప్పుకుని తమ నమ్మకాలలో సవరణలు చేసుకునేవారు." అన్నారు శ్రీరామ్.

**ఎదుటి వ్యక్తి జవాబు చెప్పడానికి సంకోచించే ప్రశ్నలు వేయకూడదు**

ఆ మాటలు వింటూనే వారంతా వ్యంగ్యంగా నవ్వారు. "అయితే మీరు స్వామి కన్నా పెద్ద విద్వాంసులా?" అని తిరుగు ప్రశ్నించారు.

"లేదు. నేను ఆయన ముందు చిన్న పిల్లవాడిని మాత్రమే. కాని ఆయన భుజంపై కూర్చున్నాను. అందుకే వినయంగా చెప్తున్నాను. ఆయన భుజంపై కూర్చున్నాను కాబట్టి ఆయన కన్నా దూరంగా చూడగలుగుతున్నాను."

"అయితే ఏం కనిపిస్తోంది?" అని తిరిగి ప్రశ్నించారు. కాని శ్రీరామ్ మాత్రం జవాబు చెప్పలేదు. సమాజంలోని సభ్యులందరి ముందే తన భావాలు ఉంచి, తన నిర్ణయాన్ని కూడా చెపుతానన్నారు. వచ్చినవారంతా వెళ్ళిపోయారు. ఒక వారం తరువాత ఆర్యసమాజం కార్యాలయంలో మీటింగు ఏర్పాటయింది. ఆ రోజు 16 మార్చి కాబోలు. 70 మంది కార్యకర్తలు హాజరైయ్యారు. చర్చ విషయం ముందే తెలియ పరిచారు కాబట్టి అందరూ సన్నాహాలు చేసుకుని వచ్చారు. కొందరు శ్రీరామ్ తరఫున, కొంతరు వ్యతిరేకుల తరఫున ఉన్నారు. సాకార ఉపాసన ద్వారా ఎక్కువ మందిలో జాగృతి తీసుకొస్తున్నారు శ్రీరామ్ అని కొందరి నమ్మకం. కాని దాన్ని బలపరచడానికి వారి దగ్గర తర్కం లేదు. స్వామి దయానంద సూచించిన విధానాల వల్ల వారు నోరు విప్పలేకపోతున్నారు.

మీటింగ్ చాలా హంగామాతో మొదలైంది. వ్యతిరేకుల్లో ఒకరు, "ఈ మహానుభావుడు తనని తాను దయానంద స్వామి కన్నా గొప్పవాడిని అనుకుంటున్నాడు. ఆయన భుజం మీద కూర్చున్నాడట. ఇలాంటి వారిని నిందించాలి." అంటూ అరవడం మొదలుపెట్టారు. మిగిలిన వారు వంతు పాడారు. సమాజం పెద్ద వీర్‌సింగ్ గారు కలుగజేసుకున్నారు. "శ్రీరామ్‌కి తన మాట చెప్పే అవకాశం మనం ఇవ్వాలి. దయచేసి శాంతించండి" అంటూ మిగిలిన పెద్దలు కూడా ఒత్తిడి చేశారు. కాస్త శాంత వాతావరణం ఏర్పడ్డాక వీర్‌సింగ్ గారు శ్రీరామ్‌ని ఉద్దేశించి, "ఇక్కడి వారు చెప్తున్నది నిజమా? మీరు స్వామి దయానందగారి గురించి అభ్యంతరకరంగా ఏమైన మాట్లాడారా?" అని అడిగారు.

"ఒక పిల్లవాడు తన సంరక్షకుడి భుజం మీద కూర్చుని ఉండడం వల్ల మరింత దూరానివి కనబడుతున్నాయి, అని చెప్పడం అభ్యంతరకరమైన మాట అయితే, తప్పకుండా నేను దోషిని." శ్రీరామ్ తన స్వరంలో దృఢత్వాన్ని పెంచుతూ, "నేనన్నదల్లా ఒక్కటే. స్వామి దయానందుల వారు స్వయంగా నా మాట విని ఉంటే ఆయన కూడా ఒప్పుకునేవారు. ఆలోచనను ఆమోదించేవారు." అంతకు ముందు వారం అయిన సంభాషణ గురించి కూడా పూర్తి వివరణ ఇచ్చారు శ్రీరామ్. గొడవ చేస్తున్న సభ్యులు మొండిగా, విగ్రహారాధన గురించి మీ అభిప్రాయంతో పాటు మీ నిర్ణయాన్ని కూడా చెప్పండి అంటూ అరుస్తున్నారు.

ఆనాడు శ్రీరామ్ చెప్పినదాని సారం – హిందు సమాజంలో 90 నుండి 95% మంది సాకార ఉపాసననే నమ్ముతారు. వారి నమ్మకాన్ని పట్టించుకోకపోతే నొచ్చుకుంటారు. వైదిక పరంపర నుండి వారిని దూరం చేసినవారము అవుతాం. అనుచరులను తిరస్కరించి ఏ వేదిక కూడా స్థిరంగా నిలవలేదు. విగ్రహారాధనను అంత ఖరాఖండీగా కొట్టిపారేస్తే మనం ముందుకు సాగలేం. నమ్మేవారిని నమ్మనివ్వండి. నమ్మనివారు నమ్మరు.

"స్వామి దయానందులవారు ఒక సిద్ధాంతాన్ని స్థాపించారు. దానికి విరుద్ధంగా మనమెందుకు వెళ్ళాలి?" అని ఒక కార్యకర్త ప్రశ్నించాడు. శ్రీరామ్, "అసలు ఆ సిద్ధాంతాన్ని స్థాపించడానికి కారణం ఏమిటని కూడా మనం ఆలోచించాలి. స్వామి దయానందుల వారు శ్రద్ధ కన్నా వివేకానికి, తర్కానికీ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. గుడి, విగ్రహం, పూజ, ఆచారాల పేరిట జరిగే వ్యాపారం, అరాచకాలను, మోసాలను ఆయన నిరోధించారని నా ఉద్దేశం. అది చూసి దేవుడి పేరు చెప్పి డబ్బు సంపాదించేవారంతా ఉడికిపోయారు. కుట్రలు పన్నారు. ఫలితంగా ఆలోచనలు, వివేకాలను నేర్పే ఒక దిగ్గజాన్ని అంతం చేశారు. మనీషుల సమాజం ఒక చీకటి గుహలో తప్పిపోయింది.

శ్రీరామ్ చెప్పదల్చుకున్నదేంటంటే, "సామాన్య భావదశ కలిగిన వారికి ఆకారం అనేది చక్కటి మాధ్యమం. ఆ మాధ్యమంతో వారు తమలోని ఆధ్యాత్మిక గుణాలను వికసింపజేసుకుంటారు. ఆ మాధ్యమాన్నే తొలగిస్తే 90 నుండి 95% మనుషుల ఆత్మవికాసానికి అవకాశం లేకుండాపోతుంది. సామాన్యుల భావాలకు ఇక్కడ దారి కనిపించకపోవడం వల్లనే

**సత్పురుషులు చెప్పేది శ్రద్ధగా వినాలి, వారిని అనుసరించాలి**

ఆర్యసమాజం విస్తరించడం లేదు. ఆర్యసమాజం కార్యవిధానాల వల్ల లేదా కార్యకర్తల వ్యవహారం వల్ల వారి నమ్మకం సడలి పోతోంది."

వెంటనే మరో ప్రశ్న వేశారు, "విగ్రహారాధన అంటే మీ ఉద్దేశం ఏంటి? అది నిజంగానే ఈశ్వరోపాసన అవుతుందా? ఒక విగ్రహం ఏ మేరకు సృష్టికర్తకు ప్రాతినిధ్యం వహించ గలదు?"

"ఈశ్వరుడు సర్వవ్యాపి. కాబట్టి ఆయన విగ్రహంలో కూడా ఉన్నాడు. దాన్ని ఆరాధించడం వల్ల అది కూడా ఈశ్వరుని ఆరాధనే అవుతుంది. సాధకుడి చిత్తానికి ఒక ఆధారం కల్పిస్తుంది కాబట్టి విగ్రహం కూడా ఈశ్వరుని ప్రతీకే అవుతుంది. దాన్ని ఆధారం చేసుకుని సాధకుడు ఏకాగ్రత సాధించగలడు."

శ్రీరామ్ చెప్పుకుంటూ వెళ్తున్నారు. సమాజంలో సభ్యులు దీక్షగా వారి మాటలు వింటూనే ఉన్నారు. విగ్రహారాధనకు విరుద్ధమైన వారి భావాలు కరిగిపోసాగాయి. అంతలోనే తన మాట ముగిస్తూ, "ఇక నిర్ణయం విషయానికొస్తే, నన్ను ప్రధానిగా ఎన్నుకున్న మిత్రులే నిర్ణయించాలి. నా నిర్ణయం ఈ కాగితంలో వ్రాశాను. కాని నేను బాధ్యత వహించాలా, వద్దా అన్న విషయమై ఓట్లు వేయాలని విన్నవిస్తున్నాను. మిత్రుల భావన ఏమిటో తెలుస్తుంది. ఆ తరువాత ఈ కాగితం విప్పి, నా భావాలు చదవగలరు."

ఎన్నిక జరగింది. డెబ్బై మందిలో 38 మంది శ్రీరామ్ తరఫున నిలిచారు. 22 మంది ఆయన్ని తొలగించాలి అన్నారు. ఆధిక్యతను బట్టి శ్రీరామ్‌ను విజేతగా ప్రకటించారు వీర్‌సింగ్ గారు. విజేతగా ప్రకటిస్తున్నప్పుడే శ్రీరామ్‌ను వీలైనంతగా ఆర్యసమాజం భావాలను నిరాకరించడం లేదా సవరణలు చేయడం మానాలి అంటూ సలహా కూడా ఇచ్చారు.

"కాని మీరు నా అభిప్రాయం తెలుసుకోండి." అంటూ తను రాసిన ఉత్తరాన్ని చదవమన్నారు. అందులో, "ఆది, అంతంలేని సనాతన ధర్మానికి నేను వినమ్ర విద్యార్థిని, సాధకుడను. ఆర్యసమాజంలో నిశితమైన వివేకానికి, గొప్ప ఆలోచనలకి సంభావనలు ఉండేవి. వాటి ఆధారంగా మన సంస్కృతి, పరంపరల సేవ చేయవచ్చు అనుకున్నాను. కాని అది కష్టం అని కొంత కాలంలోనే తెలిసిపోయింది. కాబట్టి మేము వేరే దారి ఏర్పర్చుకుంటున్నాం. వేదిక మీద ఉండి మిత్రులకు ఇబ్బంది కలగజేయదల్చుకోలేదు. కాబట్టి దయచేసి సెలవివ్వండి.

సాధనలో, పోరాటంలో ఎప్పుడూ మీకు తోడుగా ఉంటానని మాట ఇస్తున్నాను. కలిసి మెలిసి చేయగల కార్యక్రమాలన్నిటికీ మిత్రులందరూ ఆహ్వానితులే. ఎటువంటి సహాయానికైనా, మార్గదర్శనానికైనా మేం సిద్ధంగా ఉంటాం."

ఆయన నిర్ణయం విన్నాక మారు మాట్లాడడానికి ఏమీ మిగలలేదు.

### అంచులకి చేరుకున్న స్వాతంత్ర పోరాట పథం

1945లో రెండో విశ్వయుద్ధం అయిపోయింది. ఆ కాలంలో దేశం మరెన్నో ఆటుపోట్లను చవిచూసింది. బ్రిటన్‌లో లేబర్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చింది. భారతదేశం నుండి తమ సార్వ భౌమత్వాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించుకుంది. ముస్లీమ్ లీగ్ నాయకుడు మొహమ్మద్ అలీ జిన్నా మొండితనం వల్ల సిమ్లా సమ్మేళనం విఫలమయింది. వర్కింగ్ కమిటీలో సగం కన్నా ఎక్కువమంది ముస్లీమ్ లీగ్ సభ్యులు ఉండాలని వాదించాడు.

అంతకు ముందు రెండు, మూడు సంవత్సరాలలో దేశ రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులను చూస్తే విభజన జరిగేటట్టే కనిపించింది. సిమ్లా సమ్మేళనం విఫలమవడం ఈ పరిస్థితిని ఇంకా బలపరిచింది. మతభేతం బలపడసాగింది. యుద్ధం తరువాత పరిస్థితులు, ఆంగ్లేయుల రాజకీయాలు, ప్రభుత్వంలో భాగస్వామ్యం కావాలనే కోలాహలం వల్ల ప్రజల్లో విపరీతమైన కోపం, అసంతృప్తి నిండాయి. చిన్న చితక సాకులకే హింసాత్మక ఉపద్రవాలు లేవనెత్తసాగారు. ఏ చిన్న సాకు దొరికినా జనాలు రోడ్డు మీదకొచ్చి కొట్లాడుకునేవారు. 1946 మొదట్లో ఆజాద్ హింద్ ఫౌజ్‌లో ఒక ముస్లీమ్ అధికారిని కోర్ట్ మార్షల్ చేశారు. సైనిక న్యాయాలయం తీసుకున్న తీర్పు అది. కలకత్తాలోని ముస్లీములు ఈ తీర్పుని వ్యతిరేకిస్తూ ఊరేగింపు చేసారు. మెల్లిగా అది హింసాత్మకంగా మారింది. ఎన్నో దుకాణాలను దోచుకున్నారు. ట్రామ్‌లకు నిప్పంటించారు. కొందరి ప్రాణాలు కూడా తీశారు.

సైన్యంలో, భద్రతా యంత్రాంగంలో ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్న సన్నివేశాలు బహిర్గతమైయ్యాయి. పోలీసులలో కూడా అసంతృప్తి

**తామసిక ఆహారం తీసుకునే వారి ఆలోచనా విధానం తామసికంగానే ఉంటుంది**

పెరిగిపోయింది. బొంబేలో గోదీ కార్మికులు ధర్నా చేశారు. ప్రపంచయుద్ధం వల్లనే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు గాంధీజీ. యుద్ధం తరువాత సమాజంలో కొంతకాలం వరకు వచ్చే నైతిక పతనం వల్ల విచ్చలవిడితనం పెరగడం ఊహించినదే. అది కాక హిందూ, ముస్లిముల మధ్య దూరం పెరగడానికి కుట్రలు పన్నడం మొదలుపెట్టారు. 1946 మార్చిలో బ్రిటన్ ప్రభుత్వ మంత్రుల దళం భారతదేశానికొచ్చింది. ముగ్గురు కాబినెట్ మంత్రులు వచ్చి నాలుగు నెలల్లో దేశంలోని ఐదు వందల మంది నేతలతో మాట్లాడారు.

దేశానికి స్వాతంత్ర్యాన్నిచ్చి, ప్రభుత్వ స్వరూపాన్ని నిర్ధారించడం కోసం ప్రముఖులందరితో చర్చించారు. 1946 మే లో కేబినట్ మిషన్ ప్రవేశపెట్టిన ప్రణాళిక ప్రకారం – భారత దేశానికి కేంద్ర ప్రభుత్వ రూపాన్ని ఇవ్వాలి (ఫెడరల్ ప్రభుత్వం). వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల ప్రతినిధులతో కలిసి ఏర్పడే కేంద్ర ప్రభుత్వానికి విదేశీ వ్యవహారాలు, భద్రత, ఆంతరిక వ్యవస్థ మరియు రవాణా క్షేత్రాల బాధ్యత ఉంటుంది. మిగిలినవన్నీ రాష్ట్రాల శాసన సభలు చూసుకోవాలి.

ఈ కాబినెట్ ప్రణాళికను అన్ని దళాలవారు, రాష్ట్రాలు ఒప్పుకున్నాయి. కాని ముస్లీమ్ లీగ్ మదిలో వేరే ఆలోచనలు ఉన్నాయి. వారికంటూ ప్రత్యేక రాజ్యం, అంటే దేశవిభజన కావాలి. ముందు కాబినెట్ మిషన్ ప్రతిపాదనలకు ఒప్పుకున్నప్పటికీ, పది వారాల లోపే వారి సమర్థతను తిరిగి తీసుకున్నారు. పాకిస్తాన్ కావాలంటూ నేరుగా ప్రకటించారు. ఈ ప్రకటనతో దేశంలో ద్వేషం, ఒత్తిడి, హింస అన్నీ లావాలాగా ప్రవహించాయి. ఆ మంటల్లో చాలాచోట్ల ప్రజలు కాలిపోసాగారు. ఇటువంటి మండుతున్న పరిస్థితుల్లో తన కర్తవ్యాన్ని నిర్ధారించడానికి శ్రీరామ్ మథురలో విద్వాంసులు, పండితులు మరియు సామాజిక కార్యకర్తలతో ఒక మీటింగ్‌కి పిలుపునిచ్చారు. ఆహ్వానించడానికి తామే స్వయంగా వారి ఇళ్ళకు వెళ్ళారు. అక్కడ పాకిస్తాన్ కావాలని ప్రకటించిన పన్నెండు రోజుల్లో ఇక్కడ మథుర (ఘియామండిలో) శ్రీరామ్ ఇంట్లో ధార్మిక నేతలు కూర్చొని ఉన్నారు. వచ్చిన ఏడుగురు పెద్దల్లో ముగ్గురు హిందువులు, ఇద్దరు ముస్లిములు, ఒక క్రైస్తవుడు, ఒక సిక్కు. హిందువుల్లో ఒకరు ఆర్యసమాజం నుండి వచ్చారు.

*– అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

---


# యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/–** **సం॥ చందా రూ॥ 150/–**

**3 సం॥ చందా రూ॥ 420/–** **10 సం॥ చందా రూ॥ 1300/–**

చందా రుసుమును ఇతర SBI బ్రాంచీల నుండి మా ఎకౌంట్‌కు చెక్ ద్వారా ఉచితంగా ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. ఇతర బ్యాంకుల నుండి కూడా NEFT ద్వారా ఉచితంగా డబ్బును పంపించవచ్చు. Cheque, Draft, Payable at Hyderabad ద్వారా కూడా డబ్బును పంపించవచ్చు. తరువాత బ్యాంక్ చలానా కాపీని మాకు పూర్తి వివరములతో పంపించగలరు. మా ఎకౌంట్‌లోని ఇతర బ్యాంకుల నుండి క్యాష్‌గా పంపినప్పుడు అదనంగా రూ. 50/– కలిపి పంపవలసి ఉంటుంది. M.O. ద్వారా కూడా డబ్బులు పంపించవచ్చును. అలా పంపించినప్పుడు మీ వివరములు ఈ క్రింది నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయగలరు.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు** బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**

ఖాతా నెం.: **32506416087** IFSC Code: **SBIN-0013272**

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట, అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు – 500018.

ఫోన్: 040–39560330


**సాత్విక ఆహారం వలన సాత్విక ఆలోచనలకు పునాది ఏర్పడుతుంది**

జీవన సాధనకు పావన ప్రేరణ

# త్యాగమయ జీవనమే సౌశీల్య సాధనం

అశోక చక్రవర్తి రాజ దర్బారులో కూర్చుని ఒక బౌద్ధ భిక్షువుతో మాట్లాడుతున్నాడు. సంభాషణ మధ్యలో రాజ కుమారుడు మహేంద్రుడు వచ్చాడు. భిక్షువులోని అనాసక్తి, ఆయన వాణిలోని గాంభీర్యమూ అతడిని ప్రభావితం చేశాయి.

"వీరు ఎవరు?" – అని అతడు తండ్రిగారిని అడిగాడు.

"వీరు మహాస్థవీరులు యోగాలి పుత్తతిస్. జన మానసాన్ని సంస్కరించడానికి, ప్రజలకు జీవన విద్యను బోధించడానికి వీరు తమ జీవితాన్ని సంఘానికి సమర్పించారు" – అని చక్రవర్తి జవాబిచ్చాడు.

"మరి సంఘం అంటే ఏమిటి? – అని మహేంద్రుడు అడిగాడు.

మహాస్థవీరులు ఇలా జవాబిచ్చారు –

"బాబూ! ప్రాపంచికమైన ఆకర్షణలను వదులుకుని, సమాజ హితం కోసం పర్యటించే వ్రతాన్ని స్వీకరించిన వ్యక్తుల సముదాయం సంఘం."

"నేను కూడా ఈ సముదాయంలో చేరాలని కోరుతున్నాను. నాకు పరివ్రాజకత్వం లభిస్తుందా" – అని మహేంద్రుడు అడిగాడు.

వద్దు బాబూ! సుఖభోగాలను అనుభవించే వయస్సు నీది. బాగా ఆనందించు. భోగ విలాసాలలో జీవితాన్ని గడుపు" – అని అశోకుడు అన్నాడు.

మహాత్యాగి అయిన అశోకునికి సైతం పుత్ర వ్యామోహం నశించలేదు.

రాజకుమారుడు ఇలా అన్నాడు –

"ప్రాపంచిక సుఖాలు నిస్సారమైనవి. సద్జ్ఞాన ప్రసారం మహత్తరమైనది. వివేకి శ్రేష్ఠమైనదానిని వదులుకుని నికృష్టమైనదానిని ఎందుకు స్వీకరిస్తాడు?"

పదహారు సంవత్సరాల వయస్సు గల మహేంద్రుడు చెప్పిన ఈ మాట మహాస్థవీరులనూ, అశోకుడిని, మహారాణిని నివ్వెరపరిచింది. మహాస్థవీరులు ఇలా అన్నారు –

"మహేంద్రుని అంతఃకరణలో బుద్ధదేవుని ప్రేరణ ఉప్పొంగినట్లు కనబడుతోంది. ఇతడు భవిష్యత్తులో దైవవాణిని ప్రసారం చేయవచ్చు."

తన ఆలోచనకు సమర్థన అందడంతో, మహేంద్రుడు తిరిగి ఉత్సాహంగా ఇలా అన్నాడు –

"తండ్రిగారూ! మీ ఆజ్ఞ అయితే, నేను నేడే పరివ్రాజ కత్వాన్ని స్వీకరిస్తాను. నేను పరివ్రాజకుడిని కావడం నాకు, తమకు కూడ శుభప్రదం."

మహాభిక్షువు ఇలా అన్నారు –

"మంచిదే బాబూ! పరివాౢజకత్వాన్ని స్వీకరించడానికి ఇరవై సంవత్సరాల వయస్సు ఉండాలి. అంతవరకు ఇంటిలోనే ఉండి ఆత్మ నిర్మాణం చేసుకో."

ఆ తర్వాత 20–21 సంవత్సరాల వయస్సులో మహేంద్రునికి మహాస్థవీరులు పరివ్రాజకత్వ దీక్ష ఇచ్చారు. అతడితోపాటు అతని చెల్లెలు సంఘమిత్ర కూడా పరివ్రాజకత్వాన్ని స్వీకరించింది.

అన్నా చెల్లెళ్ళు పర్యటిస్తూ, ప్రజలకు జీవన నిర్మాణ విధానాన్ని బోధించసాగారు. మహిళలలో కర్తవ్య నిష్ఠను, ఆత్మగౌరవాన్నీ మేలుకొలిపే బాధ్యతను సంఘమిత్ర నిర్వహి స్తోంది. దురాచారాలనూ, అవినీతిని నిర్మూలించే సాహసాన్ని మహేంద్రుడు పురుషులలో మేలుకొల్పుతున్నాడు.

మహేంద్రునికి 33 సంవత్సరాల వయస్సు వచ్చింది. ఒకరోజున మహాస్థవీరులు అన్నా చెల్లెళ్ళను పిలిపించి వారితో ఇలా అన్నారు –

"శ్రీలంకలోని ప్రజలు తమ సృజనాత్మక సామర్థ్యాన్ని కోల్పోతున్నారు. వారిలో చైతన్యాన్ని నింపడానికై మీరిద్దరూ అక్కడికి వెళ్ళాలి."

అన్నాచెల్లెళ్ళు అందుకు అంగీకరించారు.

తన తండ్రిగారు కలలు కన్న సాంస్కృతిక దిగ్విజయాన్ని నిజం చేయడానికి మహేంద్రుడు ఆ విధంగా ముందడుగు చేశాడు.

**సాత్విక ఆహారం తీసుకునేవారి శరీరం రోగరహితంగా ఉంటుంది**

అన్నాచెల్లెళ్ళు ఎక్కిన నావ తుఫానులో తలక్రిందులు అయింది. అయినా వారు వెనుకంజ వేయలేదు. సముద్రంలో ఈదుతూ ముందుకుపోయారు. అదృష్టవశాత్తు వారికి మరో నావ దొరికింది. వారు శ్రీలంక చేరారు.

రాజధానికి అడవిగుండా ప్రయాణం చేస్తున్నారు. త్రోవలో ఒక లేడి క్రిందపడి విలవిల కొట్టుకుంటోంది. దాని గొంతులో గుచ్చుకున్న బాణాన్ని బయటికి తీసేసరికి, అది ప్రాణాలు కోల్పోయింది. ఈలోగా ఆ బాణం వేసిన వేటగాడు అక్కడికి వచ్చాడు. "ధర్మ సమ్రాట్టు తిష్య పాలనలో వినోదం కోసం నిర్దయగా మీరిలా ప్రాణులను హింసించడం తగునా?" – అని మహేంద్రుడు అతనిని చూస్తూనే అడిగాడు.

రాజు దుస్తులలో ఉన్న ఆ వేటకాడు మహేంద్రుని కాళ్ళమీద పడ్డాడు. "మహానుభావా! నావల్ల పొరపాటు జరిగింది. నేనే సమ్రాట్ తిష్యను."

సమ్రాట్ తిష్య ఇద్దరినీ సాదరంగా రాజ భవనానికి తీసుకువెళ్ళాడు. మరునాడు మహేంద్రుడు తిష్యకు జీవన పథాన్ని గురించి బోధించాడు. పర్యటనకు బయలుదేర బోయాడు. "ఇక్కడే మీ ప్రచారం చాలా అవసరం. ఇక్కడి నుంచే మీ సందేశాన్ని ప్రజలకు అందించండి" – అని తిష్య అతడిని కోరాడు.

ఈ మాటలతో మహేంద్రునికి అక్కడి మత ప్రచారకుల ధోరణులు అవగతం అయినాయి. అతడు పర్యటనకు బయలు దేరి బౌద్ధ విహారాలను పరిశీలించాడు.

మామూలు సంసారులకన్న మిన్నగా అక్కడి విహారాల అధిపతులు భోగ విలాసాలలో మునిగి ఉన్నారు. భిక్షువులు మతం పేరుతో విలాస జీవితం గడుపుతున్నారు. సేవా మార్గం భోగ మార్గంగా మారిపోయింది. ఇక ప్రజా జీవితం అస్తవ్యస్తం కాకుండా ఎలా ఉంటుంది?

అన్నా చెల్లెళ్ళు తపస్సాధన మార్గాన్ని అనుసరించారు. వ్యక్తి నిర్మాణాన్ని ప్రారంభించారు. దారి తప్పిన పరివ్రాజకులను సమాజంపట్ల వారి కర్తవ్యాన్ని బోధించారు. ధార్మిక రంగాన్ని క్షాళన చేస్తూ విస్తృతంగా పర్యటించారు.

అరవై సంవత్సరాల వయస్సు వరకు ప్రజా జీవనాన్ని సంస్కరిస్తూ నిర్విరామంగా కృషి చేసి, మహేంద్రుడు చైత్య పర్వతం మీద చాతుర్మాస్యం జరుపుతూ శరీరాన్ని వదిలాడు. చెల్లెలు అతడి కార్యాన్ని కొనసాగిస్తూ కొంత కాలానికి శరీరాన్ని వదిలింది.

అశోక చక్రవర్తికి కుమారులు అయిదుగురు. మిగతా నలుగురి పేరులు కాలగర్భంలో కలిసిపోయాయి. ఒక్క మహేంద్రుడే చరిత్రలో అమరుడై నిలచాడు.

వాస్తవానికి – మనిషి గొప్పతనం అధికారంలో లేదు, పదవిలో లేదు. త్యాగమయ జీవనంలో ఉంది, నిష్కళంకమైన సౌశీల్యంలో ఉంది.

త్యాగమూర్తులూ, శీలసంపన్నులు అయిన అలాంటి యువతీ యువకులను పరివ్రాజక సంప్రదాయం నేడు మరో మారు ఆహ్వానిస్తోంది.

★★★

## కుశలుడైన నరుడు - పరాక్రమమైన సంతానం

*అంజనాదేవి యుక్త వయస్కురాలు కావటంతో తండ్రి వరాన్వేషణ ప్రారంభించ టంతో ఆమె నిరాకరిస్తూ "సాధారణ గృహిణుల వలె జీవించటం తనకు ఇష్టం లేదన్నది. మహాపరాక్రమవంతుడు జీవన సహచరుడుగా లభిస్తేనే వివాహం చేసుకొంటానని తెలియజేసింది.*

*ఒకనాడు పెద్ద ఏనుగులదండు ఋషుల ఆశ్రమాలను కూలత్రోయడం చూచిన యువకేసరి పరాక్రమంతో ముందుకు ఉరికి ఏనుగులదండును తరిమికొట్టాడు. ఇది చూచిన అంజనాదేవి తండ్రి, కేసరి అంజనకు తగిన వరుడుగా నిర్ధారించి అతడితోనే వివాహాన్ని జరిపించాడు. సంతానం విషయంలో కూడా అంజన ఇదేవిధంగా తన అభీష్టాన్ని నెరవేర్చుకోదలచి వాయుదేవుడిని భక్తిప్రపత్తులతో ఆరాధించింది. ఆ విధంగా ఆమె పవనపుత్రుడైన హనుమం తునికి జన్మనిచ్చింది. బాల్యంలోనే పర్వతాలను విరుగగొట్టే హనుమాన్ పెరిగి పెద్దవాడై అవతారమూర్తి శ్రీరామచంద్రుని కార్యభారాన్నే మోయగల్గినంత శక్తివంతుడైనాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**మత్తుమందు తీసుకునేవారి దూరదృష్టి, వివేకం నశిస్తాయి**

# నాలుగు సూత్రాల జీవన సాధన

ఉత్కృష్టతవైపు పయనించాలంటే ఆదర్శాలను స్వీకరించాలి. తమ జీవితాలను పూర్తిగా ఆదర్శాలతో నింపుకున్న మహానుభావుల జీవితాలలో ప్రేరణలు అవతరించాయి, సంవేదనలు వృద్ధి పొందాయి, ఆశీస్సులు పుష్పించాయి. వారి విధానాలు వేరుకావచ్చు.

మహాత్మాగాంధీ భగవద్గీతను తన ఆదర్శంగా స్వీకరించే వారు. భగవద్గీతను ఆయన గీతామాత అని పిలిచేవారు. ఆచార్యవినోబా కూడ గీతను గీతాఈ (గీతామాత) అని వర్ణించే వారు. నిష్కామ కర్మ వారిద్దరికీ జీవన పథం. దానికి వారు అనాసక్తి యోగమని పేరుపెట్టారు. 'నాకు సమస్య ఎదురయ్యి నప్పుడల్లా గీతామాత దానికి పరిష్కారం చూపేది' – అన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్‌లకు ఆదర్శం దేశభక్తి. వారు తమ సమస్త భావనలనూ, ఆలోచనలనూ దేశభక్తిలో ముంచివేశారు; దేశభక్తిలో క్షాళన చేశారు. వారి జీవితాలలోని ప్రతి శ్వాస జాతికోసం అర్పితమయింది. భరతమాతయే వారికి సర్వస్వం. వారు భరతమాత కోసం జీవించారు. ప్రతి క్షణం మాతృభూమి స్వేచ్ఛ కోసం సంఘర్షణ జరుపుతూ వచ్చారు. చివరకు అందుకోసమే బలి అయ్యారు. ఆ ఆదర్శం కారణంగా వారి జీవితాలు అజరామరములు అయ్యాయి.

పవిత్ర జీవితాలను కూడ మనం ఆదర్శాలుగా స్వీకరించ వచ్చు. స్వరాజ్య ఉద్యమంలో పలువురు యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని దేశసేవకు అంకితం అయ్యారు. ఆయన వ్యక్తిత్వాన్ని హృదయంలో ధారణచేసి, పలువురు జీవ–సేవకు అంకితం అయినారు. రామకృష్ణ మిషన్ ఇలాంటి వ్యక్తులను కలిపిన సంస్థ.

స్వామి వివేకానందను ఆదర్శంగా చేసుకున్న వ్యక్తులు ఆయన పేరు వల్లిస్తూ కూర్చోలేదు. ఆయనవలె జీవించే సాహసం చేశారు. ఆదర్శాన్ని స్వీకరించడం అంటే అర్థం ఇదే! తన ఆదర్శ వ్యక్తిత్వానికి అనుగుణంగా ఆలోచించడం, జీవిత విలువలను ఎంపిక చేసుకోవడం, వాటికి అనుగుణంగా పవిత్రమైన జీవన సరళిని అవలంభించడం. ఆదర్శం పట్ల ప్రేమకు గీటురాయి ఇదే. ఈ గీటురాయి మీద గీసినప్పుడు అన్నివిధాలా నిగ్గు తేల్చాలి – అందుకోసం ఎన్ని కష్టాలను భరించవలసి వచ్చినా, ఎన్ని ఆపదలను ఎదుర్కొనవలసి వచ్చినా చెదరని విశ్వాసంతో ఉండాలి.

ఈ యుగంలో మనందరిముందూ యుగ ఋషి పరమపూజ్య గురుదేవుల ఆదర్శం ఉన్నది. వారి ప్రఖర తేజోమయ జీవితం, శ్రేష్ఠతమ జీవనసాధన, దేశధర్మాల కోసం ధరిత్రి కోసం తమ అణువణువునూ ఆహుతి చేయాలనే భావన ఎవరికైనా ఆదర్శాలు కావచ్చు. పలువురికి ఆదర్శాలు అయ్యాయి కూడా. దేశ విదేశాలలోని కోట్లాది యువతీ యువకులు, మేధావులు, భావనాశీలురు, కౌమారదశలో ఉన్న వ్యక్తులు ఆయన వ్యక్తిత్వాన్ని తమ ఆదర్శంగా స్వీకరించారు; వారు నిర్ణయించిన కొలబద్ధలకు అనుగుణంగా జీవించే సాహసం చేస్తున్నారు. వారిలో పలువురు ఈ క్షణంలో ఈ వాక్యాలను చదువుతూన్న వ్యక్తులలో ఉన్నారు.

ఇతరులు కూడ ఆ మార్గాన్ని అనుసరించి జీవన సాధనను ప్రారంభించవచ్చు. వారు దిగువ పనులు చేయవచ్చు –

1. యుగఋషి గురుదేవుల గురించి చదవడం. ఆయన వ్యక్తిత్వంలోని ప్రతి కోణం గురించి ప్రగాఢంగా మననం చేయడం.

2. గురుదేవులతో ప్రగాఢమైన భావనాత్మక సంబంధాన్ని ఏర్పరచుకోవడం – నిరంతర చింతన ద్వారా.

3. గురుదేవులు స్థాపించిన తప, త్యాగ, సేవల విలువల పట్ల నిష్ఠను పెంపొందించుకోవడం.

4. తపం, సేవ, దేశభక్తి – వీటి కోసం క్రమపద్ధతిలో ముందడుగు వేయడం.

ఈ నాలుగు సూత్రాల కార్యక్రమాన్ని అమలుచేసిన వ్యక్తి జీవితం యుగఋషి జీవితానికి అనుగుణంగా రూపొందు తుంది. ఈ ప్రపంచంలో కార్యశీలంగా ఉంటున్నప్పటికీ – ఆ వ్యక్తి జీవన చేతనత్వం గురుదేవుల సమీపంలోనే ఉంటుంది.

★★★

**ప్రతి వ్యక్తి తన పరిస్థితులకు తానే కారణం**

# అధికార వాంఛయే అభ్యుదయానికి అడ్డుగోడ

ప్రజాసేవకుడు వినమ్రంగా ఉండాలి. సహచరుల కన్న మరింత త్వరగా వెలుగులోకి రావాలని ప్రయత్నించే వ్యక్తి బోర్లపడి పళ్ళు విరగగొట్టుకుంటాడు.

సుందుడు, ఉపసుందుడు ఒక సుందరి కోసం తమలో తాము కలహించి నాశనం అయినారు. మొగలులు పెక్కు తరాల వరకు తండ్రుల, సోదరుల ఛాతీలపై ఎక్కి సింహాసనాలను వశపరచుకున్నారు. సంస్థలు ముక్కచెక్కలు కావడానికి ప్రధాన కారణం పదవీ వ్యామోహమే. యుధిష్టిర చక్రవర్తి యొక్క అనుశాసనానికి బద్ధులై ఉండకుండా బరితెగించిన కౌరవులు తమ అన్యాయాలకు ప్రతిఫలంగా మహాభారత యుద్ధంలో నాశనం అయినారు. శ్రీకృష్ణుని యాదవవంశంలోని వారు తమ ప్రత్యేకతను చాటుకోవడానికి, ఇతరులను కూల్చి వేయడానికి ప్రయత్నించిన ఫలితంగా సామూహిక ఆత్మ వినాశానికి గురి అయినారు.

కనుకనే వేదవ్యాస మహర్షి ఇలా హెచ్చరించారు –

**బహవః యత్ర నేతారః బహవ మానకాంక్షిణః ।**
**సర్వే మహత్త్వమిచ్ఛంతి, సదళ అవసీదతి ॥**

అనగా – పలువురు నాయకులు అయితే, పలువురు పేరు ప్రతిష్ఠలను కోరితే, పలువురికి కీర్తి కాంక్ష ఉంటే – ఆ దళం చివరికి నాశనం అవుతుంది.

కనుక – ప్రజాసేవకులూ, యుగ శిల్పులూ కీర్తి కండూతికి గురి కాకూడదు.

రాజసూయ యాగంలో శ్రీకృష్ణుడు అతిథుల కాళ్ళు కడిగే పనిని కావాలని చేపట్టాడు. గాంధీజీకి కాంగ్రెసు సంస్థలో పదవి ఏదీ లేదు. అయినా, ఆయన అందరినీ మించి సేవ చేయగలిగారు, గౌరవం పొందగలిగారు. రామ భరతులు రాజతిలకం అనే బంతిని ఒకరిపై మరొకరు విసరడానికి విశ్వ ప్రయత్నం చేశారు. మహామంత్రి ఆర్య చాణక్యుడు కుటీరంలో నివసించాడు. జనక మహారాజు పొలం దున్నేవాడు. నసీరుద్దీన్ పాదుషా టోపీలు కుట్టేవాడు.

మరోప్రక్క–నహుష చక్రవర్తి ఋషులచేత తన పల్లకీ మోయించి, పాముగా మారాలనే శాపాన్ని పొందాడు. పీష్వాల ప్రధాన న్యాయాధిపతి రామశాస్త్రి భార్య విలువైన వస్త్రాలతో, ఆభరణాలతో రాజమహలు నుండి తిరిగివచ్చినప్పుడు – ఆయన ఇంటి తలుపులు మూసివేసి ఇలా అన్నారు – "బ్రాహ్మణుని భార్య అపరిగ్రహ ఆదర్శాన్ని పాటించాలి. అలా చేయకపోతే – ఆమె వినమ్రత నశించిపోతుంది. మనం కూడ ద్రోణాచార్యునివలె నౌకర్లం అయిపోతాము."

సిక్కుల ఆరవ గురువు అర్జునదేవ్ అంట్లు తోమే పనిచేసేవాడు. గురు రామదాస్ అర్జునదేవ్‌ను తన వారసునిగా ప్రకటించారు. అతడు నమ్రతలో, నిరాసక్తిలో, అనుశాసన పాలనలో అగ్రగణ్యుడు కనుక.

సన్యాసాన్ని స్వీకరించే సమయంలో వ్యక్తి తన వంశాన్ని, కీర్తిని, పదవినీ, గౌరవాన్ని, గత చరిత్రనూ మరచిపోవలసి ఉంటుంది. సేవా ధర్మం ఒక విధమైన సన్యాస సంప్రదాయం.

గాంధీగారి సబర్మతి ఆశ్రమంలో చిన్నా పెద్దా అందరూ పాయిఖానాలను శుభ్రపరచివలసి వచ్చేది. ఆచార్య వినోబా గారి పవనార్ ఆశ్రమంలో ఆశ్రమవాసలందరూ బావి నుండి నీళ్ళు తోడేవారు, కాపలా కాసేవారు. శాంతికుంజ్‌లోని ప్రతి కార్యకర్త పారిశుద్ధ్యపు పనిని, కాపలా పనిని స్వయంగా చేయవలసి ఉంటుంది. స్కౌటింగ్‌లో అనుశాసన పాలనయే ప్రాధాన్యానికి ప్రతీకగా పరిగణించబడుతుంది. పదవీ వ్యామోహపరులకు స్వచ్ఛంద సంస్థలలో స్థానం ఉండదు.

గురుద్వారాలలో శ్రద్ధాళువులు అతిథుల పాదరక్షలను శుభ్రపరుస్తారు. మహిళలు తమ చెంగులతో మెట్లు శుభ్రపరుస్తారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి శ్రీమతి గోల్డా మేయర్ ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయానికి స్వయంగా వచ్చేవారు. నిలబడి, నడుస్తూ నడుస్తూ ఉద్యోగులకు మార్గదర్శనం చేసేవారు. కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ సైకిల్‌మీద కార్యాలయానికి వెళ్ళేవారు.

సాధు, బ్రాహ్మణ సంప్రదాయంలో అపరిగ్రహానికీ, నిరాడంబరతకూ, మితవ్యయానికీ, నమ్రతకూ ప్రాధాన్యం ఇవ్వబడేది. విలాసాలు, అహంకారం, పొగరు, కటుభాషణ ఆ రంగంలో హేయములుగా పరిగణించబడేవి.

ఒక మహా మిషన్‌లో సభ్యులయిన కారణంగానే యుగ శిల్పులు గౌరవాన్ని పొందుతారు. వారు 'నేను' కు బదులు 'మేము' అనే పదాన్ని వాడాలి. అందరి కృషి ఫలితంగా సాఫల్యం లభిస్తుంది. ఆ విషయం యుగశిల్పులు వాడే 'మేము' అనే పదం ద్వారా వ్యక్తమవుతుంది. కర్తవ్య పాలనకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. అధికారానికి అర్రులు చాచకూడదు. ఈ నిరహంకారమనే ఎరువునూ, నీటిని అందుకుని – సప్త మహావ్రతాలు కల్పవృక్షం వలె సాఫల్యాలను సాధించిపెడతాయి.

★★★

**కాయలు ఉన్న చెట్టుకే రాళ్ళదెబ్బలు**

# నిజమైన ప్రేమ

ఆర్ద్రమైన సంవేదన జీవన సాధనకు ఇరుసు. కేంద్ర బిందువు. సంవేదనలు సంస్కరించబడితే, జీవితంలో మహత్తర మైన సంతృప్తి అనుభవమవుతుంది.

భావనలు సక్రమంగా అంకురిస్తే, వాటికి ఎరువూ నీరూ సక్రమంగా అందితే – జీవితంలో అద్భుతమైన పరివర్తన వచ్చి తీరుతుంది. అలాంటి వ్యక్తి సద్గుణాలన్నింటికీ స్వామి అవుతాడు. అతడి వ్యక్తిత్వ సుగంధంతో వాతావరణమంతా గుబాళిస్తుంది. సంవేదనశీలతలోని ఆకర్షణ దానికదిగా సద్గుణాలను సృష్టిస్తుంది.

భావనలు పంచితే అందుతాయి. వెదజల్లితే పెంపొందు తాయి. పోగుచేస్తే మాత్రం నశించిపోతాయి. కనుక – భావనాత్మక సంతృప్తిని కోరే వ్యక్తి తన భావనలను పీడితులకూ, తాడితులకూ పంచిపెట్టాలి. పరమపవిత్రమైన ఈ నిష్కామ కర్మ ఇచ్చే సత్ఫలితం అపారమైన సంతృప్తి.

స్వామి రామతీర్థ అమెరికాలో విస్తృతంగా పర్యటించారు. తపస్సు, జ్ఞానం, ప్రేమల త్రివేణిలో నిరంతరం స్నానం చేయడం వల్ల ఆయన వ్యక్తిత్వంలో అలౌకికమైన ఆకర్షణ ఆవిర్భవించింది. అసంఖ్యాకులైన వ్యక్తులు వ్యథలతో వేదనలతో పరుగు పరుగున ఆయన వద్దకు వచ్చేవారు. నవ్వుతూ తుళ్ళుతూ తిరిగివెళ్ళేవారు.

ఒక రోజున ఒక మహిళ ఆయనవద్దకు వచ్చింది. అంతులేని విషాదంతో వచ్చింది. దుఃఖ భారంతో ఉన్న ఆమెకు మాటలు పెగలలేదు. చాలాసేపు అలా బొమ్మలా కూర్చుండి పోయింది. రామతీర్థ కరుణతో ఆర్ద్రమైన కళ్ళతో ఆమెను పరికిస్తున్నారు.

వెలుగును వర్షిస్తున్న ఆ చూపు ఆమె హృదయపు లోతులను తాకింది. కరుడుకట్టిన ఆమె విషాదం కరిగి కన్నీరుగా వెలికివచ్చింది. కన్నీళ్ళు కార్చుతూ, పూడిపోయిన గొంతుతో ఆమె తన విషాదగాథను వివరించింది.

ఆ కథ సారాంశం ఇది – ఆమె ప్రేమించి మోసపోయింది. తనువూ, మనసూ, ధనమూ, జీవితమూ అన్నీ నిస్సారం అయిన తర్వాత ఆమె మోసగించబడింది. ఆమెకు మిగిలింది హతాశయే.

ఆ కథ విన్న స్వామీజీ గంభీరంగా ఇలా అన్నారు – "సోదరీ! ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కడూ తన సామర్థ్యానికి అనుగుణంగా వ్యవహరిస్తాడు. తనవద్ద ఉన్న శారీరిక, మానసిక, బౌద్ధిక, భావనాత్మక సామర్థ్యాన్ని బట్టి మనిషి ప్రవర్తిస్తాడు. స్వార్థంతో, కుటిలతతో నిండిన వ్యక్తి క్షమకు మాత్రమే పాత్రుడు. ప్రేమపూరిత హృదయంతో అతడిని క్షమించాలి."

"అయితే జీవితంలో నిజమైన ప్రేమను పొందడం అసాధ్యమా" – అని ఆ మహిళ అడిగింది.

స్వామీజీ ఇలా అన్నారు –

"అసాధ్యం కానే కాదు. నిజంగా ప్రేమించే వ్యక్తికి నిజమైన ప్రేమ అందుతుంది."

"నా ప్రేమ స్వచ్ఛమైనదే" – అన్నది ఆ మహిళ.

"కాదమ్మా. నీ ప్రేమలో స్వార్థపు కోరిక ఉంది. దానిలో వాసన అనే విషం ఎంతో కొంత ఉంది. నిజమైన ప్రేమ సేవగా, కరుణగా, శ్రద్ధగా మాత్రమే వ్యక్తం అవుతుంది."

రామతీర్థ మాటలలోని సారం ఆమెకు అవగతమయింది. ప్రేమ ఇవ్వబడేది మాత్రమే. అందులో పొందాలనే కోరిక ఉండదు. వాసన, తృష్ణ, అహంల నుండి విముక్తి పొందిన భావనల పేరే ప్రేమ. ఈ బోధనను ఆమె జీర్ణం చేసుకున్నది. ఒక ఆసుపత్రిలో నర్సుగా చేరింది. నిష్కామ సేవా మార్గంలో ఆమె భావనలు ప్రవహించాయి.

చాలా రోజుల తర్వాత ఆమె రామతీర్థను తిరిగి కలుసు కున్నది. ఆమె వ్యక్తిత్వంలో అపురూపమైన మెరుపు ఉంది. సంతృప్తి ఇచ్చిన మెరుపు అది. అంతే కాదు. పలువురి స్నేహ భావనలు అడగకుండానే ఆమెకు అందుతున్నాయి. పవిత్ర ప్రేమ ఆమె జీవితాన్ని ధన్యం చేసింది.

వాస్తవానికి – ఇస్తున్న వ్యక్తికే ఆర్ద్ర సంవేదనల రహస్యం తెలుస్తుంది.

★★★

**పనిచేసేవాళ్ళకే విమర్శలు వస్తాయి**

# సరియైన నాయకత్వం

సౌమనస్యాన్నీ, సమన్వయాన్నీ, మార్గదర్శన సామర్థ్యాన్నీ వ్యక్తిత్వంలో నింపుకుంటే - మనిషిలో నాయకత్వ లక్షణం కనిపిస్తుంది. వ్యక్తి కాక - గుణాలే ఆరాధనీయాలూ, అనుకరణీయాలూ అవుతాయి. గుణవంతుడైన వ్యక్తి యొక్క మార్గదర్శనాన్నే ప్రజలు కోరుతారు.

అయితే - నాయకత్వం పేరిట అధికారపు అహంకారం తిష్టవేస్తే - ఆ నాయకత్వానికి లోనయిన వ్యక్తులు కుంచించుకు పోతారు. అహంకారంలో, అధికార మదంలో మునిగిపోయిన వ్యక్తి ఏనాడు ఎవరికీ ప్రేరణ ఇవ్వలేదు. అతడి చుట్టూ చేరేవారు అతని అడుగులకు మడుగులు ఒత్తుతారు. అయినా వారికి అతని పట్ల నిజమైన సద్భావన ఉండదు.

మనిషి జీవితంలోని ప్రతి కోణమూ ప్రేరణను ఇవ్వాలి. అతడిలో మహాసాహసపు ప్రచండ శక్తి పెల్లుబుకుతూ ఉండాలి. లక్ష్యం కోసం తన కణ కణాన్ని ఆహుతిచేసే సామర్థ్యం అతడికి ఉండాలి. అతడి సౌశీల్యపు సువాసన అనుచరులను ఆకర్షించాలి. తన వినమ్రతతో, సద్భావనతో, సహనంతో అతడు తన బృందంలో సమన్వయాన్ని సాధించగలగాలి. తన బృందపు ప్రయోజనం కోసం తన స్వార్థాన్ని బలిచేయడానికి అతడు సదా సన్నద్ధం కావాలి. అలాంటి మనిషే నాయకుడవుతాడు. అలాంటి నాయకత్వంపై నలువైపుల నుంచి సద్భావం, శ్రద్ధల అభిషేకం జరుగుతుంది. అతడు చేసే ఒక్క సైగ కోట్లాది ప్రజలలో ప్రాణాన్ని నింపుతుంది. లక్షలాది ప్రజలు అతడి మాటల ఆకర్షణలో మునిగిపోతారు.

జీవితపు చివరి సంవత్సరాలలో పరమపూజ్య గురుదేవుల హృదయం దేశంలోని నాయకత్వపు కొరతపట్ల తీవ్రంగా వ్యధ చెందింది. ఆ వేదన ఇలా వ్యక్తమయింది -

"సంస్థలు అధోగతి చెందుతున్నాయి. చిన్న చిన్న విషయాల కోసం జనం ఇతరులను ప్రాధేయపడుతున్నారు. ఇందుకు కారణం సమర్థ నాయకత్వం లోపించడమే."

కార్యకర్తలకు ఆయన తరచు ఇలా హితవు చెప్పేవారు -

"యోగులూ, తాపసులూ, సాధువులూ కాక - దేశానికీ సమాజానికీ దారిచూపగల, బలిదానం చేసే జీవశక్తి కలిగిన ప్రజాసేవకులు కావాలి.

"నాయకత్వం మాటల ద్వారా కాక క్రియలద్వారా అమలు జరుగుతుంది. సిద్ధాంతాల కోసం బలిదానం కావడానికి అనుక్షణం సిద్ధపడిన మహాత్మాగాంధీ, సర్దార్‌పటేల్, సుభాష్ చంద్రబోస్‌ల వంటి నాయకులు నేడు అవసరం."

ఆయనలోని ఈ వేదనను తొలగించడానికి సిద్ధంగా ఉన్నామా - అని మనల్ని మనం పరీక్షించుకోవాలి. సిద్ధంగా ఉంటే - అందుకోసం మనం సద్గుణాల సముద్రంలో సాహసంగా ఈదాలి. మీ రంగంలో అర్హతను శిఖరాగ్రానికి పెంచుకోవడానికి మీరు ఉద్యమించాలి. అర్హతతోపాటు- సాహసాన్నీ, శక్తినీ మీరు పెంపొందించుకోవాలి. ఆ గుణాలను మీ సహచరులకు అలవరచగలగాలి. మనం మన సహచరుల గుణాలను వెదికి పట్టుకోవాలి. వాటిని ఇతర సహచులకు చెప్పాలి. అందువల్ల మీ బృందంలో పర్పసర విశ్వాసం పెరుగుతుంది. కీర్తికి, సన్మానానికి ముందుకు రాకపోవడమే మంచిది. మీ స్థానంలో ఆ అవకాశాన్ని మీ సహచరులకు ఇవ్వాలి. అలా చేయడం వల్ల సహచరుల మనస్సులలో నాయకత్వం పట్ల గల విశ్వాసం పెరుగుతుంది.

మాటలతోనూ, భావనాత్మక కార్యములతోనూ మీరు మీ సహచరులకు ప్రేరణ ఇవ్వాలి. వారిని ప్రోత్సహించాలి. ఇందువల్ల సహచరుల భావనలు మరింతగా బలపడతాయి. వారి కార్యశూరత పెరుగుతుంది. పరస్పర సమన్వయం మరింత మధురం అవుతుంది.

సహచరులలో ఒకరి లోపాలను మరొకరికి చెప్పకూడదు. చెప్పితే - పరస్పర సద్భావనలు క్షీణిస్తాయి.

కొత్త కొత్త పథకాలను రూపొందించండి. వాటిని అమలు చేసే సామర్థ్యాన్ని పెంచుకోండి. మీ నాయకత్వంలో నడుస్తున్న సంస్థ యొక్క ప్రగతిని వేగవంతం చేయడానికి కార్య ప్రణాళికలను తయారు చేయండి. అవి సమయోచితంగా ఉండాలి. వాటిని అమలు చేయడంలో ఏయే దశలు ఏయే సమయాలకు పూర్తికావాలో ఆచరణాత్మకంగా నిర్ణయించండి. పథకం ప్రతి దశలో మీ సహచరులను భాగస్వాములను చేయడానికి ప్రాధాన్యం ఇవ్వండి.

పై లక్షణాలను మీలో క్రమంగా వికసింపజేసుకుంటే - మీరు మీ రంగంలో నాయకత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించ గలుగుతారు.

★★★

**ఒక మంచిపని చేసినప్పుడు అది అందరికి నచ్చకపోవచ్చు**

మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-8

# అవ్యాజమైన మాతృప్రేమ



తన పిల్లలను సంస్కారవంతులను చేయడానికి మాతాజీ నిరంతరము ప్రయత్నిస్తూ ఉండేది. గాయత్రీ తపోభూమి మరియు అఖండజ్యోతి సంస్థాన్‌లో నివసించేవారు, పనిచేసేవారు మరియు వచ్చి వెళ్ళే వారు అందరూ ఆమె పిల్లలే. వీరందరికీ ఆమె స్వంత తల్లే. తల్లి ఎవరు? అనేదానిమీద ఆమెకు ఒక విశేషమైన నిర్వచనము ఉండేది. మాటల మధ్యలో ఆమె ఇలా అంటూండేవారు – 'జన్మ నిచ్చే ఆమె జనని. కానీ సంతానమునకు సంస్కారమునిచ్చి వారి జీవితములను మంచి మార్గం లోకి సరిదిద్దడానికి ప్రతి నిముషము, ప్రతీక్షణము ప్రయత్నించే ఆమే తల్లి. తన పిల్లలను పైకిలేపటానికి, వారిని ముందుకు తీసికెళ్ళటానికి వారి ఆంతరిక వికాశము కొరకు తల్లి రాత్రి పగలు శ్రమిస్తుంది. ఉత్తమ సంస్కార బీజారోపణతోనే మానవ జీవితము నిజంగా సవరించబడు తుంది. దీనితోనే తల్లి యొక్క మాతృత్వ సాధన సఫలత ప్రామాణికమవుతుంది.' ఆమె ఇలా అంటూండేది. 'నేను మీ అందరి జననికాను. కానీ మీ అందరికి మంచి సంస్కారమిచ్చే నిజమైన తల్లిని.'

తన కథానుసారం ఆమె నిరంతరము ఈ లక్ష్యము వైపే ప్రయత్నశీలురాలై ఉండేది. ఆమె మాటలలో, చేతలలో ఆమె దగ్గరికి వచ్చే ప్రతివారికి ఈ సత్యము కనిపిస్తూండేది. ఆమె ద్వారా పెట్టబడే భోజనములో ఇది చాలా ఎక్కువ పరిమాణ ములో కనిపించేది. పరమపూజ్య గురుదేవులు పరిజనులకు, కార్యకర్తలకు చాలా స్పష్టంగా తెలిపేవారు. ఆయన ఇలా అనేవారు. 'మీరు మాతాజీని సాధారణ వ్యక్తి అని అనుకోకండి. ఆమె శక్తిస్వరూపిణి! ఆమె మహాశక్తి! తన ఆధ్యాత్మిక ఐశ్వర్యమును దాచుకొని అతిసాధారణముగా జీవించుచున్నది. ఆమెను గుర్తించుట మరియు ఆమెను సవ్యంగా అర్థము చేసుకొనుట అంత తేలిక కాదు. మీయొక్క పనులు ఆమె ఎంత సులభంగా చేసిపెట్టగలదో అంత బాగా నేను కూడా చేయలేను. ఈ విషయమును మీరెంత అర్థము చేసుకుంటారో నాకు తెలీదు. కానీ నిజమేమిటంటే ఆమె సంపర్కమాత్రంతో పూర్వజన్మల కషాయకల్మషములు, కలుషిత సంస్కారములు నశించబడతాయి. వ్యక్తిత్వములో నూతన దివ్య సంస్కారముల బీజారోపణ జరుగుతుంది.'

ఈ సందర్భంగా పరమపూజ్య గురుదేవులు ఇంకా చాలా చెప్పేవారు. మాతాజీ భోజనము చూడటానికి చాలా సాదాగా, సాధారణంగా ఉంటుంది. కానీ మీరెట్టి పరిస్థితులలోను అలా అనుకోవద్దు. ఆమె భోజనములో అసాధారణ ప్రాణఊర్జ నిండి ఉంటుంది. అది కడుపు నింపటమేకాక ఆత్మను కూడా తృప్తిచెందిస్తుంది. మీకు అనుదానము నివ్వ డానికి, మిమ్మల్ని సుసంస్కారవంతులను చేయడానికి ఆమె ఉపయోగించే విధానములు అద్భుతమైనవి. ఆమె ఎప్పుడు ఏవిధంగా చేస్తుందో ఆమెకే తెలుసును. కానీ ఇది నూటికి నూరుపాళ్ళు నిజము. ఆమె వంటింటినుంచి వచ్చే భోజనము ఆమె ద్వారా చేయబడే శక్తిసంప్రేక్షణ. దివ్య సంస్కార బీజారోపణ చేయుటకు అత్యంత సమర్థమైన మాధ్యమము. ఇది ఆమె ద్వారా ఉపయోగించబడే అతి ఇష్టమైన మాధ్యమము.

మాతాజీ వంటింటిలో వేలాదిమంది, లక్షలాదిమంది భోజనము చేసుంటారు. ఆమె సంపర్కములోకి ఇంతకంటే ఎక్కువమంది వచ్చుంటారు. కానీ పైన చెప్పబడిన ఈ నిజమును అత్యంత తక్కువమంది తెలుసుకొనుంటారు. కానీ బుద్ధి దీనిని గ్రహించలేకపోయినా దీని భావానుభూతి చాలామంది పొందివుంటారు. ఒక్కొక్కసారి ఈ అనుభూతి ఎంత తీవ్రంగా ఉండేదంటే దానిని అనుభవించినవాడు దానిని తెలుపకుండా ఉండలేకపోయేవాడు. దీనిని గురించి ఇతరులకు చెపితేనే అతనికి సంతృప్తి. ఠాకూర్ హనుమంత్‌సింగ్ అనుభూతి కూడా ఇలాంటిదే. దీనిని ఆయన గాయత్రీతపోభూమిలో ఒక శిబిరములో వచ్చిన ఇతరులకి తెలిపారు. దీనిని విన్నవారికి ఈరోజుకు కూడా మొత్తము వివరణ అలానే గుర్తున్నది.

ఠాకూర్ హనుమంత్‌సింగ్ రాజస్తాన్ యొక్క బాడ్‌మేర్ దగ్గర నివసించేవాడు. ఆయన పూర్వీకులు చాలా పెద్ద భూస్వాములు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జమిందారీలు

**తప్పులెన్నుతున్నారని ముడుచుకుపోతే ఏమి సాధించలేము**

లేకపోయినా ఆయన ఐశ్వర్యములో ఏమీ తగ్గుదల రాలేదు. ఠాకూర్‌సాహెబ్‌లో ఐశ్వర్యం మరియు విలాసత జన్మవలన అనేక దుష్ప్రవృత్తులు ఈయన వ్యక్తిత్వములో నిండి ఉండేవి. ఆయన ధర్మపత్ని, కుటుంబసభ్యులు ఆయన యొక్క ఈ దుర్గుణములు, దుష్ప్రవృత్తులకు చాలా బాధపడేవారు. ఎలాగో వారికి తెలియకుండా కుటుంబసభ్యులకు అఖండజ్యోతి ప్రతి ఒకటి చేత చిక్కింది. అందులో గాయత్రీ తపోభూమి మరియు అక్కడ జరిగే శిబిరాలను గురించిన వివరాలు ఇవ్వబడ్డాయి. విషయాలన్నీ చదివిన తరువాత కుటుంబసభ్యులు మరియు ఆయన ధర్మపత్ని ఠాకూర్‌ను అక్కడకు తీసుకువెళ్ళాలని నిర్ణయించుకున్నారు. వీరందరూ ఠాకూర్‌సాహెబ్‌తో మాట్లాడారు. ముందు వద్దన్నా తరువాత ఆయన ఒప్పుకున్నారు.

నిర్ణయించుకున్న తిథికి వారందరూ గాయత్రీ తపోభూమికి చేరుకున్నారు. ఆరోజులలో వచ్చేవారు గాయత్రీ తపోభూమిలో ఉండి, ఆహారము అఖండజ్యోతి సంస్థానములో తీసుకునేవారు. ఈ నియమానుసారం ఠాకూర్‌సాహెబ్ కూడా తన కుటుంబసభ్యులతో పాటు భోజనము చేయుటకు అఖండజ్యోతి సంస్థానమునకు వెళ్ళారు. మాతాజీ స్వయముగా తన చేతులతో వడ్డించి భోజనము చేయించారు. కోడిమాంసం, త్రాగుడుకు అలవాటు పడిన ఠాకూర్‌సాహెబ్ ఇలాంటి సాదాభోజనము చేయుట అలవాటు లేనప్పటికి ఎందుకో ఆయనకు ఈ భోజనములో ఏదో అద్భుతమైన రుచి అనిపించింది. భోజనము చేసిన తర్వాత తపోభూమికి తిరిగి వెళ్ళారు. కుటుంబసభ్యులు ఎంత బ్రతిమాలుతున్నా ఆయన శిబిరములోని ఏ కార్యక్రమములోనూ పాలుపంచుకొనలేదు. కానీ భోజన వేళకు అందరితో పాటు మాతాజీ దగ్గరికి వచ్చేసేవారు.

ఠాకూర్‌సాహెబ్ ఇలా అన్నారు. 'ఆ భోజనములో ఏముందో నాకు తెలియదు కానీ ఏదో అద్భుతము ఉన్నది. రెండు, మూడు రోజులలోనే నాలో అద్భుత భావపరివర్తన జరిగింది. నిరంతరము నా కనుల ముందు మాతాజీ సౌమ్యమూర్తి కనిపించేది. తప్పుడు ఆలోచనలు, తప్పుడు భావనలు మనసులోకి వచ్చేవే కావు. ఒకవేళ పాత అలవాట్ల వల్ల వచ్చినా మనసులో తీవ్రమైన సిగ్గు అనిపించేది. మాతాజీ అన్నీ చూస్తోంది అనిపించేది. నేను ఇలాంటి నీచ ఆలోచనలు ఎలా చేయగల్గుతున్నానని అనుకునే వాడిని. ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత పాత అలవాట్ల వైపు మనసు వెళ్ళనేలేదు. కానీ మిత్రులు వాళ్ళేకదా! వాళ్ళ బలవంతం కూడా అలానే ఉండేది. అందువల్ల ఒకసారి వాళ్ళతోపాటు వెళ్ళవలసివచ్చింది. నేను ఎంత వద్దని చెప్పినా వారు బలవంతంగా మాంసం, మద్యం ఇప్పించారు.

దీని తరువాత పరిస్థితి విషమించింది. వాంతులు, విరోచనాల పరంపర మొదలైంది. ఎలాగో ఇంటికి చేర్చారు. రోజురోజుకి బాధ పెరిగింది. వైద్యుల మందుల ప్రభావము పనిచేయలేదు. ఠాకూర్‌సాహెబ్ ప్రమాదమునకు ఇంటిలోని వారందరూ గాబరాపడ్డారు. కానీ ఆయనకు ఏవిధముగానూ భయము అనిపించలేదు. ఆయనకు నిరంతరము మాతాజీ తల దగ్గర కూర్చుని తల నిమురుతూ ఇలా చెప్తునట్లు అనిపించేది. 'నాయనా! ఇది జబ్బుకాదు. లోపలున్న నీ కుసంస్కారములను కడిగి వేయుటకు జరిగే ప్రక్రియ. ఇంక నీలో భోజనము ద్వారా నేను అందజేసినవి మాత్రమే ఉంటాయి. నీవు భయపడవలదు. త్వరలోనే అంతా సర్దుకుంటుంది.' నిజముగా అలాగే జరిగింది. కొద్దిరోజులలో ఆయన పూర్తి ఆరోగ్యవంతులయ్యారు. అప్పటినుండి ఆయన జీవనక్రమము పూర్తిగా మారిపోయెను. పూర్వము కలిసుండే మిత్రులు వదిలిపోయారు.

మళ్ళీ గాయత్రీ తపోభూమి శిబిరానికి ఆయన వచ్చారు. ఆయన తన అనుభూతులను విస్తారముగా అందరికీ చెప్పేవారు. మారిన ఆయన జీవనక్రమము చెప్పబడుతున్న సత్యములను ప్రమాణితము చేస్తున్నది. బ్రహ్మముహూర్తములో నియమముగా గాయత్రీ సాధన, ప్రొద్దున్నే హవనము ఆయన జీవనములో అనివార్య అంగములుగా అయినవి. మాతాజీ ద్వారా ఇవ్వబడిన దివ్యసంస్కారములు ఆయనను సంపూర్ణముగా మార్చివేశాయి. తన అనుభవాలను వివరిస్తూ ఇలా అనేవారు. 'శ్రేష్ఠ సాధకులకు పూజ్యగురుదేవులు మార్గదర్శకులు. ఆయన అవతారమూర్తి. కానీ మనలాంటి నికృష్ట జనులకు, అనేక విధములైన మాలిన్యములు అంటుకున్న సంతానమునకు మాతాజీయే అంతా. ఆమెతప్ప మనకి ఎవరు మేలు చేయగలరు? గురువు మార్గదర్శకుడు. ఎప్పుడూ సాధకుని పాత్రత చూచును. కానీ తల్లికి ఆమె పిల్లలు ఎప్పుడూ సత్పాత్రులే. మలమూత్రములతో అంటబడున్నా తల్లి వారిని ఎప్పుడూ ఎత్తుకొనుటకుకానీ, సంస్కారవంతులను చేయుటకు కానీ ఏవిధమైన సంకోచమూ ఉంచుకోదు. దీనికొరకు ఆమెకు అపారమైన ప్రాణశక్తిని ఖర్చుచేయవలసి వచ్చినప్పటికీ వెనుకాడదు. అనేక కష్టములను ఆమె భరించవలసి వస్తుంది. చాలా ప్రసన్నముగా మాతాజీ ఇవంతా భరిస్తుంది. దీనికి కావలసిన శక్తి ఆమె తన ఆరాధ్యుని సాధనాసంగినిగా ఉండటం వల్లనే పొందేది.

*– అనువాదం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ*

**చేసిన పనిలో తప్పులుంటే అవి మరల జరగకుండా చూసుకోవాలి**

జీవన సాధనకు పావన ప్రేరణ

# ఋషిత్వాన్ని ప్రసాదించిన పంచాగ్ని విద్య

యమాచార్యునికి ఆయన భార్య ఇలా సవినయంగా నివేదించింది.

"నచికేతుడు కుర్రవాడు. అతడి పట్ల మీరు ఇంత కఠోరంగా ఉండడం బాగుందా? జొన్న రొట్టెలూ మజ్జిగా తప్ప ఆ పసివాడికి మరో ఆహారం లేదు. నెలరోజులుగా ఇదే పద్ధతి. ఇతర బ్రహ్మచారులు, నా కుమారులు షడ్రుచులతో భోజనాలు చేస్తున్నారు. అతడి పట్ల ఇంత కాఠిన్యం ఎందుకు?"

యమాచార్యుడు నవ్వి ఇలా అన్నారు –

"దేవీ! సాధన ఒక సమరం. యుద్ధంలో ప్రాణం పోవచ్చు. అయినా గెలుపు సందిగ్ధమే. ఇప్పుడు నచికేతునికి అన్న సంస్కారం జరుగుతోంది. పరమాత్మ చేతన అత్యంత పవిత్ర మైనది. అగ్నివంటిది. శరీరం సమర్థంగా లేకపోతే, నచికేతుడు దాన్ని ధారణ చేయలేడు. ఈ అన్న సంస్కారం అతడి అన్నమయ కోశంలోని విజాతీయ ద్రవ్యాలను తొలగిస్తుంది. ఆత్మ సాక్షాత్కారానికి తగిన విధంగా దాన్ని క్షాళన చేస్తుంది. ఇది కత్తిమీద సాము. అయితే నచికేతుడు గొప్ప సాహసి, ఆత్మ జిజ్ఞాసువు. అతడు దీన్ని సులువుగా నిర్వహించగలడు."

నచికేతుని అన్న సంస్కారం ఇలా సంవత్సరంపాటు సాగింది. ఆ తర్వాత ప్రాణాయామ సాధన ప్రారంభమయింది. ప్రాణాకర్షణ, అనులోమ-విలోమ, సూర్య వేధన, ఉజ్జాయీ, నాడీ శోధన మున్నగు ప్రాణాయామాల అభ్యాసం జరిగింది. యువ సాధకుని ముఖ మండలంపై తేజస్సు పెరిగింది. అయితే అతడి ఆహారం తగ్గిపోతోంది. గురుపత్ని మరోమారు ఇలా నివేదించింది –

"స్వామీ! నచికేతుడు ఇతరుల పుత్రుడు. మన పుత్రులపై కఠినంగా ఉండవచ్చు. ఇతరుల పుత్రులపట్ల ఉండకూడదు కదా."

యమాచార్యుడు మళ్ళీ నవ్వి ఇలా అన్నారు –

"దేవీ! శిష్యుడు పుత్రునికన్నా మిన్న. ఈ బాలుని హృదయంలో తీవ్రమైన ఆత్మ జిజ్ఞాస ఉంది. అతడు వీరుడు, సాహసి. సాధనలోని ప్రతి కష్టాన్ని భరించగలడు. కనుకనే మేము అతడికి పంచాగ్ని విద్యను బోధిస్తున్నాము. ఆర్యావర్తం లోని యువతరం పిరికివాళ్ళుగా, బలహీనులుగా ఉండకూడదు. ఈ ఆత్మ విద్య నశించిపోకూడదు. ఈ దృష్టితోకూడ నచికేతుడు ఈ సాధన చేయడం మంచిది. అతడి ఆహారం తగ్గింది. నిజమే, అయితే, ప్రాణం దానికదిగా ఆహారం. ఆత్మ అగ్ని రూపం. అది ప్రాణం. అది తేజస్సు. ప్రాణాయామంవల్ల అది బలపడు తుంది. తద్వారా అతడికి పౌష్టిక ఆహారం అందుతుంది. ప్రాణమయ కోశం యొక్క సంస్కరణ మనోమయ కోశానికి తప్పనిసరి."

ప్రాణసాధనలో ఒక సంవత్సరం గడిచింది. యమాచార్యుడు నచికేతునికి మనస్సు యొక్క ప్రతి సంకల్పాన్ని పూర్తిచేయడం బోధించారు. అతడు నిద్ర పోతున్నప్పుడు – అచేతన మనస్సు యొక్క పూర్వ జన్మల క్రియల కలల తెరలపై ప్రతిబింబించాయి. వాటిలో పాపకార్యాలు కూడా ఉన్నాయి. అవి వెలికిరావడం వల్ల ఆత్మక్షోభ కలిగింది. అతడు వీటన్నింటినీ గురువుగారికి చెప్పవలసి వచ్చింది. గురుపత్ని ఇందుకు కూడ అభ్యంతరం చెప్పింది. అందుకు యమాచార్యుడు ఇలా అన్నారు –

"ఈ ఆత్మక్షోభ మరేమీ కాదు. పూర్వ జన్మల పాపాల సంస్కారం మాత్రమే. సాధకుడు ఈ జన్మలో చేసిన పాపాలనూ, గత జన్మలలో చేసిన పాపాలనూ ప్రకటించాలి. వాటికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అప్పుడే అతడి మనస్సులోని ముడులు విడిపోతాయి."

మనోమయ కోశ క్షాళనకై నచికేతుడు కృచ్ఛ చాంద్రాయణ నుండి గోమయ-గోమూత్ర సేవనం వరకు ప్రాయశ్చిత్త సాధనలన్నీ చేయవలసి వచ్చింది. ఈ సాధనల కఠోరత పెరిగిన కొలదీ గురుపత్ని హృదయం మరింతగా ద్రవించిపోతోంది. అయితే – ఆత్మ యొక్క గ్రంథులను ఛేదించి దానిని వ్యక్తపరచడం ఎంతటి మహా సమరమో యమాచార్యుడు ఆమెకు వివరించారు. నచికేతుణ్ణి తపింపజేయడానికి ఆయన ఏమాత్రం వెనుకాడ లేదు.

**తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు**

మూడు సంవత్సరాలు గడిచాయి. నచికేతునికి సుఖమంటే ఏమిటో తెలియలేదు. శరీరాన్ని అతడు క్షాళన చేశాడు. అయినా శరీరం క్షీణించిపోయింది. ప్రాణములపై అదుపును కూడ అతడు నేర్చుకున్నాడు. అయితే అందువల్ల మనస్సు క్షీణించింది. మనోమయ కోశాన్ని కూడ అతడు జయించాడు. అతడు మనస్సును బ్రహ్మరంధ్రం లోనికి పంపాడు. సూక్ష్మ జగత్తులోని విజ్ఞానమయ రహస్యాలను అన్వేషించాడు. ఆత్మవరకు చేరి, దానిని క్షోభింపజేశాడు. మేలుకొలుపాడు, సంపాదించాడు. మనస్సును అదుపుచేసి – క్రమంగా ఆజ్ఞాచక్రం, విశుద్ధ చక్రం, మణిపూర చక్రం, స్వాధిష్ఠాన చక్రం, అనాహత చక్రాలను ఛేదించి మూలాధార చక్రంలోనికి ప్రవేశించాడు. అక్కడ కూర్చుని ఉన్న మహావిద్యా రూపిణి అయిన కుండలిని కదిలింది. అతడు మనస్సు కంపించింది. అయితే మరుక్షణంలోనే అంతః కరణ నుండి ఒక పిలుపు వచ్చింది – 'నచికేతుడా! ఈ భౌతిక సుఖం లభించినప్పటికీ, ఇంద్రియాలు వాటిని ఎంతకాలం అనుభవించగలుగుతాయి? అక్షయమూ, అవినాశి అయిన ఆత్మను నీవు వరించు.'

పున్నమి రోజు. వసంత ఋతువు. నాలుగు సంవత్సరాలుగా నిరంతరం ఉగ్ర తపస్సు చేస్తున్న నచికేతుని శరీరం పూర్తిగా క్షీణించిపోయింది. ఈ రోజు అతడికి అతి ప్రముఖమైన రోజు. ఒక ప్రాణాన్ని రెండవ ప్రాణంలో ఇముడ్చుతూ అతడు మూలాధారం వరకు చేరాడు. ఆ ఆదిశక్తిని తన సంకల్పంతో దెబ్బకొట్టాడు. చిర నిద్రలో ఉన్న కుండలిని చలించలేదు. అతడు మరింత తీవ్రంగా దెబ్బకొట్టాడు. దెబ్బతిన్న కాలసర్పిణి బుసకొడుతూ లేచింది. సహస్రారం వరకు వెళ్ళి మళ్ళీ మళ్ళీ బుసకొట్టసాగింది. అది నచికేతుని మనస్సు యొక్క స్థూల భావాన్ని ముంచివేసింది, కాల్చివేసింది. నచికేతుడు నేడు మనసుగా మిగిలిపోకుండా – ఆత్మ అయిపోయాడు. అతడి లౌకిక, భౌతిక వాసనలన్నీ పూర్తిగా దగ్ధం అయిపోయాయి. అతడు ఋషి అయినాడు.

అతడు ఇప్పుడు బ్రహ్మలో విలీనం కాగలుగుతాడు. అయినా – తన మహత్తర సంస్కృతిని ఉద్ధరించాలనే సంకల్పంతో అక్కడ నుండి బయలుదేరాడు. నవ నిర్మాణ మహా కార్యానికి అంకితం అయినాడు. ఈ పంచాగ్ని విద్యను ప్రపంచమంతటా ప్రసారం చేసి, అమర సాధకుడుగా కీర్తిగా గడించాడు.

## మేరీ థామస్‌ల ఆదర్శ దాంపత్యం

*చుట్టూ ఎంతటి విషమ పరిస్థితులు ఉన్నప్పటికి భార్యాభర్తలు పరస్పరం అన్యోన్యంగా ఉండగలిగితే ఇల్లు శాంతినివాసం కాగలదు.*

*మేరీథామస్‌లు అనంత ప్రేమమయమైన దాంపత్యజీవితాన్ని గడిపేవారు. ప్రతియేట వీరు తమ వివాహ దినోత్సవాన్ని చాలా ఆనందంగా జరుపుకొనేవారు. ఆ రోజు ఒకరికొకరు ఏదో ఒక కానుకను ఇచ్చుకొంటూ ఉండేవారు. అలవాటు ప్రకారం ఆ ఏడాది కూడా పెళ్ళిరోజున ఏదో ఒక కానుకను ఇవ్వాలనుకున్నారు. కానీ ఎంత ప్రయత్నించినా డబ్బు సమకూరలేదు. భార్య బంగారు రంగు జుట్టుకి ఒక అందమైన క్లిప్ కొనాలనుకొన్నారు థామస్. మేరీ భర్త చేతివాచీకి ఒక క్రొత్త చైనును కొనాలనుకొన్నది. ఈ ఆలోచన రహస్యంగా ఇద్దరికి మనసులోనే ఉండిపోయింది. ఒకరికొకరు చెప్పుకోలేదు.*

*ఎంత ప్రయత్నించినా ఇద్దరికీ డబ్బు లభించక థామస్ తన చేతి గడియారాన్ని అమ్మి భార్యకు జడక్లిప్ కొన్నాడు. మేరీ తన అందమైన జుట్టును అమ్మి భర్తకు వాచీ చైనును కొన్నది. ఇద్దరూ ఒకరినొకరు వివాహ శుభాకాంక్షలు చెప్పుకొని కానుకలు ధరింప చేయాలని చూచేసరికి భార్య తల మీద జుట్టులేదు. భర్తచేతికి వాచీలేదు. అయినప్పటికీ వారు ఒకరిపట్ల ఒకరికి గల ప్రేమకు పరవశించి పోయారు. ఆ రెండు హృదయాలు ఆనందంతో గెంతులు వేశాయి. దాంపత్యజీవితం అంటే ఒకరినొకరు తమ ప్రేమను ఇంత ఉత్కృష్టంగా పంచి ఇచ్చేటట్లుగా ఉండాలి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**ప్రమాదాలు చెప్పిరావు, వచ్చినప్పుడు సమయస్ఫూర్తితో స్పందించాలి**

# ప్రజ్ఞా యోగానికి నాలుగు సోపానాలు

ప్రజ్ఞాయోగానికి రెండు సంధ్యలు అత్యధిక సరళం, మహత్తరం అయినవి. ఒకటి ఉదయం మంచంపైనే ఉండి కళ్ళు తెరుస్తూనే పది పదిహేను నిముషాలపాటు "ప్రతిరోజూ కొత్తజన్మ" అనే భావన కలిగి ఉండడం. రెండవది రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించే సమయంలో శయనించడం ఒక విధమైన మరణమనే భావనను అనుభవించడం. జనన మరణాలు జీవితానికి మొదలు, తుది. వీటిని క్రమంగా ఉంచగలిగితే మధ్య ఉన్న భాగం సఫలం అవుతుంది. విత్తనాలు నాటటం, పంట కోయటం అనేవి రైతుల సామాన్య ప్రక్రియలు. మేలుకోవడాన్ని ప్రాతఃకాల సంధ్యగా, శయనాన్ని రాత్రి సంధ్యగా చెప్పవచ్చు. సూర్యోదయ సూర్యాస్తమయాలను ఉభయ సంధ్యలుగా పరిగణిస్తారు. వాటితో ముడిపడిన ఆధ్యాత్మిక సాధనను ప్రాతఃకాలం కళ్ళు తెరిచే సమయంలో చేయవచ్చు.

ప్రజ్ఞాయోగంలోని ప్రథమ సాధన ఆత్మబోధ. కళ్ళు తెరవగానే 'నేడు నాకొక కొత్త జన్మ. ఒకరోజు మాత్రమే జీవిస్తాను. రాత్రి మరణం ఒడిలోకి చేరాలి. మధ్య ఉన్న కాలాన్ని సర్వోత్తమంగా ఉపయోగించడమే జీవన సాధన లక్ష్యం. ఇదే నా పరీక్ష క్రమం. దీనిలోనే భవిష్యత్తు మొత్తం నిండి ఉన్నది' – అని భావన చేయాలి.

జన్మలన్నింటిలో మానవ జన్మ అదృష్టకరమైనది. దీని సదుపయోగమే ఉన్నత స్థాయి జ్ఞానానికి రుజువు. నిద్రలేస్తూనే, ఈ రోజు ఒక పూర్తి జీవితం – అని ఆలోచన చేయాలి. ఈ జన్మను ఏ ప్రయోజనం కోసం విధాత మనకు అప్పగించాడో ఆ ఉపయోగకరమైన పనులను మాత్రమే చేయాలి. ఈవిధంగా రోజంతా జరిపే దినచర్యను ఈ సమయంలోనే నిర్ధారణ చేసుకోవాలి. ఆలోచన, శీలం, వ్యవహరణల రూపురేఖలను తయారు చేసుకుని జాగ్రత్తగా పూర్తిచేయడం వల్ల ఈరోజు ఈ విలువైన జన్మ పూర్తిగా సార్థకం కావాలి – ఈ ఆలోచనలోని అన్ని కోణాలను గురించి యోచించడానికి ఎంత ఎక్కువ సమయం పట్టినా అది తక్కువే. దీన్ని నిత్యం నియమిత రూపంలో ఆచరిస్తే, పదిహేను నిముషాలు సరిపోతాయి. ఆ రోజులో మిగిలిన పనేమైనా ఉంటే అది మరునాడు పూర్తి చేయవచ్చు.

రాత్రి నిదురపోయే ముందు రెండవ సంధ్య పూర్తి చేయవచ్చు. అందులో ఇపుడు మృత్యువు ఒడిలోకి వెళ్తున్నట్లు భావించాలి. ఈ సమయంలో – ఒకరోజు జీవితాన్ని ఏవిధంగా సదుపయోగం చేశావో భగవంతుని సభలో జవాబు ఇవ్వాలి. దీనికోసం ఆ రోజులో జరిగిన కార్యకలాపాల, ఆలోచనల ఉన్నతి, అధోగతులను సమీక్ష చేయాలి. వాటి ఉద్దేశ్యాన్నీ, స్థాయినీ నిష్పాక్షికంగా పరీక్షించాలి. వాటిలో ఏవి సవ్యంగా జరిగాయి. ఏ తప్పులు, వైరుధ్యాలు జరిగాయి – అని తెలుసు కోవాలి. సవ్యంగా జరిగిన వాటికి తనను తాను ప్రశంసించు కోవాలి. సవ్యంగా జరిగిన వాటికి తనను తాను ప్రశంసించు కోవాలి. జరిగిన తప్పును మరునాడు సవరించే ఆలోచన చేయాలి. శాస్త్రం ప్రకారం – పాపానికి ప్రాయశ్చిత్తం జరిగిన నష్టాన్ని భర్తీ చేయడమే. గడచిన ఈరోజును తిరిగి తీసుకు రాలేము. కాని దానికి ప్రాయశ్చిత్తం మరునాడు చేసుకోవచ్చు. మరునాటి కార్యకలాపాలలో ఈరోజు చేయలేనిదాన్ని కలపాలి. ఈవిధంగా కొంత భారం పెరుగుతుంది. కాని లోపాన్ని సరిదిద్దుకునేందుకు మరోదారి లేదు. మృత్యువు అనివార్యం. మనుషులు ఈ విషయాన్ని మర్చిపోతారు. పసిపిల్లలవలె పనికిరాని పనులు చేస్తారు. ఎనభైనాలుగు లక్షల జన్మలలో భవిష్యత్తును ఉజ్వలంగా చేసే ఈ పనులు చేయాలి; దేవమానవ స్థాయిని చేరే ఈ పనులు చేయాలి; దేవమానవ స్థాయిని చేరే ఆకాంక్షను కలిగి ఉండాలి. మనల్ని అనుకరించే ప్రేరణ ఇతరులకు కలిగే విధంగా జీవించాలి; మనం మన బాధ్యతను నిర్వహించిన రుజువు లభించి, విధాత సంతోషించాలి. అది ఆధారంగా మనకు ఉన్నత స్థితి లభించాలి.

రాత్రి ఏవిధంగా నిశ్చింతగా నిద్రపోతామో, అదేవిధంగా మరణం తరువాతి సమయం నుంచి పునర్జన్మ వరకు గల కాలంలో అదేవిధంగా శాంతితో ఉండడానికై ఈరోజులలోనే సన్నాహాలు చేయాలి. పగలు సుఖ సంతోషాలతో గడిస్తే, రాత్రి గాఢమైన నిద్ర పడుతుంది. రోజు శాంతంగా, శ్రేష్ఠంగా గడిపితే, మరణం తరువాతి కాలంలో నరకాన్ని అనుభవించవలసి రాదు. స్వర్గతుల్యమైన శాంతిని ఆస్వాదించవచ్చు. ఈ ప్రక్రియయే తత్వబోధ.

**మానవుడు ఎంతో గొప్పవాడు, అందుకే భగవంతుడు అనేక సార్లు మానవశరీరం ధరించాడు**

ప్రజ్ఞాయోగంలో పగలు పూర్తిచేయవలసిన పనులు ఇంకా రెండు ఉన్నాయి. మొదటిది భజన, రెండవది మననం. భజన కోసం కాలకృత్యాలు నిర్వర్తించిన తరువాత పూజా స్థలంలో పద్మాసనంలో కూర్చోవాలి. శరీరం, మనసు, వాణి శుద్ధి కావడం కోసం జలం ద్వారా పవిత్రీకరణం చేసుకుని, ఆచమనం చేయాలి. దైవ విగ్రహం, గాయత్రి పటం, ధూపదీపాలు – వీటిలో ఏదో ఒక చిహ్నాన్ని స్థాపించి దానినే ఆరాధ్య దైవంగా భావించాలి. ధూపం, దీపం, నైవేద్యం, జలం, అక్షతలు, పుష్పాలలో ఏవి లభిస్తే వాటితో పూజ చేయాలి. పూజకు ఉపయోగించే ఈ సాధనాలలోని విశేషతలు జీవితంలో ఉత్పన్నం కావాలని భావన చేయాలి. చందనం పరిసరాలను సుగంధంతో నింపుతుంది. దీపం తన ప్రభావ పరిధిలో జ్ఞానమనే ప్రకాశాన్ని వ్యాపింపచేస్తుంది. పుష్పాలు నవ్వుతూ వికసిస్తూ ఉంటాయి. జలం శీతలతకు గుర్తు. అక్షతలు, నైవేద్యం వెనుక పరమార్థ ప్రయోజనం కోసం కేటాయించే సమయదానం, అంశదానాల భావన ఉంది. ఇష్ట దైవాన్ని సత్ప్రవృత్తుల సమూహంగా పరిగణించాలి. ఈ విశ్వాసాలు ఆధారంగా దైవపూజ సమగ్రమవుతుంది.

ఇప్పుడు జప, ధ్యానాల వంతు వస్తుంది. రెండూ ఒకేసారి జరుపవచ్చు. గాయత్రి జపం మానసికంగానైనా చేయవచ్చు. ఎంతసేపు చేయాలని నిశ్చయించుకొన్నారో దాని లెక్క గడియారం ద్వారా కాని, మాల ద్వారా కాని చేయవచ్చు. ఎవరికైనా వేరే మంత్రం ఇష్టమైతే, దానినే జపించవచ్చు. ఓంకారం సర్వత్రా జపంగా పరిగణించబడుతోంది.

జపంతోపాటు ప్రాతఃకాలంలో ఉదయిస్తూన్న సూర్యుడిని ధ్యానం చేయాలి. తెరచిన తన శరీరం సూర్యునికి ఎదురుగా కూర్చొని ఉన్నట్లు భావన చేయాలి. సూర్యుని సూక్ష్మకిరణాలు తన స్థూల, సూక్ష్మకారణ శరీరాలలోనికి ప్రవేశిస్తూన్నట్లు భావన చేయాలి. కిరణాలు బలానికీ, కాంతికీ ప్రతీకలు. బలం అనగా శక్తి. కాంతి అనగా ప్రకాశవంతమైన ప్రజ్ఞ. రెండింటి సమన్వయం మూడు శరీరాలలో ప్రవేశించి వాటిని ప్రభావితం చేస్తూన్నదని భావన చేయాలి. స్థూల శరీరంలో ఆరోగ్యం, సంయమనం, సూక్ష్మశరీరం అనగా మస్తిష్కంలో వివేకం, సాహసం, కారణ శరీరం అనగా అంతఃకరణంలో శ్రద్ధ, సద్భావన సూర్యకిరణాల రూపంలో ప్రవేశించి, అస్తిత్వంలోని మొత్తం శక్తిని ప్రేరేపిస్తున్నా యని భావన చేయాలి. ఈ ధ్యానధారణ, మంత్ర జపం కలిపి నియమితంగా, నిర్ణీత సమయం వరకు జరపాలి. చివరకు పూర్ణాహుతిలో సూర్యునికెదురుగా జలం అర్ఘ్యం ఇవ్వాలి. దీని తాత్పర్యం – పరమాత్ముని శక్తి సముఖంలో జల రూపంలో ఆత్మశక్తిని సమర్పణ చేయడం. భజనలోని భావన ఇదే. నియమిత స్థానంలో కూర్చొనడానికి వీలుకాని పక్షంలో, ప్రయాణంలో – ఈ కృత్యాలన్నీ ఏ వస్తువులనూ ఉపయోగించ కుండా మానసికంగా చేయవచ్చు.

ప్రజా యోగంలోని నాలుగవ అడుగు మననం. ఇది మధ్యాహ్నం తరువాత ఎక్కడైనా ఎప్పుడైనా చేయవచ్చు. సమయం 15 నిముషాలైనా సరిపోతుంది. ఇందులో మన వర్తమాన స్థితిని సమీక్షించాలి. ఆదర్శాల కొలబద్దతో పరీక్షించి నపుడు ఏదైనా లోపం కనపడితే, దానిని పూరించే ప్రణాళికను తయారుచేయాలి. ఇదే మననం. దీని కోసం ఏకాంత స్థలాన్ని వెదకాలి. కళ్ళు మూసుకుని అంతర్ముఖుడవు కావాలి. ఆత్మసత్తా యొక్క క్షాళనకూ, సంస్కరణకూ పథకాన్ని రూపొందించాలి. ఇందులో నేటి దినాన్ని ప్రధానంగా పరిగణించాలి. ప్రాతః కాలం నుంచి మధ్యాహ్నం వరకు చేసిన ఆలోచనలను, పనులను ఆదర్శాల గీటురాయిపై పరీక్షించాలి. ఆ సమయం నుండి నిద్రపోయేంతవరకు ఏమేమి చేయాలో భావనాత్మక ప్రణాళికలు తయారుచేయాలి. అలా చేస్తే – ఆ రోజులోని తొలి సగం కంటే మలి సగం మరింత మెరుగవుతుంది.

ఆత్మసమీక్షకు నాలుగు కొలబద్దలు ఉన్నాయి. 1) ఇంద్రియ సంయమనం 2) సమయ సంయమనం 3) అర్థ సంయమనం 4) ఆలోచనా సంయమనం. ఈ నాలుగింటిలో ఎక్కడైనా, ఏదైనా క్రమభంగం జరిగిందేమో చూడాలి.

నాలుక రుచికోసం తినకూడని వాటిని తినడం లేదు కాదా! వాణి ద్వారా చౌకబారు సంభాషణ చేయటం లేదు కదా? కాముక ప్రవృత్తి, కుదృష్టి పెరగడం లేదు కదా? అసంయమనం వలన శరీరం, మెదడు బోలు కావడం లేదు కదా?

సమయ సంయమనం అనగా ఒక్కొక్క క్షణాన్ని సదుప యోగం చేయడం. సోమరితనం, పొరపాట్లు, దుర్వ్యసనాలు, దుర్గుణాల విష సమయంలో చిక్కుకుపోయి ఏ కొద్ది సమయ భాగమైనా వ్యర్థం కారాదు. సమయాన్ని రక్షించడంలో, సదుప యోగం చేయడంలో పూర్తి జాగ్రత్త వహించాలి. సమయమే జీవితం. సమయాన్ని సదుపయోగం చేసినవాడే జీవితాన్నుంచి పరిపూర్ణ లాభం పొందుతాడు.

**మనలో ఉన్న భగవంతుడిని తెలుసుకునేందుకు ప్రయత్నించాలి**

**మూడవ సంయమనం:** అర్థ సంయమనం. ధనాన్ని నిజాయితీగా, శ్రమచేసి సంపాదించాలి. ఉచితంగా దేనినీ పొందకూడదు. ఎవరినీ మోసగించకూడదు. సగటు భారతీయుని స్థాయిలో జీవించాలి. "సాదా జీవితం, ఉన్నతమైన ఆలోచనలు" – అనే నీతిసూత్రాన్ని అనుసరించాలి. విలాసాల ప్రదర్శన అనే మూర్ఖత్వం కోసం కొద్దిగా అయినా ఖర్చు చేయకూడదు. దురాచారాలపై ధనాన్ని వృథా చేయరాదు. పొదుపు చేసిన దానిలో ఎక్కువ భాగం పరమార్థ కార్యాల కోసం ఉపయోగించడం, పుణ్యం సంపాదించడం వంటి ప్రయోజనాలు వివేకంతో సముచితంగా ఖర్చు చేసే వారికే లభిస్తాయి.

**నాలుగవ సంయమనం:** ఆలోచనా సంయమనం. మెదడులో ఎల్లప్పుడూ ఆలోచనలు కలుగుతూ ఉంటాయి; కల్పనలు ఉదయిస్తూ ఉంటాయి. ఇవి అంతులేకుండా, అస్తవ్యస్తంగా అనైతికంగా లేకుండా ఉండాలంటే – వివేకాన్ని కావలివానివలె ఉపయోగించాలి. దాని పనేమిటంటే – చెడు ఆలోచనలను మంచి ఆలోచనలతో పారద్రోలడం; అనాగరికమైన ఆలోచనల స్థానంలో నిర్మాణాత్మక చింతనను స్థాపించడం. ఆలోచనలు మనిషిలోని మహత్తర శక్తులు. అవి కర్మలుగా పరిణతి చెంది, పరిస్థితులుగా వెలికివస్తాయి. జీవితం కల్ప వృక్షం అవుతుంది. కనుక – చింతనను నిర్మాణాత్మకమైన ఉన్నత స్థాయి ఆలోచనలపై మాత్రమే లగ్నం చేసి ఉంచాలి.

సాధన, స్వాధ్యాయం, సంయమనం, సేవ అనే నాలుగు పురుషార్థాలతోనే జీవితంలో ప్రగతి, సఫలత సిద్ధిస్తాయి. అందువలన దినచర్యలో ఈ నాలుగింటికీ సముచిత స్థానం ఇవ్వాలి. ఆత్మ సమీక్ష సమయంలో వాటిని నిరంతరం పరీక్ష చేయాలి. ఆత్మ సమీక్ష, ఆత్మ సంస్కారం, ఆత్మ నిర్మాణం, ఆత్మ వికాసం అనే నాలుగు ప్రక్రియలకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వడానికై మధ్యాహ్న కాలంలో మనన సాధన చేయాలి. ఇదే ఆత్మదర్శనం. ఇది ఇంకా వికసించి, ఈశ్వర దర్శనంగా ఫలిస్తుంది.

## సావిత్రి సత్యవంతులు

*రాజకుమార్తె సావిత్రి రూపవతి, గుణవతి మాత్రమే గాక గొప్ప విద్వాంసురాలు కూడా. ఆమెకు యుక్తవయస్సురాగానే వివాహ ప్రయత్నాలు ప్రారంభించినప్పుడు ఎవరైతే తాను ఉన్నతమార్గంలో పయనిస్తూ, భార్యను కూడా ఉత్కృష్ట మార్గంలో పయనింపచేయగలడో అటువంటి ఆదర్శ పురుషుణ్ణి మాత్రమే వివాహమాడగలనని తల్లిదండ్రులను తన నిర్ణయాన్ని తెలియజేసింది. ముందుకు వచ్చిన అనేక వివాహ సంబంధాలను, రాజకుమారులను తిరస్కరించి కొద్దిమంది సంరక్షకులను వెంట బెట్టుకొని కోరుకున్న భర్తను అన్వేషిస్తూ ఆమె స్వయంగా బయలుదేరింది. ఈమెకు మార్గమధ్యంలో కట్టెలు కొట్టుకొనే ఒక యువకుడు కనిపించేడు. ఆమె రథాన్ని ఆపి అతన్ని సమీపించి కుశల సమాచారాన్ని తెలిసికొనగా అతడు తన తల్లిదండ్రులు వాన ప్రస్థాశ్రమాన్ని స్వీకరించి ఈ అడవిలో సాధన చేసుకొంటున్నారని, రాజ సింహాసనాన్ని సోదరులకు ఇచ్చివేసి తల్లిదండ్రులను సేవిస్తూ వారివెంట వచ్చాననీ, జీవనోపాధికి కట్టెలు కొట్టి అమ్ముకుంటున్నాననీ విషయాన్ని వివరించేడు. సావిత్రి అత్యంత ప్రభావితురాలై ఆ యోగి పుంగవుడే తనకు తగిన వరుడని నిశ్చయించుకొని తన అభీష్టాన్ని తెలియజేసింది. సత్యవంతుడు తల్లిదండ్రుల ఆశీర్వాదాన్ని తీసికొని ఆమెతో వివాహానికి అంగీకరించాడు. ఆవిధంగా ఎండకన్నెరుగని రాజకుమారి సావిత్రి కట్టెలు కొట్టుకొని జీవించే సత్యవంతుని ఇల్లాలై వనవాసంలో జీవించసాగింది. సంతానోత్పాదనకు తగిన వాతావరణం ఏ మాత్రము లేదు. ఆదర్శ పతీపత్నులు ఆనందంగా ఋషి జీవితాలు గడిపేవారు. కొంతకాలానికి సత్యవంతుని మరణ సమయం ఆసన్నమైంది. అతని ప్రాణాలు కొని పోవచ్చిన యముడు ఈ ఆదర్శ దంపతులను జూచి చలించిపోయాడు. కర్తవ్యధర్మాన్ని పట్టుకొని ఎంతగానో ప్రాకులాడి గూడ, చివరకు ఏమి చేయలేక ఆ ఆదర్శ దంపతుల ముందు తలవంచి, తీసికొని పోయే ప్రాణాలను సైతం తిరిగి ఇచ్చివేశాడు. ఉత్తమ గృహిణి యొక్క ఆదర్శం యమధర్మరాజువంటి కఠోర కర్తవ్యపాలకుణ్ణి గూడ కదలించి వేయగలిగింది. చరిత్రనే చరితార్థం గావించిన ఉత్తమ గృహిణిగా సావిత్రి చరిత్రలో శాశ్వతంగా నిలచిపోయింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**ఏమి చేయాలో తెలియనప్పుడు ఆశ్రయించవలసినది గురువునే**

# చింతించకండి - చింతన చెయ్యండి

చింత అనేది మనందరి జీవితంలోనూ ఏదో ఒక రూపంలో వస్తుంది. అలా చింతించటం స్వాభావికం కూడా. కానీ మన జీవితాన్ని చెదపురుగు వలె నమిలి తినేసే వ్యర్థమైన చికాకులు చాలానే ఉంటాయి. వాటి కారణంగా మనిషి ఎన్నటికీ ఏ లక్ష్యము చెంతకు చేరలేడు. పైగా తన జీవితాన్ని నిరర్థకమైన చింతలోపడి చేజార్చుకుంటాడు. చింత మన భవిష్యత్తులో వచ్చే దు:ఖాలను తగ్గించకపోగా వర్తమానం ఇంకా చెప్పాలంటే ఈరోజు సంతోషాలను మన నుండి దూరం చేస్తుంది.

హడావిడితో కూడుకున్న నేటి వర్తమాన ప్రపంచంలోకి తొంగిచూసినట్లయితే కనుక నిష్కారణంగా చింతకు లోనవ్వటం అనేది మానవ స్వభావంగా మారుతున్నది. ప్రజలు ఈ చికాకుల నుండి బయటపడటానికి ఇంతకుముందుకంటే ఎక్కువగా మందులను సేవిస్తున్నారు. అది ఎంతమాత్రమూ మంచిది కాదు. గణాంకాల ననుసరించి 40%మంది మానవులు ఎన్నడూ జరిగే అవకాశం లేని సంఘటనలను గురించి చింతిస్తూ వ్యాకులపడుతున్నారు. 30% మంది ప్రజలు గతంలో జరిగిపోయిన సన్నివేశాలను గుర్తుచేసుకుంటూ అవి మళ్ళీ జరుగుతాయేమో అన్న అనుమానంతో బాధపడుతున్నారు. 12% మంది జనం ఆరోగ్యసమస్యలతో సతమతమవుతున్నారు. 10% మంది మనుష్యులు రోజువారి పనుల ఒత్తిడి వలన అలజడికి లోనవుతున్నారు. 8% మంది వ్యక్తులు మాత్రం 'సరైన సమయంలో తీసుకున్న నిర్ణయంతో సార్థక ఫలితమును పొందుతాము ' అనే నమ్మకమున్న సమస్యల గురించి చింతన చేస్తూ ఉంటారు. అంతేకాదు నిజంగా ఆలోచించవలసిన అంశములను గురించి యోచిస్తూ ఉంటారు. ఈ కారణంగా వారు పడిన ఆవేదన, చేసిన చింతన వారికి సత్ఫలితానిస్తుంది.

ఈరకంగా మనం చూచినట్లయితే కనుక 92% మంది ప్రజలు వేటినైతే మార్చటం వారి చేతిలో లేదో వాటి గురించి మథనపడుతూ ఉన్నారు. ఆ ఆలోచన (మనోవేదన) వినువీధిని కమ్ముకున్న మబ్బు వలె జీవితంలో రాబోయే కొంగ్రొత్త ఆలోచనల కాంతిని అడ్డుకుంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం అనుభవిస్తున్న ఆనందాలను కూడా దూరం చేసివేస్తుంది. అందుచేత ఈ చింతలలో మన శక్తిని వృథాగా పోగొట్టుకో రాదు. చెయ్యవల్సినది ఏదైనా ఉన్నదీ అంటే అది – మనస్సును బరువెక్కించే ఈ తలపుల వెనుక దాగున్న అసలు కారణాన్ని వెతికి పట్టుకోవాలి.

జీవితం పండుగ వంటిది. అది అందరికీ ఏదో ఒకటి తప్పకుండా పంచుతూనే ఉంటుంది. ఐతే మనం కోరుకున్నదే మనకు దక్కాలి అనేం లేదు అన్న విషయాన్ని మనందరం దృష్టిలో పెట్టుకోవాలి. కానీ మనం ఈ కోర్కెల వలలో చిక్కుకుని చింతిస్తూ ఉంటాం. మనోకామన ఈడేరినప్పుడు అంతులేని సంతోషం లభిస్తుంది. ఒకవేళ అనుకున్నది జరగకపోతే మళ్ళీ దాన్ని ఎలా సాధించాలా అన్న చింతకు లోనవుతాం. అసఫలత వస్తే దుఃఖం, నిరాశ ఆవరిస్తుంది. ఐనా కూడా చింతించటం అనే అలవాటును మటుకు వదలుకోం.

ఈవిధంగా వేదనకు గురయ్యే వ్యక్తి జీవితంలో సాధించేది ఏమీ ఉండబోదు. పైగా చేతికందిన అవకాశాలను కూడా కచ్చితంగా చేజార్చుకుంటాడు. శాస్త్రములలో ఒక కథ వస్తుంది. ఒక వ్యక్తికి ఒక కన్ను దెబ్బతిని చూపుపోయింది. అతను ఎంతో దు:ఖానికి లోనయ్యాడు. దీనికితోడు 'ఇకముందు నేను ఇంకెన్ని కష్టములను భరించాలో' అన్న ఆవేదన మరింత ఎక్కువగా అతనిని బాధిస్తున్నది.

ఈ బాధతో అతనికి రెండురోజులు సరిగా నిద్రపట్టలేదు. నిద్రలేమి కారణంగా రెండవ కన్నులో కూడా నొప్పి మొదలయ్యింది. నా రెండవ కంటి చూపు కూడా పోదు కదా అన్న చింత అతనిలో తలెత్తినది. 'నువ్వు దిగులును వదిలిపెట్టి విశ్రాంతి తీసుకో.' నీ రెండవ కన్ను బాగానే ఉన్నది. ఒకటి రెండు రోజులలో ఇప్పుడున్న ఆ కాస్త నొప్పి కూడా నెమ్మదిగా తగ్గిపోతుంది అని వైద్యుడు సూచించాడు. వైద్యుడి సలహాను పాటించి అతను ఆరోగ్యవంతుడయ్యాడు. ఈరకంగా చూసినప్పుడు కష్టమును చూచి మనం వ్యర్థంగా మథనపడటం సహజమే. ఐతే నిజంగా కష్టం దానికదే అంత బాధాకరమైనదేమి కాదు. దాన్ని చూచి మనమే గోరంతను కొండంతలుగా భావించి వృథాగా చింతిస్తాం.

**ఓటమిలేని వాడికి అనుభవం రాదు**

చాలాసార్లు మన జీవితంలో వచ్చే విపత్కరపరిస్థితులే మనం తల్లడిల్లిపోవటానికి కారణమవుతాయి. మనం వాటిని ఎదుర్కోవటం బదులు వ్యాకులపడతాము. నిజమేమిటంటే ఆ విపత్కర సంఘటనలే మనం ముందుకు సాగటానికి ప్రేరణ నిస్తాయి. సరైన ప్రయత్నం చేసినచో మన ఉన్నతికి మార్గం సుగమం చేస్తాయి. పర్వాతారోహకులు కఠినమైన శిక్షణ పొంది, ఎన్నో వ్యయప్రయాసల కోర్చి శిఖరాగ్రమునకు చేరినా వారు పరుగుపందెంలో పాల్గొంటే ఎన్నడూ ఒలింపిక్ పతకం సాధించ లేరు. కానీ అవే కొండల మీద పరుగును అభ్యసించే ఆట గాండ్రు మాత్రం ఒలింపిక్ పతకాన్ని సాధించగలరు. ఎందు కంటే సంకల్పంలో తేడా ఉన్నది. ఆ బలమైన సంకల్పం మనిషిని గమ్యానికి చేర్చి అనుకున్నది సాధించేటట్లు చేస్తుంది. ఈరకంగా కఠినమైన సంఘర్షణ, పరిశ్రమ, గట్టి ప్రయత్నముతో జీవితంలో నూతన ఆయామాలు లేక కోణాలు ఆవిష్కరింప బడతాయి. అప్పుడు చింత రూపంలో ఉన్న చీకటిని జీవితం నుండి తరిమికొట్టవచ్చు.

యుగఋషి పరమపూజ్య గురుదేవులు 'చింతన చెయ్యండి – చింతించకండి' అని చెపుతుండేవారు. 'చింతన – చింత' మధ్య భూమ్యాకాశాల నడుమ ఉన్నంత వ్యత్యాసమున్నది. చింతన అనగా ఒక విషయానికి సంబంధించి ప్రతి కోణం లోనూ ఆలోచించడం! చింత అనగా జరగనిదాన్ని గురించి మన మనస్సులో భయమునకు చోటివ్వటం! చింతన ఆవశ్యక మైనది. చింత ముమ్మాటికీ నిరర్థకమైనది. వ్యర్థ విషయాలను గురించి చింతిస్తూ మనిషి ఎంత శక్తినైతే నష్టపరచుకుంటున్నాడో ఒకవేళ సవ్యంగా ఆలోచించి సమస్యకు తగిన పరిష్కారమును వెతకటానికి ఆ శక్తిని వినియోగిస్తే అతను విజయుడు కాకుండా ఎవరు ఆపగలరు?

అందువల్ల జవాబు దొరకని ప్రశ్నలు లేక విషయాలను గురించి, ఏమి చెయ్యలేని అంశాలను గురించి చింతించటం మానుట అన్నదే మనోవేదనను దూరం చేసుకునేందుకు చక్కని పరిష్కారం. చింతలేని జీవితం గడపటానికి లాభదాయకమైన, అన్నింటినీ మించిన సరైన మార్గం 'చింతను విడనాడి– చింతనాపూర్వకమైన కార్యమును చేపట్టుట.' గడిచిపోయినదేదో అది ఎన్నడూ తిరిగిరాదు. ఇక రాబోయేదాని గురించి చింతించి నంత (ఆలోచన చేసినంత) మాత్రమున దానిలోనూ మార్పు చేర్పులు చేయలేం. చెయ్యగలిగినదేమైనా ఉన్నదీ అంటే వర్తమా నంలో పురుష ప్రయత్నం చెయ్యటం మాత్రమే. ఆ ప్రయత్నంతో మన భవిష్యత్తును మలచుకోవచ్చు లేక మార్చుకోవచ్చు. అందుచేత చింతించటం బదులు పని చెయ్యటానికి చక్కని ప్రణాళికను వేసుకోవాలి. సవ్యంగా ఆలోచిస్తూ పని చెయ్యాలి.

– అనువాదం: *శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

---

## ప్రేమ తత్త్వం

*దాంపత్యం యొక్క పవిత్రత అనేక పక్షుల్లో మనం చూడవచ్చు. చకోరపక్షి జంట యొక్క ఉదాహరణ చాలా ఉత్కృష్టమైనది. ఈ జంట ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ ఇరువురిలో ఏ ఒక్కరికైనా మృత్యువు సంభవిస్తే రెండవ పక్షి కూడా ప్రాణత్యాగం చేస్తుంది. మరొకరి తోడుకోసం ఎంత మాత్రం ప్రయత్నించదు. ఇది నేటి మానవులు కూడా చేయలేని మహాత్యాగంగా అంగీకరించక తప్పదు. జీవజగత్తు యొక్క దాంపత్య జీవితానికి సంబంధించిన కొన్ని ఉదాహరణలను చూద్దాము. వేల్ చేప తన పిల్లలను కూడా వెంటపెట్టుకొని తిరుగుతూ ఉంటుంది. ఏదైనా విపత్తు సంభవిస్తే ముందుగా పిల్లలను సురక్షిత ప్రాంతాలకు చేర్చి తరువాత ఆక్రమణకారులను ఎదుర్కోవటానికి ప్రయత్నిస్తుంది. ఇలాంటి పరిస్థితులలో మగ చేప కూడా భార్యకు అనేక విధాలుగా సహకరిస్తుంది. విపత్కర పరిస్థితులలో పారిపోయి ప్రాణ రక్షణ చేసుకోవటానికి బదులు తన ప్రియురాలితో పాటుగా ఆనందంగా ప్రాణత్యాగం చేస్తుంది. మూగ ప్రాణులు ఇంతటి ప్రేమ తత్త్వాన్ని కలిగి ఉండటం నిజంగా ప్రశంసనీయము. పావురము, చకోరము, మొదలైన కొన్ని పక్షులు ముమ్మాటికీ నిజం. అవి ఒక్కసారి సంబంధాన్ని ఏర్పరచుకున్నాయంటే దానిని చాలా విశ్వాసంతో నిలబెట్టుకొంటాయి. ఎలాంటి పరిస్థితుల్లోను విడిపోవు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

అనువాదం: *శ్రీమతి గౌరీ సావిత్రి*

**అనుభవం లేనివాడికి జ్ఞానం రాదు**

# ఆధ్యాత్మిక దృష్టికోణం అలవర్చుకోవాలి

**యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే.**

పరమేశ్వర ప్రాప్తి రూప లాభానికి మించిన లాభం మరేదీ లేదని యోగి భావిస్తాడు. ఆత్మప్రాప్తి వల్ల దుఃఖం మనిషిని స్వారీ చేయలేదు.

ఎంత డబ్బు సంపాదించినా, ఎంత గొప్ప చదువులు చదువుకున్నా, ఎంతటి శక్తిని ఆర్జించినా, సంసార బాధలన్నిటి నుండి విముక్తి పొందలేము. డబ్బుతో అవసరాలనీ, లేమినీ మాత్రమే తీర్చుకోగలము. విద్యతో బౌద్ధిక వికాసం కలుగుతుంది. శక్తితో ఇతరులను వశపరుచుకోవచ్చు. కాని ఈ విజయాలేమీ బాధలనుండి ముక్తినివ్వలేవు. ధనవంతులకు దుఃఖం కలుగుతుంది, విద్వాంసులు శోకిస్తారు, శక్తివంతులు కూడా ఓడిపోవడం చూస్తున్నాము.

ధనవంతులకు విద్య లేకపోతే జడత్వం వల్ల డబ్బు నాశనానికి దారి తీస్తుంది. విద్యాంసులకు ఆరోగ్యం లేకపోతే విద్యను సరైన రీతిలో ఉపయోగించలేరు. రేయింబవళ్ళు ఆరోగ్యాన్ని రక్షించుకోవడమే సరిపోతుంది. కాస్త పనిచేస్తే చాలు ఏ తలనోప్పో, అజీర్తో చేస్తుంది. జలుబులు, జ్వరాల బారిన పడతారు. ఈ విధంగా ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు వస్తాయి. చదువు మాత్రమే ఉండి, ధనము, విద్య లేకపోతే అడుగడుగునా ఇబ్బందులే. ధనం లేకపోతే శక్తి ఉన్నా ఉపయోగపడదు. శక్తిని ఉపయోగించి డబ్బు సంపాదించినా, విద్య లేకపోతే ఆ డబ్బు పనికిరాదు. విద్య లేని శక్తి భయంకర పరిణామాలకు దారి తీస్తుంది. మనిషి అన్యాయం, ఆతంకం, అత్యాచారాలు చేయడానికి పూనుకుంటాడు. ధనం, విద్య, శక్తి, ఈ మూడు వస్తువులు కలిసి ప్రపంచంలో ఏ ఒక్కరికీ దక్కదు.

ఒక వేళ ఈ మూడూ ఎవరికైనా లభించినా లాభనష్టాలు, వియోగ విక్షోభాలు, ఈర్ష్యాద్వేషాలు మొదలైనవాటి వల్ల మనిషి బాధపడుతూనే ఉంటాడు, ఉద్విగ్నుడవుతాడు. కాబట్టి డబ్బు, విద్య, శక్తి, మూడు సంపాదించినా కూడా మనిషి సుఖంగా, తృప్తిగా, ప్రశాంతంగా ఉంటాడనే నమ్మకం లేదు. అన్ని క్లేశాల నుండి అన్ని రకాలుగా నిశ్చింతగా ఉంచగలిగే వస్తువు, సాధన ప్రపంచంలో ఏదీ లేదు.

మనిషి జీవిత లక్ష్యం ఆనందప్రాప్తి. అతను అన్ని రకాల ప్రయత్నాలు చేసేదీ దానికే. భౌతిక విభూతుల సహకారంతో అది లభించదు. మనిషి దుఃఖం, ఉద్విగనతలతోనే ఉంటాడు. ఇలాంటిస్థితిలో ఈ అపజయాన్ని విజయంగా మార్చే ఉపాయం ఏంటి? ఒకే ఒక్క ఉపాయం, 'ఆధ్యాత్మికత'. ఆధ్యాత్మికత మహిమ అపారమైనది. దాని నుండి లభించే నిర్హేతుక సుఖాన్ని పోలినది ప్రపంచంలోని మరే విభూతి నుండి లభించే క్షణిక సుఖాల వల్ల రాదు. మానవజీవితంలో సర్వోత్కృష్ట విభూతి అదే. దాని సహకారంతో మనిషి దేవతల వలే ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటాడు. దేవత్వప్రాప్తి వల్ల దుఃఖం పూర్తిగా నాశనమైపోతుంది.

భవరోగాలన్నిటికీ ఆధ్యాత్మికం అమోఘమైన ఔషధి. దుఃఖాల నివారణకి భౌతిక ప్రయత్నాలతో పాటు ఆధ్యాత్మిక సాధన చేస్తే తప్పకుండా భవరోగాలన్నీ సహజంగా తొలిగిపోతాయి. ఆధ్యాత్మిక ఔషధి గొప్పతనం తెలిసిన ప్రాచీన ఋషులు, మునులు భౌతిక సుఖాలన్నిటినీ త్యజించి సుఖంగా, ఉపయోగకరమైన జీవితాలను గడిపి, ఆమోఘతను సిద్ధించుకున్నారు. నేటికీ అందులో అంతే ప్రాముఖ్యత ఉన్నది. కాని మన భ్రమ, అజ్ఞానం, బద్ధకం, అపనమ్మకాలు మొదలైన దోషాలు మన దృష్టికీ ఆధ్యాత్మిక మహత్తుకీ మధ్య తెర వేసింది. ఆధ్యాత్మిక మహత్తును పూర్తిగా మర్చిపోతున్నాం. భౌతిక కార్యసాధనల్లో పూర్తిగా విలీనమైపోయి, ఆధ్యాత్మిక సాధనను నిర్లక్ష్యం చేయడం వల్లనే, ఇంతటి ఉన్నతి, ప్రగతి సాధించాక కూడా బాధగా, దీనంగా ఉంటున్నాడు.

బాహ్యజ్ఞానం, భౌతిక కార్యసాధనలు, జడ విజ్ఞానం ఏ స్థాయికి వికశించినా కూడా మనిషి జీవిత లక్ష్యమైన ఆనందాన్ని పొందలేవు. దానికి ఆధ్యాత్మిక తత్వాన్నే ధారణ చేయాలి. బాహ్య వికాశం, భౌతిక ఉన్నతి, మనిషికి పరిమిత సౌకర్యాల సుఖాన్ని మాత్రమే అందించినా, వీటితో స్థిరసుఖాన్ని పొందడం మాత్రం సాధ్యం కాదు. అది ఆధ్యాత్మికతతోనే దొరుకుతుంది. భౌతిక విభూతులు ఇంద్రియ సుఖాలను మాత్రమే ఇవ్వగలవు. కాని ఆధ్యాత్మిక బలంతో, ఇంద్రియ నిగ్రహం ద్వారా లభించే అఖండ ఆనందాన్ని అవి ఇవ్వలేవు. బాధలు, చిక్కుముళ్ళ నుండి విముక్తి పొందాలంటే, ప్రాపంచిక వాంఛలను తగ్గించుకుని, శ్రేయస్కరమైన ఆధ్యాత్మికమార్గంలో ప్రయాణించాలి. ప్రాపంచిక కర్తవ్యాలతోపాటు ఆత్మసాధనలో నిమగ్నమవ్వాలి.

**ఓడినప్పుడు పాఠాన్ని స్వీకరించాలి**

భౌతిక ప్రగతి కోసం మానవ జాతి వెచ్చిస్తున్న సమయంలో ఒక్క భాగమైనా ఆత్మిక క్షేత్రాన్ని వికశించడానికి వినియోగిస్తే జీవిత లక్ష్యమైన ఆనందం ఎప్పుడో లభించేది. ఈ భౌతిక దృష్టికోణం వల్లనే గొప్ప ఆధ్యాత్మిక లాభాలకు దూరమవుతున్నారు. ఆత్మ-పరమాత్మ జ్ఞానం లేని జడ జ్ఞానం వల్లనే బాధలన్నీ ఉత్పన్నమవుతున్నాయి. భౌతిక ప్రగతితో పోలిస్తే ఆధ్యాత్మిక సిద్ధులు లెక్కలేనన్ని వాటిని మనిషి స్వంతం చేసుకోగలడు. కాని దానికి సమయం, పరిశ్రమ, చైతన్యాన్ని కూడా ఆత్మ వికాశానికి వినియోగించాలి. ఒక్కసారి ఆత్మానందాన్ని పొందితే ప్రపంచంలోని భోగభాగ్యాలన్నీ తుచ్ఛమైనవిగా కనిపిస్తాయి.

నశ్వరమైన భోగాలను సాధించడం కాదు మనిషి లక్ష్యం. ప్రపంచంలో అమృతత్వాన్ని పొందడానికి అవతరించాడు మనిషి. ప్రపంచంలో అమృతమైనది, అక్షరమైనది, నాశనం లేనిదీ ఆత్మ ఒక్కటే. ఆధ్యాత్మిక మార్గం ద్వారా ఆత్మను, ఆత్మ ద్వారా పరమాత్మను పొందడమే మనిషి జన్మ యొక్క ఉద్దేశం. దీన్ని మర్చిపోయి, ప్రాపంచిక భోగాల ద్వారా శరీరాన్ని మాత్రమే ఉపాసించే మనుషులు తమకు తాము చాలా నష్టాన్ని కలుగచేసుకుంటారు. ఇటువంటి వారినే శాస్త్రాలలో అజ్ఞానులు అన్నారు.

మన బాధాకరమైన పరిస్థితులన్నిటికీ కారణం కేవలం భౌతిక దృష్టికోణం. మనం గనక ఈ దృష్టికోణాన్ని కాస్తైనా ఆధ్యాత్మికత వైపు మరల్చగలిగితే చాలావరకు పరిస్థితులు కూడా మారిపోతాయి. ఆత్మను పట్టించుకోకపోతే, భౌతిక సంపదలేవీ మన బాధల్ని పోగొట్టలేవు. ఆధ్యాత్మిక జీవిత విధానాన్ని అలవర్చుకోకుండా జీవిత లక్ష్యాన్ని సాధించలేము.

మనిషి జీవితానికి ఆధ్యాత్మికత చాలా పెద్ద ఆధారం. అన్నిటికన్నా గొప్ప సంపద. భౌతిక మరియు ఆత్మిక పరాకాష్టకు చేర్చగలిగే దారి ఇదొక్కటే. అంతటి సంపదను పట్టించుకోక పోవడం వల్లనే మానవ జాతి ఇలాంటి దీనమైన, హీనమైన ఆత్మిక దారిద్ర్య జీవితాన్ని గడుపుతోంది. ఆత్మను ఉపేక్షించడం, అనాధ్యాత్మిక జీవితం గడపడం వల్లనే ఇంతటి భయంకరమైన పతనం సంభవించింది.

శరీరాన్ని ఒక భోగ సామాగ్రిగా పరిగణించడమే అమంగళ కరమైన దృష్టికోణం, అనాధ్యాత్మిక భావం. ఆధ్యాత్మిక సాధనకు మాధ్యమం ఈ శరీరం. దీనివల్లనే ఆత్మజ్ఞానం లభిస్తుంది, పరమాత్మ సాక్షాత్కారం వీలవుతుంది. అలాంటి పవిత్ర మాధ్యమాన్ని ప్రపంచంలోని అపవిత్ర భోగాలలో ముంచడమే అమంగళకరమైన నిర్లక్ష్యధోరణి. అలా ఎప్పుడూ చేయకూడదు.

శరీరాన్ని దైవమందిరంగా భావించాలి. ఆత్మ సంయమనం మరియు ఆధ్యాత్మిక సాధన ద్వారా దాన్ని సన్మార్గం వైపు నడిపించాలి. అనాత్మ భావం ఉంది కాబట్టే శరీరం రూపొం దింది. లేకపోతే శరీరమనే ఈ చమత్కారమైన సామగ్రి ద్వారా మాత్రమే ఆత్మను పొందగలం, పరమాత్మను సాక్షాత్కరింపు కోగలం. శరీరం మన సొత్తు అనుకుని ఇష్టం వచ్చినట్టు వాడడం తప్పు. అది ఆత్మ యొక్క ఆస్తి. ఆత్మ అందించిన పారితోషికమే శరీరం. కాబట్టి ఎటువంటి భవబంధనాలలో ఆత్మ చిక్కుకుందో, వాటి నుండి విడిపించడం కోసం మాత్రమే శరీరాన్ని వాడాలి. అప్పుడే జీవికి శాశ్వత సుఖం లభిస్తుంది.

భౌతిక వాదమనే ఉన్మాదం వల్ల మనిషి మంచి, చెడులలో తేడా చూడలేకపోతున్నాడు. అమంగళంలోనే మంగళాన్ని చూసేంతగా దృష్టి కలుషితమైపోయింది. మానసిక వికారాలు, ఆవేదనలు, ప్రలోభనలు, పాపాలను నియంత్రించుకోవడం కష్టమైపోయింది. చిన్నపాటి ప్రలోభనలు చూపిస్తే చాలు, ఎలాంటి పాపాలు చేయడానికైనా సిద్ధమైపోవడం, కాస్తంత భయంకర పరిస్థితులు ఎదురైనా కర్తవ్యాన్ని వదిలేయడం లాంటివి చాలా సాధారణ విషయాలు అయిపోయాయి.

చిత్తంలో అస్థిరత, జీవితంలో ఉద్దేశ్యం లేకపోవడం మనుషు లను విక్షిప్తుల్ని చేసింది. చేయకూడని పనులు చేసి శోక సంతాపాల జంఝాటంలో ఇరుక్కుంటున్నారు. ఉపేక్షించదగ్గ అపజయాలు, ప్రతికూలతలు, ఇబ్బందులు కూడా మనిషిలో వెంటనే కోపం, నిరాశ, నిరుత్సాహాలను కలిగిస్తున్నాయి. స్వార్థం, ఈర్ష్య, కాముకత, నిష్ఠూరత, అసహనం, విషయ వాసనలు అన్నీ కలిసి మనిషి జీవితాన్ని నికృష్టంగా మార్చేశాయి. ఇలాంటి భయంకరమైన మనోభూమి, పాపాత్మక వ్యవహారాలతో మనిషి తన జీవిత లక్ష్యమైన పరమానందాన్ని సాధించగలడని ఎలా ఆశించగలం.

ఈ వికారాలు, విపరీతాలు అన్నిటికీ ఒకటే కారణం, ఆధ్యాత్మికతను ఉపేక్షించడం. ప్రపంచంతోపాటు ఆత్మను కూడా పట్టించుకుని, దాని వికాశానికి, ముక్తికి కూడా ప్రయత్నం చేస్తూ ఉంటే త్వరలోనే భవరోగాలన్నిటి నుండి ముక్తి పొంది మనిషి ఆనందం వైపు పయనించగలడు. ఆత్మలాభమే సర్వశ్రేష్ఠమైన లాభం. ఆత్మప్రాప్తి మాత్రమే శ్రేయస్కరమైనది. దాన్ని సాధించడానికే ప్రయత్నిస్తూ ఉండాలి.

*– అఖండజ్యోతి, జనవరి 1970*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**దగా, వంచన, మోసాలకు పాల్పడకండి**

శిష్య సంజీవని-7

# తనకు తాను స్వామియైనవాడే అసలైన యజమాని

'శిష్య సంజీవనీ'ని సేవించేవారి ఆధ్యాత్మిక వైభవం అభివృద్ధిచెందుతూ ఉంటుంది' అని అనేకమంది సాధకుల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఈ అనుభవాలు ఒక్కొక్క పుటలో ఒక్కొక్క విధంగా ఉన్నాయి. శిష్యత్వం సానబెట్టబడే కొలదీ మరింతగా తీక్షణమౌతుంది. పరిమళం వెదజల్లే సాధన యొక్క సౌరభాలు ఎంతో ప్రత్యేకమైనవి. సమర్పణ తాలూకూ సరిగమలు సాధనాపథంలో ఎల్లెడలా వినవస్తుంటాయి. శిష్య సంజీవనీలోని సత్యము, సారమును త్రాగినవారికి శిష్యత్వం తాలూకూ ఒక క్రొత్త శక్తి జాగృతమౌతూంటుంది. కొంతమంది పరిజనులు గురుదేవుల చేతనత్వము తమలో ఉప్పొంగుతూ, ఉరకలువేస్తూ, దౌడుతీస్తూండటాన్ని అనుభూతిచెందుతారు. మరికొందరు గురుదేవుల రహస్యమయ స్పర్శను తమ భావనా చేతనత్వములో వినగలిగారు. చాలామంది యొక్క సాధనా జీవితం ఉన్నతస్థాయి చేతనత్వము యొక్క సంకేతాలు, సందేశాల ద్వారా ధన్యమైనది. శిష్యత్వ సాధనా భావనలతో ఆవృత్తమైన వారి జీవితములు నిశ్చయంగా ఎంతో భాగ్యవంతమైనవే! ఈ వాక్యాలను చదువుతూ నిజమైన శిష్యత్వం కోసం ప్రయత్నశీలురైన వారి జీవితాలు పైన చెప్పబడినవారి జీవితాలకన్నా మరింత ధన్యములే!

ఈ ప్రయత్నాన్ని ఇంకా తీవ్రతరం గావించేందుకు శిష్యసంజీవనీలోని ఈ ఆరవసూత్రం మరింత ఉపయోగ కరమైనది. శక్తి కావాలని బలమైన కోరిక కావాలి. లోకుల దృష్టిలో ఇటువంటి శక్తి మరెక్కడా ఉండదు అనేవిధంగా శిష్యుడు కోరుకునే ఆ శక్తి ఉండాలి. దానితోపాటే శాంతి కావాలను కోవాలి. ఐతే నీవు కోరుకునే ఆ పవిత్రమైన శాంతిలో ఎలాంటి అవరోధమూ ఉండకూడదు అన్న విషయము మీద దృష్టి సారించాలి. అటువంటి ప్రశాంత వాతావరణంలో శాంత సరోవరంలో పవిత్రమైన పద్మం వికసించిన రీతిగా నీ ఆత్మ వికసిస్తుంది. శక్తి, శాంతి... ఈ రెండింటితోపాటుగా స్వామిత్వం (నీ మీద నీకు సంపూర్ణమైన అధికారం) కావాలనే అపూర్వమైన కోరికను కూడా కోరుకో! కానీ ఈ సంపదలన్నీ కేవలం స్వచ్ఛమైన ఆత్మకు మాత్రమే లభించగలవు. కాబట్టి పరిశుద్ధమైన ఆత్మలన్నింటికీ వీటిపైన హక్కు సమానంగానే ఉంటుంది.

శిష్యసంజీవనీ యొక్క ఈ సూత్రములో వేదముల సారము, సాధుసత్పురుషుల పవిత్రత, సిద్ధపరంపర యొక్క రహస్యమూ కూడా ఉన్నాయి. ఈ సూత్రము యొక్క భావము ఎంతో రహస్యమైనదీ, సందిగ్ధమైనదీ! సూత్రములోని మొదటి మాటలోనే ఎంతో వైరుధ్యమున్నది. ప్రజలదృష్టిలో, జన సందోహం యొక్క అభిప్రాయములో మన గొప్పతనం బాగా కనిపించాలనే కోరికతోనే సాధారణంగా జనం శక్తివంతులు కావాలని కోరుకుంటారు. అహం ఎంత ఎక్కువగా ప్రతిష్ఠించ బడితే ఆ మనిషి యొక్క గొప్పతనం, గౌరవం ప్రజల దృష్టిలో అంత అధికంగా ఉంటుంది.

తత్ఫలితంగా ప్రజలు అతనికి భయపడుతూ ఒదిగి యుంటారు. గౌరవ ప్రతిష్ఠలను బట్టే శక్తిసంపన్నుడౌతాడు. ఇది ఈనాడు ప్రపంచంలో చలామణీ అవుతున్న జీవనవిధానం. కీర్తిప్రతిష్ఠలను పొందటానికీ, అధికారం చెలాయించటానికీ ప్రజలు శక్తివంతులు కావాలని కోరుకుంటారు.

కానీ శిష్యుని జీవితంలో దీనికి అర్థమే వేరు. శిష్యుడు తనను తాను సంపూర్ణంగా గురుచరణములకు అంకితం చేసుకొనటానికి మాత్రమే శక్తిని కోరుకుంటాడు. సమర్పణా సాధనలో తనను తాను విసర్జన చేసుకొనగలిగే భావదశకోసం తన అస్తిత్వాన్ని గురుదేవుల అస్తిత్వాన్ని విలీనం చేసుకొనటానికి, ఆ అనుభూతి పొందటానికి లోతైన శక్తి చాలా అవసరము. ఈ పని ఎంతో కొంత శక్తితో అయ్యేదికాదు. చెల్లాచెదురైయున్న తన ఉనికిని ఒకచోటుకు చేర్చుకొని ఏకత్రితం చేసి అప్పుడు దానిని గురుదేవుల అస్తిత్వంలో విలీనం చెయ్యటమనేది ఎంతో గొప్ప సాహసంతో కూడిన పని. ఇందుకోసం గొప్ప శక్తి చాలా అవసరం. తమను తాము తీర్చిదిద్దుకొనటానికీ, ఉన్నత స్థాయికి చేరటానికీ అందరూ కష్టపడుతూనే ఉంటారు. కానీ తమను తాము సమాప్తం చేసుకొనటానికి లేదా తమ ఉనికిని విసర్జించుకొనటానికి అరుదుగా మాత్రమే మనుష్యులు తారసపడుతుంటారు. శిష్యుడైనవాడు ఈ అరుదైన పనిని చెయ్య

**రక్తపాతానికి, వడ్డీలావాదేవీలకు దూరంగా ఉండండి**

వలసి ఉంటుంది. శిష్యత్వంలోని నిజాయితీని నిరూపించుకొన టానికి తనను తాను పూర్తిగా త్యాగం చెయ్యవలసి ఉంటుంది. ప్రజల దృష్టిలో కాదు. అతడు భగవంతుని సమక్షంలో, తన సద్గురువు యొక్క దృష్టిలో తనను తాను ఋజువు చేసుకొనవలసి ఉంటుంది. ఈ ప్రకారంగా చెయ్యగలిగినవాడే నిజమైన శిష్యు డవుతాడు.

శక్తితో పాటుగా శాంతిని కూడా కోరుకొనటం శిష్యత్వానికి గీటురాయి. కానీ ఇవి రెండూ కలసిరావటం అరుదుగానే సంభవిస్తుంది. ఎందుకంటే ప్రాపంచికత నిండిపోయిన జీవితంలో శక్తి అశాంతికి పర్యాయపదంగా మారి ప్రవేశిస్తుంది. శక్తి, పదవి, అధికారం ఎంత ఎక్కువగా ఉంటే అశాంతి కూడా అంతే అధికంగా ఉంటుంది. వ్యావహారిక ప్రపంచంలో శక్తి అహంకారాన్ని పెంచి పోషించటానికే తప్ప మరింక దేనికీ పనికిరాకపోవటమే ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. 'అహం'తో పాటు అశాంతి కూడా పెరుగుతుందనేది సత్యం. కానీ శిష్యత్వ సాధనలో ఈ సమీకరణాలన్నీ ఒక్కసారిగా తారు మారవుతాయి. శిష్యునికి ఉండే శక్తి సమర్పణకే ఉపయోగ పడుతుంది. అహంతా (నేను-నాది అనే అహంకారం) లేదా స్వామిత్వాన్ని విసర్జించి, విలీనం చెయ్యగలగటానికి అవసర మయ్యే శక్తి అది. ఈ శక్తి పెరిగేకొద్దీ శాంతి కూడా క్రమేపీ పెరుగుతూ ఘనిష్ఠమై, ప్రగాఢమౌతుంది.

ఈవిధమైన శక్తి, శాంతి ప్రసరించటం వలన సాధకుని అంతరంగం పవిత్రమూ, నిర్మలమూ అవుతూంటుంది. శిష్యుని జీవితం అత్యంత పవిత్రవంతమవుతుంది. భక్తి సముద్రమవు తుంది. నిర్మలమైన ఆలోచనలు తుఫాను వలె ఎగసిపడు తుంటాయి. అంతరంగంలో ఇటువంటి వాతావరణం ఏర్పడ గానే శిష్యుని ఆత్మ అన్నివైపుల నుండి వికసిస్తుంది. అందులో సద్గురువు యొక్క కృప దానంతటదే అవతరిస్తుంది. గురు కృపను అనుభూతి చెందటంలో కలిగే సహజమైన స్థితి ఇది. ఈ స్థితిని పొందకుండా గురుకృప యొక్క రహస్యాలు ఎప్పటికీ అనుభవంలోకి రావు. దుర్లభమైన ఇటువంటి అనుభూతిని ఇంతకుముందు పొందియున్నవారు, ఇప్పుడు పొందుతూన్న వారు మాత్రమే ఈ సత్యమును అర్థం చేసుకొనగలరు. మిగిలిన వారంతా కేవలం వితర్కములతో గందరగోళం పడుతుంటారు.

అంతరాత్మ ఇటువంటి స్వచ్ఛమైన భావనాస్థితిలో ఉన్నప్పుడే ఆత్మ యొక్క సంపద వ్యక్తమవుతుంది. ఆత్మిక సంపదలు, సూర్యకిరణముల వలె సాధకునిలో ప్రకటీకృత మవుతాయి. ఇక్కడే శిష్యుని (లేదా సాధకుడి) జీవితంలో నిజమైన స్వామిత్వం అభివృద్ధిచెందుతుంది. లౌకిక జీవితంలో మనం ధనం, సంపదలు, సాధనోపకరణములు, భవనాలు... మొదలైన వాటికి యజమానులం కావాలని అభిలషిస్తాం. కానీ ఎవరికి వారు యజమాని కావటం ఎలా? ఎవరిపైన వారికి ఆధిపత్యం లభించేది ఎప్పుడు? తనకుతాను యజమాని, తనపైన తానే అధికారి కావటమే 'స్వామిత్వానికి' అసలైన అర్థంగా చెప్పవచ్చు. మిగిలినవన్నీ మోసమే. డబ్బులు, దుకాణములు, ఇళ్ళు... మొదలైనవాటికి యజమానులమవుతున్నామంటే నిజానికి అది మనం వాటికి బానిసలుగా కావటమే!

అసంబద్ధమైన ఈ మాటలను అర్థము చేసుకొనటానికి సూఫీ సాధువైన ఫరీద్ జీవితంలోని ఒక సంఘటన గురించి తెలుసుకొనటం బాగుంటుంది. ఒకసారి ఫరీదా తన శిష్యులతో కలిసి ఒక గ్రామం గుండా వెడుతున్నాడు. అదే దారిన ఒక వ్యక్తి తన ఆవును త్రాడుతో కట్టి తీసుకువెడుతున్నాడు. ఫరీద్ ఆ మనిషిని ఒక్క క్షణం ఆగమని ప్రార్థించి 'ఈ ఇద్దరిలో యజమాని ఎవరు? ఆవా? లేక ఈ పెద్దమనిషా?' అని తన శిష్యులను అడిగాడు. 'ఇదేమైన విశేషమా! ఈ పెద్దమనిషే ఆవుకు యజమాని' అని సమాధానమిచ్చారు శిష్యులు. 'ఆవు మెడ నుండి త్రాడును కత్తిరించివేస్తే దీని వెనుక ఎవరు పరుగెడ తాడు? ఆవు వెనుక మనిషా? లేక మనిషి వెనుక ఆవా?' అని మళ్ళీ ప్రశ్నించాడు ఫరీదా. 'కచ్చితంగా ఆవు వెనుక మనిషే పరుగెడతాడు' అన్నారు శిష్యులు. 'మరిప్పుడు యజమాని ఎవరు?' అని అడుగుతూ ఫరీద్ 'ఆవు మెడలో మీరు చూస్తున్న ఈ త్రాడు ఉన్నదే నిజానికి ఇది మనిషి మెడలోనే ఉన్నది. ఆత్మసంపదను వదిలివేసి మిగిలిన అన్ని సంపదలూ మన మెడకు ఉరిత్రాళ్ళ వలె చుట్టుకుంటున్నాము. వాస్తవానికి ఆత్మసంపదయే అసలైన సంపద! నిజమైన శిష్యుడే దీనిని పొందగల్గిన సమర్థుడు!' అని వివరించాడు. శిష్యుని యొక్క ఈ సామర్థ్యము ఏవిధంగా అభివృద్ధి చెందగలదు? అనే అంశమును గురించి రాబోయే పుటలలో తెలుసుకుందాము.

*అనువాదం: శ్రీమతి కె. కృష్ణకుమారి &*
*శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాలు*

**ఎటువంటి పరిస్థితులలోను ఆత్మవిశ్వాసం సడలకూడదు**

బోధ కథ

# ఇచ్ఛయే ప్రపంచము

సూర్యభగవానుడు తన అనంతమైన కిరణములతో ఋషి హిమవానుడి ఆశ్రమములో ఉన్న మామాడితోట మీద స్వర్ణిమ కిరణములను ప్రసరింపజేయుట ప్రారంభించాడు. ఆ ప్రాతః కాలము నయనమనోహరముగా ఉంది. లేలేత మామిడి చిగుళ్ళు బంగారురంగులో మెరిసిపోతున్నాయి. నునులేత చిగుళ్ళతో నిండిన ఆ మామిడితోపు నుండి మనశ్శరీరములను పులకింపజేస్తూ ఉండుండి కమ్మని సువాసన గాలితెమ్మెరలతో పాటు అంతటా వ్యాపిస్తు మైమరపింపజేస్తున్నది. పరవశింప జేసే ఆ సూర్యోదయకాలము ఋషి హిమవానుని శిష్యులను ముగ్ధమోహితులనుజేస్తున్నది. అన్నివైపుల నుండి విశిష్టమైన అలౌకికత వర్షిస్తున్నది. అందంతో తొణికిసలాడుతున్న ప్రకృతి మాత అందరినీ తన ఒడిలో కూర్చోబెట్టుకున్నదా అని అనిపిస్తున్నదంటే నమ్మండి!

అప్పుడే ఋషి హిమవానుడు తలెత్తి ఆకాశం వైపు దృష్టి సారించి సూర్యదేవుడిని మనసారా ధ్యానించాడు. భక్తి అనే భావసమాధి నుండి బయటికొచ్చిన మహర్షి తన శిష్యులను వాత్సల్యముతో చూశాడు. భావసమాధిలో పొందిన జ్ఞానము ఆయన కన్నుల నుండి ధారలుగా వర్షించసాగింది. గాఢ భావానుభూతుల కారణముగా ఆయన వదనము అరుణ వర్ణమును సంతరించుకున్నది. శరీరములో సాత్వికత తేజరిల్లు తున్నది. మహర్షులవారి భావచేతన నుండి ప్రస్ఫుటించసాగిన భక్తి అనే ఉద్వేగము ఆయన ఎదుట ఆసీనమైయున్న శిష్య సముదాయము నంతటినీ భక్తిభావములో ముంచెత్తింది.

ఆ అద్భుత క్షణములలోనే మహర్షులవారి ప్రియశిష్యుడు 'సమర్పణ్' అక్కడికి వచ్చాడు. హిమవాన్ మహర్షి పురమా యించిన ఏదో పనిమీద బయటికి వెళ్ళాడు అతను. మహర్షి శిష్యులలో అత్యంత ప్రియమైనవాడు సమర్పణ్! పేరుకు తగ్గట్టు అతని గుణగణములు కూడా అందరినీ కట్టిపడేస్తుంటాయి. మహర్షి భావచేతన యొక్క అభివ్యక్తి –సమర్పణ్! తన గురు వర్యులైన మహర్షి హిమవానుడి యొక్క సేవ, ఆయన చెప్పిన మార్గమును ప్రాణములను పణముగా పెట్టైనాసరే అనుసరించుట అన్నదే సమర్పణ్ యొక్క జీవనధ్యేయము. మహర్షియే సమర్పణ్‌కు ఇష్టుడు, ఆరాధ్యుడు, సర్వస్వము తన గురువర్యులే. గురువు సాక్షాత్తు ఆ పరమాత్మ! సమర్పణుడు తన గురువును పరమాత్మగా భావిస్తాడు.

సమర్పణుడిలోని ఈ ఉదారత్వము, సహనశీలత, సేవా భావము మరియు మరెన్నో సద్గుణముల కారణముగా కేవలము మహర్షియే కాదు ఆశ్రమవాసులందరితో పాటు సహచరులు కూడా అతనిని ఎంతో అభిమానిస్తారు, ఇష్టపడతారు. గురువైన మహర్షి హిమవానుడు – శిష్యుడైన సమర్పణుడికి నడుమ తాదాత్మ్యము వంటి స్థితి ఉండేది. మహర్షులవారి వ్యక్తిత్వపు కాంతి సమర్పణ్‌లో కాంతులీనుతూ ఉంటుంది.

ఐనప్పటికినీ తనను గురువుగారితో పోల్చడం అనే సంగతి వచ్చినప్పుడు అతను అలాంటి పోలికకు ఆమడదూరంగా ఉంటాడు. తన సహవిద్యార్థులతో ఇలా అంటాడు. 'గురువు ఆ భగవంతునితో సమానుడు. గురువు సాక్షాత్తు పరమాత్మ స్వరూపుడు! గురుత్వం వంటి మహోన్నత పదవిని స్వయముగా ఆదిగురువైన ఆ సదాశివుడే అధిష్ఠించి ఉంటాడు. అల్పులు ఆ పదవిని పొందటం ఊహాతీతము. గురువు తన సంచిత, సంప్రాప్త తపోరాశి చేత శిష్యుని పరిస్థితి, ప్రారబ్ధము రెండింటినీ వికసింపచేసి పరిమార్జనము చేస్తాడు. శిష్యుడు గురువుగారి కృపలోని కేవలము ఒక అంశమాత్రమే అయ్యుంటాడు. విరాట స్వరూపుడైన తన గురువును సంపూర్ణముగా తన లోపల పొందు పరచుకొనగలిగేంత యోగ్యత శిష్యునిలో ఉండదు. శిష్యుడు తన భక్తి–శ్రద్ధలతో గురువుకు సమర్పణ చేసుకుంటాడు అన్నది ముమ్మాటికి నిజము! ఇదే సత్యము. ఇది తప్ప ఇంకేమీ లేదు.'

మహర్షి ఆశ్రమములో లేనప్పుడు సమర్పణుడు ఆశ్రమము యొక్క బరువు బాధ్యతలనన్నింటినీ ఎంతో సమర్థవంతముగా, చాకచక్యముగా నిర్వర్తించేవాడు. ఆశ్రమ ప్రాంగణములో మహర్షి లేడు అన్న భావన ఎవ్వరిలోను రాకుండా ఎంతో అప్రమత్తతతో, వ్యవహారదక్షతతో మెలిగేవాడు. అతని తోటి విద్యార్థులు తమలో తాము సమర్పణుడిని ప్రశంసిస్తూ ఇలా

**ఇతరుల నుంచి ఏమి ఆశిస్తావో, దానిని నువ్వు ముందు ఇతరులకు చేయాలి**

అనుకునేవారు. 'తన సుఖసౌఖ్యములకు నూరుశాతం తిలాంజలి నిచ్చినవాడే ఇతరులకు సుఖమును, ప్రసన్నతను అందించ గలడు. ఎవరైతే తన దుఃఖమును ఎవ్వరివద్దా వ్యక్తపరచకుండా ఓర్పుతో సహిస్తూ, శాంతిభావనతో మెలగుతాడో అతనే ఎదుటివారి మనస్సులో చక్కని నవ్వును, సంతోషమును నింపగలడు. మన సమర్పణ్ అటువంటి వాడే!'

సమర్పణునకు ఎన్నెన్నో బాధ్యతలున్నాయి. అతని తపస్సు దేహ పరిధిని దాటి మనోమయతలంలోకి ప్రవేశించినది. సమర్పణ్ యొక్క తపోస్థాయి శరీరమును అధిగమించి మనస్సు లోకి చేరుకుంది. కానీ అతను తన గురువుతోపాటు విశ్వకళ్యాణ మనే రహస్య ప్రణాళిక కొరకు నియోగింపబడ్డాడు. గురుశిష్యుల ఇద్దరి పనులు సూక్ష్మజగత్తుకు సంబంధించినవే! ఆశ్రమము కేవలము ఒక ఆధారస్థలము మాత్రమే. గురువుగారు ప్రత్యక్షముగా కనిపించే ఒక గురుకుల విద్యాలయమును నడుపు తున్నాడు. ఆ గురుకులములో ఎంతోమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మహర్షి హిమవానుడు-శిష్యుడు సమర్పణుడు ఇరువురు సూక్ష్మజగత్తులో ఆసురీశక్తులతో తలపడవల్సి ఉన్నది. సామాన్యదృష్టికి కనబడకుండా ఉన్నప్పటికీ ఆ గురుశిష్యులిద్దరు చేసే అత్యంత ముఖ్యమైన పని రాక్షస మూకలతో సూక్ష్మ లోకములో ప్రచ్ఛన్నముగా యుద్ధం చేయుట.

అతి గొప్పదైన ఈ పనిని ఆరంభించే ముందు గురువైన హిమవానమహర్షి ఒక సూత్రమును సమర్పణుడికి చెప్తూ ఇలా సెలవిచ్చారు. 'కుమారా! ఇచ్ఛయే ప్రపంచము!' సమర్పణ్‌కు ఈ సూత్ర రహస్యము అవగతమైనది. 'కోర్కెల పరిణామమే ఈ ప్రపంచము!' ఇచ్ఛకు అనుగుణముగా ఈ ప్రపంచము నిర్మించబడుతుంది. ఎట్టి కోర్కెయో అట్టి మనస్సు. ఇచ్ఛను అనుసరించే పరిస్థితులు ఏర్పడతాయి. ఆ పిమ్మట దీనినిబట్టే భావి సంఘటనలు చోటుచేసుకుంటూ ఉంటాయి. ఒకవేళ తనకు మెండుగా సంపదలు లభించాలని, సమృద్ధి కలగాలని ఎవరైనా ఒక మనిషి కోరుకుంటే అప్పుడు అతని ప్రయత్నములు, ప్రయాస, పురుషార్థము అన్నీ కూడా ఆ దిశగానే సాగుతాయి. ఈ చిన్న ఇచ్ఛకి అనురూపముగా ఒక పెద్ద ప్రపంచము సృజించబడుతుంది. కానీ ఎక్కడైతే ఇచ్ఛ అన్నది లోపిస్తుందో అక్కడ ప్రపంచపు ఉనికి ఉండదు. ఏ మహత్కార్యము కోసము, మహోన్నత ఉద్దేశ్యము కొరకు తాను మలచబడుతున్నాడో అక్కడ కోర్కెలు విషముతో సమానము. అందువలన అభిలాషల పరిత్యాగమే ప్రపంచమును అధిగమించటానికి రాజమార్గము' అని సమర్పణ్ అర్థం చేసుకున్నాడు.

సమర్పణుడి మనస్సులో రవ్వంతైనా ఇచ్ఛ అనేది లేదు అని మహర్షి గ్రహించాడు. ఈ వాస్తవమును అందరు తెలుసు కున్నారు. ఎందుకంటే సమర్పణ్ 'తనకు ఇది కావాలి' అని అడగటాన్ని ఎవ్వరు చూడలేదు. మహర్షి తన శిష్యులతో ఇలా అంటూండేవాడు. 'శిష్యులారా! సమర్పణ్ ఈ భూలోకము నకు చెందినవాడు కాదు. అతను సుదూర లోకములకు సంబంధించినవాడు. అదెంత దూరంలో ఉంటుందంటే దేవతలు సైతం అక్కడికి చేరుకోలేరు. సమర్పణ్ ఏ లోకం నుండి వచ్చాడో అక్కడ అతను భగవంతునికి ఒకే ఒక్క ప్రతినిధిగా ఉంటాడు. అక్కడ సూర్యచంద్రుల కాంతి యొక్క వెలుగులు ఉండవు. అక్కడ తపోశక్తి చేతనే అన్ని పనులు జరిగి పోతుంటాయి. గాఢమైన తపోబలము కారణముగా ఆ లోకములో ఇచ్ఛామాత్రముగా సంఘటనలు చోటు చేసుకుంటు ఉంటాయి. అందువలన అక్కడ ఎవ్వరికీ వ్యక్తిగత మైన ఇచ్ఛ అనేది ఉండదు. కేవలము భగవత్సంకల్పము మాత్రమే పని చేస్తుంది. ఆ లోకమును మాటలతో వర్ణించుట అసాధ్యము. అంతేకాదు. సమర్పణ్ చేసే పని మరియు అతని ప్రత్యేకతను విశ్లేషించలేము, వివేచన చేయలేము.

మహర్షి, ఆయన శిష్యుడైన సమర్పణుడి యొక్క జీవితము సాత్వికతతో ఓతప్రోతమై ఉంటుంది. అంతేకాకుండా వారి జీవితములో ఎన్నెన్నో చెప్పలేనటువంటి సంఘటనలు జరుగు తుంటాయి. గురు-శిష్యులిద్దరు తమ సమయమును అత్యధికముగా ఏకాంతములోనే గడుపుతుంటారు. ఒకనాడు సమర్పణ్ తన గురువైన మహర్షిహిమవానుడిని ఇలా ప్రశ్నించాడు. 'గురుదేవా! ఈ ప్రపంచము క్షణభంగురము. ఇక్కడ ఇప్పటివరకు ఎవ్వరికీ తమ యొక్క అన్ని కోర్కెలు నెరవేరటము అన్నది జరుగలేదు. ఏ మానవుడు తాను సంపాదించిన ధన-సంపదలను తనతో తీసుకుపోలేదు. ఈ సత్యము తెలిసి కూడా మనుషులు ఎందుకు ఇటువంటి క్షుద్రకామనల పరిపూర్తిలో నిమగ్నులైవుంటారు?'

మహర్షి హిమవానుడు ఇలా జవాబిచ్చాడు. 'సమర్పణ్! స్వయముగా నీకే ఈ ప్రశ్నకు జవాబు తెలుసు. అయినా నువ్వు ప్రశ్నించావు కనుక నేను సమాధానమిచ్చే ప్రయత్నము

**మనస్సును సద్భావనలతో నింపుకోవాలి**

చేస్తాను. మనుషులు కామనల కారణముగా విషయవాసనల పట్ల వైరాగ్యమును పొందలేకపోతున్నారు. ఇంద్రియసుఖ సాధనాలైన కోర్కెలను మనము 'విషయవాంఛలు' అని అంటామని నీకు తెలుసుకదా! 'విష' అన్న శబ్దం నుండి 'విషయ' అను పదము పుట్టినది. విషమును త్రాగితే మనిషి ఒక్కసారిగా మరణిస్తాడు. కానీ విషయాలను గ్రహిస్తూపోతే మనిషి మళ్ళీ మళ్ళీ చనిపోతూ ఉంటాడు. ఇంద్రియముల ద్వారా ఒక కోరిక పూర్తవ్వకుండానే మనిషిలో మరో కోర్కె తలెత్తి అతనిని స్థిమితముగా ఉండనీయకుండా వ్యాకులపరుస్తుంటుంది. ఈ మృగతృష్ణల వెతుకులాటలో మనిషి ఒక్క జీవితము కాదు అనేక జన్మలు వ్యర్థముగా గడిచిపోతాయి.

మహర్షిహిమవానుడు ఇంకా ఇలా అన్నాడు. 'సమర్పణ్! గాఢ వైరాగ్యభావనతోనే ఈ కామనల నుండి ముక్తిపొందుట సాధ్యపడుతుంది. సర్వస్వమును హోమం చేసిన పిదప కూడా ఈ వాంఛలు పూర్తవ్వటమనేది ఉండనే ఉండదు అన్న విషయ అవగాహన చాలా బలంగా కలిగి ఉన్నప్పుడు మాత్రమే మనిషి వీటినుండి బయటపడి భగవంతుని చింతనలో లీనమౌతాడు. అదే ఎడతెరపి లేకుండా వచ్చిపోతూండే ఈ విషయ వాంఛల నుండి బయటపడేందుకు ఏకైక మార్గము, అలాగే జనన-మరణచక్రం నుండి తప్పించుకునేందుకు మనిషికి ఉన్న ఆధారము. గురువుగారి మాటలను శ్రద్ధగా ఆలకించి, వాటితో ఏకీభవించిన సమర్పణుడు వినయముగా గురుచరణములకు ప్రణమిల్లాడు.

*- అఖండజ్యోతి, జనవరి 2017*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## ఈశ్వర చంద్ర విద్యాసాగర్

*మహాపురుషులు పరహితార్థమే జన్మనెత్తుతూ ఉంటారు. వారికి స్వంతానికంటూ ఏ అవసరాలు ఉండవు. 19వ శతాబ్దపు చివరి సమయంలో ఠాకూర్‌దాస్ అనే వయోవృద్ధుడు భార్యాబిడ్డలతో కలకత్తాలో నివసించేవాడు. కుటుంబ సభ్యులు ముగ్గురే అయినా పోషణ సక్రమంగా సాగక ఆర్థిక పరిస్థితులు వారిని మేదినీపురం జిల్లాలోని ఒక చిన్న గ్రామానికి లాక్కొచ్చి పడవేసాయి. అక్కడ ఠాకూర్‌దాస్‌నకు రూ. 2/- నెలసరి వేతనానికి ఉద్యోగం లభించింది. కాలాంతరంలో ఆయన కూడా మరణించటంతో కుటుంబ భారాన్ని భార్య మోస్తూ అనేక సంవత్సరాలు గడిపింది. ఒక రాత్రి కొడుకు తల్లితో "అమ్మా! బాగా చదువుకొని గొప్పవాడినై నిన్ను సుఖపెట్టాలని ఉందని" తన కోర్కెను తెలియజేశాడు. నన్ను ఎలా సేవించి సుఖపెడతావని ప్రశ్నించింది తల్లి. మంచి మంచి పదార్థాలు తినిపించి ఖరీదైన బట్టలు, విలువైన నగలు చేయించి సుఖపెడతానన్నాడు కొడుకు. 'సరే! సంతోషమే! కానీ నేను కోరిన నగలే చేయించాలని అన్నది తల్లి. అవేమిటో తెలియ చెప్పమన్నాడు. కేవలం మూడు ఆభరణాలు చాలునని, వాటిలో మొదటిది ఈ గ్రామంలో అవిద్యను దూరం చేయటానికి ఒక విద్యాలయాన్ని నిర్మించమని, అనారోగ్యాన్ని నిర్మూలించటానికి ఒక వైద్యాలయాన్ని నిర్మించమని, నీ వంటి పేదపిల్లల వసతికి, భోజనానికి కావలసిన సౌకర్యాన్ని కల్పించమని తల్లి కుమారుడిని కోరింది. తినటానికి కడుపు నిండా తిండి కూడా ఏనాడు నోచుకోని కన్నతల్లి తనకోసం ఏమికోరక, కొడుకు వైభవాన్ని సమాజ కళ్యాణానికి ధారపోస్తూ పలికిన ఆ పలుకులు విన్న భావవిభోరుడైన కుమారుడు ఆనాటి నుండి తల్లి కోరిక 3 ఆభరణాలు ఎంత త్వరగా చేయిస్తానా అనే తపనతో కఠోర పరిశ్రమను ప్రారంభించాడు. ఆదర్శం గొప్పది అయినప్పుడు దైవకృపకు లోటుండదు కాబట్టి అనుకున్నట్లే ఆమె కుమారుడు గొప్పవాడై ఉన్నతపదవిని చేపట్టి తల్లి 3 కోర్కెలను తీర్చి మాతృఋణం నుండి ముక్తిని సంపాదించాడు. అంతేగాక స్త్రీ శిక్షణ, మంగళసూత్రం అవసరంలోనున్నవారందరికీ కన్నతల్లి చిహ్నంతో మంగళసూత్రాలను అందజేయటం మొదలైన అనేక గొప్ప కార్యక్రమాలు నిర్వర్తించాడు. ఈ మహానుభావుడు ఎవరోకాదు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**సద్భావనలు సత్కర్మలుగా మారతాయి**

# పర్యావరణ సంతులన చాలా అవసరం

భూమి జీవులందరినీ ధరిస్తుంది. అంటే ప్రాణులన్నిటికీ జన్మనిస్తుంది, భరిస్తుంది, పోషిస్తుంది, చివరికి తనలోనే లయం చేసుకుంటుంది. భూదేవి ఒడిలో జన్మించిన అన్ని జీవరాశులు, వృక్షాలు, వనస్పతులు వాటి వాటి తరహాలో జీవనక్రమాన్ని నడుపుకుంటాయి. వాటికి తగ్గట్టుగానే పర్యావరణాన్ని కూడా సంతులనలో ఉంచుతాయి. జీవులన్నీ ఒకదానికొకటి భిన్నంగా ఉన్నప్పటికీ, పర్యావరణ వ్యవస్థలో ఒకదానితో ఒకటి దగ్గర సంబంధం కలిగి ఉంటాయి. ఒకదానిపై ఒకటి ప్రభావం కూడా చూపుతాయి.

భూమి మీద అన్నీ నిర్ధారించిన సమయానికే జరుగుతాయి. సమయానికే వర్షం వస్తుంది, ఎండ కాస్తుంది, చలి వణికిస్తుంది. అందుకే అన్ని ఋతువులకీ వాటి ప్రాముఖ్యత వాటికి ఉంటుంది. వర్షాకాలం ఆహ్లాదకరంగా ఉంటుంది. వర్షాలు భూమినే కాక, అందరి తనువులను, మనస్సులను తృప్తి పరుస్తాయి. నీరు ఆవిరిగా మారి ఆకాశంలో చేరాక నల్లటి మబ్బులుగా తయారై వర్షించినప్పుడు ఎండిపోయిన భూమి, దాహంతో ఉన్న జీవ జంతువులు అన్నీ నీటిలో తడిసి ఓలలాడ తాయి. ఈవిధంగా వర్షం అన్నింటికీ ప్రాణం పోస్తుంది, భూమిని సశ్యశ్యామలంగా ఉంచుతుంది.

సాధారణంగా దక్షిణ అమెరికాలోని 'పెరు' దేశం యొక్క పశ్చిమంలోని పసిఫిక్ మహాసముద్రంలో నీరు చల్లగా ఉంటుంది. అప్పుడు సముద్రపు వనస్పతులు కూడా ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. వాటిని తినడం వల్ల సముద్రపు రొయ్యల సంఖ్య పెరుగుతుంది. ఈ విధంగా పర్యావరణ వ్యవస్థ నడుస్తూ ఉంటుంది. చేపలను తినే సముద్రపు పక్షులు వికసిస్తాయి. కానీ మనిషి చేపలను బాగా వేటాడతాడు. ఈ చేపలను పెరు వాసులు ఎరువుగా వాడతారు, ఎందుకంటే వాటిలో ఫాస్ఫరస్ శాతం ఎక్కువ.

సమయానికి వర్షాలు రాకపోతే అందరం బాధపడతాం. ప్రత్యేకించి 'ఎల్-నినో' సంవత్సరంలో ఇలా జరుగుతుంది. ఎల్-నీనో సంవత్సరంలో ఈ పూర్తి క్రమం దారి తప్పుతుంది. పెరువాసులకు క్షామం ఏర్పడుతుంది. సముద్రము, వాయు మండలాల మధ్య సంబంధం చాలా చాలా దూరాలకు వ్యాపించి ఉంటుంది. కాబట్టి ఈ ఎల్-నీనో ప్రభావం భారతదేశం మీద కూడా పడి వర్షాలు బాగా తగ్గుతాయి. ఈవిధంగా ప్రకృతి చక్రం కొనసాగుతూనే ఉంటుంది. మొక్కలు, వనస్పతులు, జీవుల వికాశానికి అవసరమైన వనరులు పోగుచేస్తూ ఉంటాయి. వెలుతురులోని శక్తిని పీల్చుకుని పెరిగే సైనో బాక్టీరియా వందల కోట్ల సంవత్సరాల క్రితం భూమి మీద అవతరించాయి, అదే ప్రస్తుతం ఉన్న పర్యావరణ వ్యవస్థ ఏర్పడడానికి ఆధారమైంది అని అనవచ్చు. కాని ఇప్పుడు కనిపించే కామోరాండ్ జాతి కేవలం 20 కోట్ల సంవత్సరాల పూర్వమే జన్మించాయి. ఈ కాలంలో జీవజగత్తులో వైవిధ్యం పుష్పించి పల్లవిస్తూనే ఉంది. వివిధ జీవావాస వ్యవస్థల్లో ఆక్సిజన్ మరియు ఫాస్ఫరస్ వంటి పదార్థాలు, శక్తి చక్రాలు చాలా అధికంగా సమృద్ధి చెందాయి.

ప్రకృతి తాను ఎదిగే ప్రక్రియను తానే ఎన్నుకోవడం వల్లనే పర్యావరణంలో ప్రగతి సాధ్యమవుతుంది. ప్రాకృతిక ఎన్నిక విజయవంతం అవడానికి కారణం సృజనాత్మక సామర్థ్యం. పసిఫిక్ మహాసాగరంతో పాటు మిగిలిన మహా సాగరాలలో ఈ ప్రక్రియ అనేక రూపాల్లో పురోగమించి జీవజాతుల్లో, వనస్పతుల్లో క్రొత్త జాతులు వికసించాయి.

అనంత కాలంలో సముద్రపు లోతులలో హైడ్రోజన్, ఇనుము, సల్ఫర్ వంటి మిశ్రమాల అణువుల శక్తిని గ్రహించే జీవాలు ప్రకటమయ్యాయి. దీనికి స్పష్టమైన ప్రమాణాలు లేవు.

భూమి మీద వనస్పతుల వికాసం జరిగే రోజులలో ఎదురైన పెద్ద సమస్య - అతినీలలోహిత కిరణాలు. అప్పటి వాతావరణంలో ఆక్సిజన్‌శాతం చాలా తక్కువ. ఈ కిరణాలను పీల్చుకునే ఓజోన్ పొర కూడా లేదు. కాని నీరు మాత్రం ఈ అతినీలలోహిత కిరణాలను పీల్చుకునేవి. సముద్రపు లోతుల్లో అతినీలలోహిత కిరణాలు చేరకుండా సాధారణ వెలుతురు చేరేది. ఆ ప్రకాశాన్ని వినియోగించుకునే అవకాశాలున్నాయి. అలాంటి చోట్ల సైనోబాక్టీరియా వికసించడం అనేది ప్రకృతి చమత్కారమనే అనాలి. వాటి అవశేషాల మీద క్లోరోఫిల్‌తో కూడిన బాక్టీరియా పేరుకోవడం మొదలైంది.

**మనం చేసే ప్రతి పనికి మనమే జవాబుదారి**

ఈ క్లోరోఫిల్‌తో కూడిన బాక్టీరియా ద్వారా ఆక్సిజన్ వెలువడడం మొదలైంది. దాంతో నీటిలోను, గాలిలోను ఆక్సిజన్ శాతం పెరిగింది. అప్పుడు అనేక రకాల జీవజాతుల వికాసం సంభవమైంది. అన్ని జీవజాతుల శక్తికి ఆధారం గ్లూకోజ్. ఆక్సిజన్ లేకుండా ఒక్క అణువు గ్లూకోజ్‌తో ఎంత శక్తి విడుదల అవుతుందో, ఆక్సిజన్ ఉపయోగిస్తే అదే గ్లూకోజ్ కణం నుండి పదిహేను రెట్లు ఎక్కువ శక్తి విడుదల అవుతుంది. కానీ శక్తివినియోగానికి ఆక్సిజన్‌ను ఉపయోగించాలి అంటే కొత్త రసాయనిక ప్రక్రియలు అవసరం. ఆక్సిజన్ అందుబాటులోకి వచ్చాక బాక్టీరియా నుండి పెద్ద ఆకారపు ప్రాణులు, అధిక జటిల సంరచన కలిగిన జంతువుల ఉత్పత్తి సునాయాసంగా జరిగింది. ఈ ఏకకణ జీవులు వాటి కొరడా ఆకారంలోని తంతువుల సహాయంతో పోషక పదార్థ కణాలను తమ వైపు లాక్కోగలవు. అంతేకాదు, వీటిలో కొన్ని జంతువులు ఈద గలిగేవి. బాక్టీరియా, వనస్పతులు, ఇతర జంతువులను వేటాడేవి కూడా. వైజ్ఞానికుల ప్రకారం ఇదంతా అరవై కోట్ల సంవత్సరాల పూర్వం జరిగింది. ఆ తరువాత మెల్లిమెల్లిగా బహుకణాల జంతువుల నిర్మాణం జరిగింది. ఈ జంతువులు వాటి భద్రత కోసం శరీరం బయట ముళ్ళతో కప్పేసుకున్నాయి, లోపల ఎముకలను నిర్మించుకున్నాయి, బయట కవచాలు ఏర్పర్చుకున్నాయి. ఈవిధంగా కవచాలతో, అస్థిపంజరాలతో జీవులు ఉత్పన్నం కాసాగాయి. ఆ తరువాత స్పాంజ్‌లు పుట్టాయి. వాటి శరీరాల మీద చిల్లులుంటాయి, శరీరం లోపల డొల్లగా ఉంటుంది. ఇవి ఒకే చోట స్థిరంగా ఉంటూ నీటి ప్రవాహం ద్వారా ఆహార కణాలను పీల్చుకుంటాయి. సముద్రగర్భంలో అధిక సంఖ్యలో ఆహారకణాలు పేరుకున్నాయి. వాటిని గ్రహించడానికి తల, మొండెం, తోక, కండరాలు, మస్తిష్కం ఉన్న శరీరం అవసరమైంది. ఈవిధంగా క్రిముల నుండి రొయ్యలు, తేనెటీగలు, చేపలు, పక్షులు, కోతులు లాంటి జంతువుల నిర్మాణం సంభవమైంది.

ఈవిధంగా పృథ్వీమీద జీవ జంతువుల వికాసం మొదలైంది, అదే శృంఖలలో మనిషి ఏర్పడ్డాడు. వీటన్నిటి సహాయంతో ప్రకృతి సమృద్ధిగా ఎదిగింది. ఇదే పర్యావరణ వ్యవస్థ. ఇందులో జీవ జంతువులన్నీ పరస్పరం సంబంధం కలిగి ఉంటాయి. ఇంతటి పురాతన చరిత్రలో మనిషి ఒక చిన్న భాగం మాత్రమే. తన స్వార్థ ప్రవృత్తి పెరగడం వల్ల ఈ విషయాన్ని మరచిపోతున్నాడు. తనకన్నా ముందు ఉద్భవించిన ప్రాణులే గనక లేకపోతే తన అస్తిత్వమే సంభవం అయ్యేది కాదు. నేడు మనిషి ప్రకృతిలో ఒక భాగంగా మారి ఈ పర్యావరణ వ్యవస్థను సరిచేసే ప్రయత్నం చేయాలి. అప్పుడే అతనికి దక్కిన ఈ గొప్పస్థాయికి న్యాయం చేయగలడు.

*– అఖండజ్యోతి, జనవరి 2017*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

---

## గాయత్రీమాత వరం

*ఈ యుగానికి వ్యాసుడుగా ప్రసిద్ధి పొందిన విద్యారణ్య స్వామి 24 గాయత్రీ పురశ్చరణలు చేశారు. ఆయన స్థాపించిన విజయనగర రాజ్యం పాటలీ పుత్రంతో, హస్తినా పురంతో సాటి అయిన వైభవాన్ని సాధించింది. సన్యాసం తీసుకున్న తరువాత పూర్వజన్మల పాపం నశించిన తర్వాత, ఆయనకు గాయత్రీమాత ప్రత్యక్షమై "నీవు సద్ గ్రంథాలను రచిస్తావు" అని వరం ఇచ్చింది. వేదాలకు, బ్రాహ్మణాలకు, దశ ఉపనిషత్తులకూ ఆయన భాష్యాలు వ్రాశారు. పంచదశీ, సర్వదర్శన సంగ్రహ వంటి అనేక గ్రంథాలను రచించారు.*

## విరజానందుల గాయత్రీ సిద్ధి

*దయానంద మహర్షి గురువు శ్రీ విరజానందజీ ఋషీకేశ్‌లో గంగానదిలో నిలబడి గాయత్రీ సాధన చేశారు. ఆయన ప్రజ్ఞాచక్షువు. అంధుడయినా – ఆధ్యాత్మిక గ్రంథాల లోని రహస్యాలను తెలుసుకున్నారు. ఆయన దయానందునికి శక్తిపాతం చేశారు. ఫలితంగా దయానందునికి గాయత్రీ యొక్క బ్రహ్మవర్చస్సు లభించింది. ఆ బ్రహ్మవర్చస్సుతో స్వామి దయానందులు ధార్మిక, సామాజిక, రాజకీయ విప్లవానికి అనుకూల వాతావరణాన్ని నిర్మాణం చేశారు. గాయత్రీ మహామంత్రం ద్వారా పరమాత్మ యొక్క తేజస్సును ధ్యానం చేయడంవల్ల బుద్ధిలోని మాలిన్యం తొలగి పోతుందని ప్రకటించారు.*

**మంచి కర్మకు ఫలితం సుఖం**

# వయస్సు కాదు ఉత్సాహమే జీవితానికి కొలబద్ద

వయస్సుతో నిమిత్తము లేకుండా కార్యనిర్వహణ చేసేవారు ఈ ప్రపంచములో చాలామంది ఉన్నారు. మన శరీరమునకు కార్యనిర్వణాశక్తికి సంబంధించి ఒక పరిమితి ఉందనేది వాస్తవం. వయస్సు పెరిగేకొద్దీ పనిచేసే శక్తి తగ్గిపోతూ ఉంటుంది. దృఢమైన ఆశయములు కలిగి వయస్సులో ఉల్లాసము, ఉత్సాహము నిండినటువంటి ఏదో ఒకటి చేసి తీరాలనే కోరిక ఉన్నవారిలో సంకల్పశక్తి లేదా ఇచ్ఛాశక్తి దృఢముగా ఉంటుంది. వీరిలో అసంభవమును సంభవము చేసి చూపించగల గొప్ప ఆత్మశక్తి ఉంటుంది. యవ్వనము (యువత) అనేది ఏదో ఒక వయస్సుకో, స్థితికో సంబంధించినది కాదు, అది ఒక శక్తి యొక్క పేరు. తన వయస్సునూ, శక్తినీ జాగృతము చేసుకొన్న వ్యక్తి 80 సంవత్సరముల వయస్సులో కూడా యువకుడే!

సాధారణముగా జనం వయస్సు పెరుగుతున్నకొద్దీ 'మాకు వయస్సు మీదపడుతున్నది, ఈ పనులన్నీ మావల్ల ఏమౌతాయి' అని అంటుంటారు. ఈరకమైన ఆలోచన వారిని బలహీనులను చేసి ఇంక ఏ పనినీ చెయ్యనివ్వదు. సాధారణముగా మనిషి శారీరకముగా చేసే పనికన్నా ఎన్నోరెట్లు ఎక్కువ మానసికముగా చెయ్యగలడు. మరి అటువంటి మానసికశక్తులే బలహీనపడితే వాటిని జాగృతము చెయ్యవలసిన అవసరము ఎంతైనా ఉన్నది.

శక్తులను జాగృతము చెయ్యటమనే అంశముపై చారిత్రక ఉపాఖ్యానాలలో ఒక కథ ఉన్నది. ఒకానొక మహారాజు వద్ద ఎన్నో ఏనుగులు ఉన్నాయి. వాటిలో ఒకటి ఎంతో శక్తిశాలి, ఆజ్ఞాకారీ మరియు తెలివిగలదే గాక యుద్ధ కౌశలములో అధిక నైపుణ్యము కలిగినది. ఆయన దానిని తీసుకువెళ్ళి చేసిన యుద్ధాలన్నింటిలోనూ అది మహారాజుకి విజయమును తెచ్చిపెడుతుండేది. అందుచేత ఆ ఏనుగంటే ఆయనకు ఎంతో ఇష్టము. ఇలా కాలం గడుస్తుండగా దానికీ వయస్సు పైబడి ముసలిదిగా కనిపించసాగింది. ఇదివరకు వలే పనులను నిర్వహించలేకపోవటంతో రాజుగారు దానిని యుద్ధ రంగము లోకి పంపించడము మానివేశారు.

ఒకరోజు సరోవరములో నీరు త్రాగటానికై వెళ్లిన ఆ ఏనుగు అక్కడున్న బురదలో చిక్కుకుపోయింది. కాలును బయటకు తీసే ప్రయత్నము చేసేకొద్దీ అది మరింత లోతుకు కూరుకు పోసాగింది. ఎంతగా ప్రయత్నించినా అది తనకు తానుగా బురదలో నుండి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడటముతో ఘీంకరించసాగింది. దాని ఘీంకారధ్వని విన్న ప్రజలకు ఆ ఏనుగు ఏదో ఆపదలో చిక్కుకున్నట్లు అర్థమైంది. వచ్చి చూసిన ప్రజలంతా ఏనుగు బురదలో కూరుకుపోయిన సమాచారము రాజుగారికి తెలియజేశారు.

రాజుగారితో సహా ప్రజలంతా ఏనుగు ఉన్న ప్రదేశము నకు వెళ్ళి గుమిగూడారు. దానిని బయటకు తియ్యటానికి శారీరకముగా ఎన్నోరకములైన ప్రయత్నములు చేసినప్పటికి ఫలితము లేకపోయింది. చివరకు రాజు అనుభవజ్ఞుడైన ఒక మంత్రిగారిని పిలిపించారు. మంత్రిగారు వచ్చి ఆ ప్రాంత మంతా పరిశీలించిన పిదప సరోవరమునకు నాలుగుదిక్కుల నుండి యుద్ధనగారాలు మ్రోగించవల్సిందిగా సూచించారు. 'ఇంతమంది మనుష్యులు ఇన్నిరకములుగా ప్రయత్నించినా ఫలితము లభించనప్పుడు యుద్ధనగారాలు మ్రోగించడము వల్ల ఏం ఉపయోగముంటుంది?' అని ప్రజలు భావించసాగారు.

అందరికీ ఆశ్చర్యము కలిగించేవిధముగా యుద్ధనగారాలు మ్రోగించడము ప్రారంభించగానే అప్పటివరకూ మృత ప్రాయముగా పడున్న ఏనుగు యొక్క ముఖభావములలో మార్పురాసాగింది. మొదట అది నెమ్మదిగా లేచి నిలదొక్కుకుని నిలబడింది. ఆపైన అందరినీ ఆశ్చర్యచకితులను గావిస్తూ తాను స్వయముగా బురదలో నుండి ఒక్క ఉదుటున శరీరమును బయటకు లాగుకొని గట్టుమీద కొచ్చింది. అప్పుడు మంత్రి 'దానికి శారీరక బలము తగినంతగా ఉన్నప్పటికీ వయస్సు పైబడటము వలన ఉత్సాహము కొరవడింది. యుద్ధనగారాలు వినబడగానే ఉత్సాహము పెల్లుబికి స్వయముగా బయటకు రాగలిగింది' అని వివరించాడు.

మన మనస్సులో ఉత్సాహము, ఉల్లాసము జాగృతమైతే పనిచెయ్యగలిగే శక్తి దానంతట అదే లభిస్తుంది. పని చెయ్యాలనే ఉత్సాహము ఉండటానికీ – మనిషి వయస్సుకూ ఎలాంటి సంబంధమూ లేదు' అన్న విషయము పైన చెప్పబడిన ఏనుగు కథ ద్వారా మనకు అర్థమౌతున్నది.

**చెడు కర్మకు ఫలితం దుఃఖం**

జీవితములో ఉత్సాహమును కాపాడుకోవాలంటే మనిషి నిరాశకు లోనుగాకుండా ఉండటమే కాక; సకారాత్మకమైన ఆలోచనలను వృద్ధిచేసుకోవాలి. అపజయాలు ఎదురవుతున్నప్పుడు 'పూర్వం వలె ఇక మనం పనిచెయ్యలేము' అన్న ఆలోచన అప్పుడప్పుడూ కలగవచ్చు... కానీ అది పూర్తిగా వాస్తవము కాదు. వయస్సు పెరిగేకొద్దీ శారీరిక బలము క్షీణిస్తుంది అన్న మాట నిజమైనప్పటికీ వృద్ధాప్యము సమీపిస్తున్నా కూడా మనకు గౌరవమును చేకూర్చిపెట్టేవీ, ఇతరులకు ఉపయోగపడేవీ అయినటువంటి కొన్ని పనులను మనము చెయ్యవచ్చు. అలా చెయ్యటమువల్ల మనకు జీవితములో సుఖ సంతోషములు కలుగుతాయి. మొక్కలను నాటడము, వాటి పెరుగుదలకు తగిన పోషణనందించటము, ఆర్తులకు-ఆపదలో చిక్కుకున్నవారికి సహాయపడటము, కళాత్మకమైన పనులను చేపట్టడము, పుస్తకములు చదవటము, వ్రాయటములో అభిరుచి ఉంటే కనుక మంచి గ్రంథములు వ్రాయటము మొదలైన అన్ని పనులనూ వయస్సు పైబడినా కూడా చెయ్యవచ్చు.'

'మిమ్మల్ని మీరు ఎంత యువకులుగా భావిస్తారో అంత యౌవనము మీలో ఉంటుంది. మీ లోపల ఎంత ఉత్సాహమును మీరు అనుభూతి చెందగలిగితే ఇక ఎవ్వరూ అపహరించలేనంత యువశక్తిని మీరు పొందగలరు' అని ప్రఖ్యాత విమర్శకుడైన జాన్ ఓడన్‌హ్యూ అభిప్రాయము. బాగా ఆలోచించి విశ్లేషణ చేసి చూస్తే కనుక 'వయస్సు పెరిగేకొద్దీ శక్తి తగ్గినా చిన్న వయస్సు వారికన్నా ఎక్కువ అనుభవం వృద్ధులకే లభిస్తుంది' అన్న విషయము అర్థమౌతుంది.

ఒక వ్యక్తి ఎంత జ్ఞానం ఉన్నా, ఎంత చదువుకున్నా, ఎంత సుశిక్షకుడైనా ఆ జ్ఞానమును గురించిన అనుభవము కలగనంతవరకూ అతడు - అజ్ఞానియే! పెరిగే వయస్సుతో సమానముగా నిరంతరము కార్యమగ్నులమై ఉండటము ద్వారా మనతోపాటు ఇతరులకు కూడా ఉపయోగపడగలవని అనిపించే ఎన్నో అనుభవములు మనకు లభిస్తాయి. పాలలో నుండి వెన్నను తియ్యటానికి ఎంత శ్రమపడవలసి ఉంటుందో అదే రీతిలో అనుభవము పొందటానికి బాగా కష్టపడవలసి ఉంటుంది. అయితే ఆ విధముగా లభించిన అనుభవమును ఉపయోగించుకుని ఎవ్వరైనా సరే లాభాన్వితులు కావచ్చు!

మన దేశములో ఈనాటికీ కొంతమంది వ్యక్తులు ఉన్నారు. వారి వయస్సు పెద్దదైనప్పటికీ దేశమునకు వన్నె తెచ్చే పనులు నేటికీ చెయ్యగలుగుతున్నారు. యుగనిర్మాణ వ్యవస్థాపకులు పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యులవారు 80 సంవత్సరముల వయస్సులో కూడా ఏ యువకుడికీ తీసిపోనంత ఎక్కువ పనిని చేసేవారు. అంతేకాదు వారు తమ జీవితములోని ఆఖరురోజు కూడా వ్రాతపనిని కొనసాగించారు. 'నేను ఏ రోజైతే వ్రాయటము ఆపివేస్తానో అదే నా జీవితములో ఆఖరు రోజు' అని చెప్పేవారట. వారు తమ జీవితములో నియమితత్వమునకు అధిక ప్రాముఖ్యత నిచ్చేవారు. ఉదయము నియమంగా చేసే ఉపాసన పూర్తైన పిదప వారు తప్పనిసరిగా రచనా కార్యక్రమమును సాగించేవారు. దాని ఫలితముగానే వారు సుమారు 3,500 గ్రంథములతో కూడిన సాహిత్యమును సృజించగలిగారు. వారు దాదాపుగా అన్ని ముఖ్య విషయములను, సమస్యలను స్పృశిస్తూ తమ లేఖినిని నడిపారు. అన్నింటికీ ఉచితమైన పరిష్కారములను సూచించారు. నేటికీ వారి సాహిత్యము చదవరులకు స్ఫూరిదాయకముగా ఉంటూ పాఠకుల హృదయములపై లోతైన ప్రభావమును చూపించగలుతున్నది.

రామచరితమానస్‌ను రచించిన గోస్వామితులసీదాస్‌గారు తమ 90 వ సంవత్సరములో రామచరితమానస్‌ను వ్రాయటం ప్రారంభించి జీవితపు ఆఖరు క్షణముల వరకూ రామకథను ఇంటింటికీ అందించారు. కాబట్టి మనస్సులో ఉత్సాహము అనేది ఉంటే వయస్సు మనము చేసే పనికి అవరోధము కాదు. కేవలము స్వార్థపూరితమైన మన ఆలోచనలే అడ్డంకిగా తయారవుతూంటాయి. పని చెయ్యాలనుకుంటే ఏ వయస్సులోనైనా చెయ్యవచ్చు. కాకపోతే పనిచేసే విధానములో మార్పులు చేసుకోవాలి. అప్పుడు పూర్వం కన్నా మెరుగ్గా మంచి నైపుణ్యముతో పనిచెయ్యగలము. పెద్దవయస్సులో కూడా తమ వృత్తిని తాము ఆచరిస్తూ ఇతరులకు శిక్షణ నిచ్చేవారు మన దేశములో ఎంతోమంది ఉన్నారు. తమ అనుభవముతో ఇతరులకు సహాయము చెయ్యగలిగిన వ్యక్తులే తమ కార్యదీక్షా పరిమళముతో దేశమునూ, సంఘమునూ సుగంధపూరితము చెయ్యగలరు, వన్నె చేకూర్చగలరు. జీవితము ఉల్లాసము, ఉత్సాహము, లక్ష్యముతో పరిభాషితమయ్యేది వయస్సుతో మాత్రము కాదు!!

– *అఖండజ్యోతి, జూన్ 2014*

*అనువాదం:* శ్రీమతి కృష్ణకుమారి

**ఇతరులు మనతో ఎలా ప్రవర్తించాలని కోరుకుంటామో మనం ఇతరులతో అలా ప్రవర్తించాలి**

# సమాజ ఋణాన్ని తీర్చుకోవడానికే సేవ

ప్రజాసేవకుడు సేవావ్రతం పట్ల తన నిష్ఠను దృఢంగా, తీవ్రంగా ప్రకటించాలి. అందువల్ల ప్రజలు సేవావ్రతంలోని విలువను గుర్తిస్తారు.

ప్రజాసేవకుడు తన కుటుంబ బాధ్యతలను పెంచుకో కూడదు. ప్రాచీన కాలంలో ప్రజా సేవా వ్రతాన్ని స్వీకరించగోరేవారు బ్రహ్మచర్య ఆశ్రమం నుంచి సరాసరి ప్రజాసేవా రంగంలోకి దూకేవారు. అలా కోరే గృహస్థులు తమ కుటుంబ బాధ్యతల నుండి విముక్తి పొందేవారు. ప్రజాసేవకులు సన్యాసులు కానక్కరలేదు. అయితే వారు తమ కుటుంబ బాధ్యతలను కనీస స్థాయికి తగ్గించుకోవాలి.

నేటి స్థితిలో-యువ ప్రజాసేవకులు తమ సంతానం సంఖ్యను పెంచుకోకూడదు. వారు పిల్లలను కనకపోతే మరీ మంచిది. మమతనూ వాత్సల్యాన్నీ పంచి ఇవ్వడానికి సంతానం అనవసరమని భావించబడుతోంది. ఆ మమతనూ, ఆ వాత్సల్యాన్నీ పంచడానికి సమాజంలో ఎందరో పిల్లలు ఉన్నారు. వివాహం అనవరమని అనుకునేవారు అవివాహితులుగా ఉండిపోవచ్చు. పెళ్ళి చేసుకోవాలని అనుకునేవారు సంతానం అనవసరమని భావించాలి. పిల్లలు కలిగి ఉన్నవారు సంతానాన్ని పెంచకూడదు. కుటుంబ బాధ్యతలు తేలికగా ఉంటే, ప్రజా సేవకు హెచ్చు సమయం మిగులుతుంది.

సేవకు రంగాలు అనేకం ఉన్నాయి. అన్నింటికీ న్యాయం చేయడం సాధ్యం కాదు అని కొందరు భావిస్తారు. సేవా భావం హృదయంలో ఉప్పొంగుతున్నప్పటికీ, సేవ చేసే సామర్థ్యం పూర్తిగా ఉన్నప్పటికీ కొందరు వెనుకంజ వేస్తారు. ప్రపంచంలో ఇన్ని వికృతులు ఉన్నాయి; ఇన్ని విషమ సమస్యలు ఉన్నాయి; మనం ఏమి చేయగలుగుతాము – అని వారు జంకుతారు. సేవా కార్యాన్ని మొదలుపెట్టకముందే వీరు దాని ఫలితాన్ని గురించి ఆలోచిస్తారు. అందరూ ఇలా ఆలోచిస్తే – ప్రపంచంలో సేవా కార్యం అనేది ఎలా జరుగుతుంది? ఫలితం గురించి ఆలోచించ కుండా తన సామర్థ్యానికీ, స్థితికీ అనుగుణమైన సేవాకార్యాన్ని ప్రారంభించడం సేవాభావానికి తొలి గుర్తు.

ఉడుతకు తెలుసు-వారధి నిర్మాణంలో తాను చేసే పని లెక్కించదగినది కాదని. అయినా అది సముద్రంలో మునకవేసి, ఇసుకలో పొర్లి, మళ్ళీ సముద్రంలో మునకవేసింది. నిరంతరంగా వేసింది. ఫలితం దృష్టితో చూస్తే దాని సహకారం అత్యల్పమే. అయినా భగవంతునికి సేవ చేసేవారిలో ఆ ఉడతకు అగ్రస్థానం లభించింది.

వ్యావహారిక దృష్టితో చూచినా-ఒంటరిగా చేసే సేవ నిష్ఫలం కాదు. వానరులకు తమ శక్తి ఎంతో తెలుసు. అయినా వారు లంకా విజయానికి పథకం వేశారు. దాన్ని అమలుచేశారు. త్రిభువన విజేత అయిన రావణాసురునిపై విజయం సాధించారు.

ఇంద్రుని క్రోధానికి గురి అయి వ్రజభూమి నీట మునిగే ప్రమాదం ఎదురయింది. అప్పుడు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తే పథకాన్ని గోపబాలకుల ముందుంచాడు. గోప బాలకులు ఎక్కడ? గోవర్ధన పర్వతాన్ని ఎత్తడం ఎక్కడ? అయినా వారు వెనుకంజ వేయలేదు. ఆ పర్వతాన్ని ఎత్తేవరకూ నిద్రపోలేదు.

సేవా కార్యం వల్ల నష్టం వస్తుందని పైకి కనబడుతుంది. అయితే వాస్తవం అది కాదు. సేద్యం గురించి తెలియని వ్యక్తి రైతు విత్తనాన్ని నాటడం చూచి అతడు దాన్ని వృథా చేస్తున్నాడని భావిస్తాడు. అయితే వాస్తవానికి ఆ విత్తనానికి ఎన్నో రెట్లు పంట పండుతుంది. అలాగే – సేవా సాధన ఫలితం సామాజిక సువ్యవస్థ రూపంలో వ్యక్తిగత ఆత్మసంతృప్తి, ఆత్మానందముల రూపంలో ఉంటుంది. ఈ అనుభూతి ఆంతరికమైనది. మనిషి లోపల కలిగేది. బాహ్య ఫలితాలను మాత్రమే చూచేవారికి సేవా సాధనలో నష్టమే కనిపిస్తుంది.

ప్రజాసేవకుని దృక్పథం దృఢంగా, నిర్మలంగా లేకపోతే, అతడు మధ్యలో వచ్చే ఉపేక్షకూ, కష్టాలకూ క్రుంగిపోతాడు. సేవవల్ల సమాజమంతా ప్రయోజనం పొందుతోందనీ, ఆ సమాజం సహకరించకపోతే తాను ఎందుకు ఆహుతి కావాలనీ అతడు అనుకుంటాడు.

సేవా కార్యాన్ని కర్తవ్యంగా కాక ఉపకారంగా భావించే వ్యక్తి మెదడులోనే ఇలాంటి ఆలోచన కలుగుతుంది. సేవా భావం వల్ల సంతోషం పెరుగుతుంది. ఉపకారం చేస్తున్నాను అనే భావనవల్ల అహంకారం పెరుగుతుంది. అహంకారం పెరిగితే పతనం నిశ్చయం.

కనుక – ప్రజాసేవకుడు సేవా కార్యాన్ని కర్తవ్య నిర్వహణగా, సమాజ ఋణాన్ని తీర్చుకోవడంగా, భగవత్ ప్రేమను పొందడానికి అమూల్య అవకాశంగా పరిగణించాలి. సహచరులు వచ్చి చేరితే తన సాఫల్యంలో పాలుపంచుకోవడానికి వారు వచ్చారని అతడు భావించకూడదు.

ఈ దృక్పథాన్ని అలవరచుకున్నప్పుడే ప్రజాసేవకుడు ఆత్మోద్ధరణనూ, సమాజ ఉద్ధరణనూ సాధించగలుగుతాడు.

★★★

**అవినీతికి పాల్పడకూడదు**

# పద్యం - మన సంస్కృతి నేపథ్యం

మానవుని ఆలోచనాశక్తి, బుద్ధి వికాసములకు శతక పద్యాలు ఎంతగానో తోడ్పడతాయి. మూర్ఖ పద్ధతి, విద్యుత్ పద్ధతి, ధైర్య పద్ధతి, మానశౌర పద్ధతి, మొదలైన శీర్షికలతో పదిమంది విభిన్న వ్యక్తుల మనస్సులకు అద్దం పడుతూ భర్తృహరి నీతిశతకం అందరినీ అలరిస్తూ ఉంటే, అదే స్థాయిలో ఏనుగు లక్ష్మణకవిగారు తెలుగులోకి అనువదించి నాటి నుండి నేటిదాకా ఎందరో వీటిని కంఠస్థం చేసి తమ తమ జీవనయానంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించు కున్నారు. ఇవి కరదీపికలై కర్తవ్య పరాయణులుగా, కార్య దక్షులుగా అందరినీ తీర్చిదిద్దుతాయన్నది అక్షర సత్యం. ఆ భర్తృహరి నీతి శతకంలో కొన్నింటిని తెల్సుకుందాం.

**తెలియని మనుజుని సుఖముగ ॥**
**దెలుపందగు, సుఖతరముగ దెలుపంగవచ్చున్**
**దెలిసిన వానిం, దెలిసియుఁ**
**దెలియనినరుఁదెల్ప బ్రహ్మదేవుని వశమే ॥**

ఏమి తెలియని వానికి కూడా విశేషమైన కృషి చేసి, విషయాలను సులభంగా వివరించవచ్చును. పరిపూర్ణ జ్ఞానం కలిగిన వారికి అత్యంత సులభతరంగా విషయాన్ని తెలుప వచ్చును. కానీ ఏమీ తెలియనప్పటికీ, "అన్నీ తెలుసును" అన్న భావంతో, తెలిసింది కొంతే అయినా మిడి మిడి జ్ఞానంతో సర్వజ్ఞుడననుకునేవానికి, వాడిని సృష్టించిన బ్రహ్మదేవుడు కూడా విషయబోధ చేయలేడు.

విషయపరిజ్ఞానం ఏమాత్రం తెలియని వాల్మీకికి నారద మహర్షి రామకథను సులభంగా బోధించి, రామాయణ కావ్య రచన చేయించగలిగారు. అంటే విద్య లేకపోయినా, గురువుల పట్ల వినయ విధేయతలుంటే, నారదులవంటి మహర్షులకు వాల్మీకి వంటి వారిని తీర్చదిద్దడం సులువైంది.

శ్రీ శుకమహర్షి అష్టాదశ పురాణాలను ఎందరో మునులకు వివరించి, ఆ జ్ఞానామృతాన్ని సులభతరంగా అందరికీ పంచ గలిగారు. ఎందుకంటే ఆ పురాణగాథలను విన్నవారికి పరిపూర్ణ జ్ఞానము, అవగాహన శక్తి ఉన్నాయి కావుననే పురాణ గాథలను శుకమహర్షి సులభతరంగా వివరించారు.

"అన్నీ తెలుసు" అన్న అహంకార ధోరణి బ్రహ్మదేవుని వర ప్రభావం వల్ల కలిగిన గర్వంతో రాక్షసులు తమ గురువైన శుక్రాచార్యుల వారి నుండి జ్ఞానాన్ని పొందలేకపోయారు. "మృత సంజీవినీ" విద్య కూడా దేవకుమారుడైన "కచుడు" పొందాడే తప్ప రాక్షసులు పొందలేకపోయారు.

కాబట్టి విద్యార్థులు స్థాయిని బట్టి బోధన జరుగుతుంది. 'నాకు ఏమి తెలియదు' గురువుల నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. నేను నిత్య విద్యార్థిని" అన్న భావంతో గురువుల పాదాలనే శరణు కోరేవారు విజ్ఞానులుగా, జ్ఞానులుగా పరిఢవిల్లుతారు. కొంతజ్ఞానం తెలిసిన వెంటనే సర్వజ్ఞుడను అనుకునేవారిని మార్చడం ఆ బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదు. "చేని మూర్ఖుల మనసు రంజింపరాదు" అన్న సూక్తి కూడా వర్తిస్తుంది.

మనుష్యులలో నీచులు (అధమాధములు), మధ్యములు (ఏ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ కానీ, పట్టుదల కానీ లేకుండా నిస్తేజంగా ఉంటూ, ఎలాంటి ఆటంకం కలిగితే వెంటనే ఆ ప్రయతాన్ని విరమించేవారు), ఉత్తములు (లక్ష్యాన్ని చేరేవరకు విశ్రమించక నిత్యం కృషి చేసేవారు) అనే మూడు శ్రేణులు ఉన్నాయని ఈ పద్యంలో చెప్పారు ఏనుగు లక్ష్మణకవి.

**ఆరంభింపరు నీచమానవులు, విఘ్నాయాస సంత్రస్తులై**
**యారంభించి పరిత్యజించుతారు, విఘ్నాయత్తులై మధ్యముల్**
**ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై**
**ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్ ॥**

బద్ధకస్తులు, ఏ లక్ష్యం లేకుండా కేవలం నిర్లిప్తతతో జీవితం గడిపేవారు, ఎటువంటి పనిని మొదలుపెట్టరు. ఎందుకంటే వారు రాబోయే ఆటంకాలను, అవరోధాలను ముందుగానే (ప్రయత్నాన్ని ప్రారంభించకుండానే) ఊహించుకుని ఆ భయంతో ఎలాంటి ప్రయత్నము చేయకుండా, వ్యర్థ జీవితాన్ని గడుపుతూ ఉంటారు. అలాంటివారు అటు కుటుంబానికి, ఇటు దేశానికి లేదా సమాజానికి ఉపయోగపడరు. అటువంటి వారిని 'నీచులు' గా పేర్కొంటారు.

కానీ కొందరికి ప్రయత్నం చేయాలన్న తపన ఉంటుంది.

**ప్రవర్తనలో వినయం, వ్యవహారములలో సజ్జనత రావాలి**

ప్రయత్నాన్ని మొదలుపెడతారు కానీ మధ్యలో ఎదురయ్యే సమస్యలను, అవరోధాలను ఎదుర్కొనే శక్తి లేక మధ్యలోనే కార్యాన్ని విరమిస్తారు. సమస్యల పరిష్కారం కొరకు కానీ, నివారణ కొరకు కానీ ప్రయత్నం చెయ్యరు. కార్యాన్ని మధ్యలోనే ఆపి, చేతకానివారుగా మిగిలిపోతారు. వీరిని మధ్యములు అంటారు.

ఎన్ని ప్రమాదాలు ఎదురైనా, ఆటంకాలు అడుగడుగునా అడ్డంకులు ఏర్పర్చినా, మొక్కవోని ధైర్యంతో, చెదరని స్థైర్యంతో చివరి వరకు పోరాడి, ఓర్పుతో విజయాన్ని పొందేవారే ఉత్తములు. వారే భగీరథుడు, సముద్ర మథనం ద్వారా అమృతాన్ని సాధించిన దేవతలు, ఎందరు రాక్షసులెదురైనా, ఎంత మనోవ్యధ కలిగినా చెదరని ధైర్యంతో నిల్చిన శ్రీరాముడు మొదలైనవారు. ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తే ఆ భగవంతుడు కూడా సహకరిస్తాడు అనేది నిత్య సత్యం.

'స్థితప్రజ్ఞత' స్థిరచిత్తం ఉన్న వారు 'ఎటువంటి జీవనాన్ని గడుపుతారు' అన్న అంశాన్ని ఈ పద్యంలో ఇలా వివరిస్తారు లక్ష్మణకవి.

**ఒకచో నేల పవ్వళించు, నొకచో నొప్పారు పూసజ్జపై**
**నొకచో శాపములారగించు, నొకచోనుత్కృష్టి శాల్యోదనం**
**బొకచో బొంత ధరించు, నొక్కక్క తతిన్ యోగ్యాంబర శ్రేణిలే**
**క్కకు రానీయడు కార్యసాధకుఁడు దుఃఖంబున్ సుఖంబున్-మదిన్ ॥**

పట్టుదలతో కార్యాన్ని సాధించాలన్న తపన కల్గినవాడు జీవితంలో తాత్కాలిక సుఖాలకు, భోగాలకు విలువనీయక, కష్టాలకు దుఃఖాలకు బెదరక, తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉంటాడు. కొన్ని సందర్భాలలో నేలపై నిద్రిస్తాడు. మరికొన్ని సందర్భాలలో హంస తూలికాతల్పంపై శయనిస్తాడు. కొన్ని సన్నివేశాలలో కాయగూరలను తింటాడు. మరికొన్ని సందర్భాలలో విందు భోజనాన్ని ఆరగిస్తాడు. కొన్ని వేళల్లో జీర్ణ (చిరిగిన) వస్త్రాలను ధరిస్తాడు. మరికొన్ని వేళలలో పట్టు వస్త్రాలను ధరిస్తాడు. ఎప్పుడు ఎటువంటి స్థితిలో ఉన్న చెదరని విశ్వాసంతో, తామరాకుపై నీటిబొట్టు వలె (చలించని మనస్సు కలవాడై), లక్ష్యసాధనకు యత్నిస్తాడు. పాండవులు అరణ్యంలో ఉన్న, అజ్ఞాతంలో ఉన్నా, రాజప్రసాదాలలో ఉన్న తమస్థితికి చింతించ కుండా, కలత చెందకుండా ధర్మనిష్టతో ప్రజారంజకులయ్యారు.

ప్రతి ఒక్కరూ స్థిత ప్రజ్ఞతతో పొగడ్తలకు పొంగిపోకుండా, విమర్శలకు కృంగిపోకుండా ఉండాలి అన్నది జీవన సత్యం.

– సాధన నరసింహాచార్య

## వ్యవహారంలో ఔచిత్యం ఉండాలి

*ఈ ప్రపంచం చాలా విచిత్రమైంది. విశాలమైంది. దీనిలో సంస్కారవంతులు, సంస్కారంలేని వారూ రెండురకాల మనుష్యులూ ఉంటారు. అందరూ మనం కోరుకున్న విధంగానే ఉండరు. ఆ విధంగా కోరుకోవడం కూడ సరి అయిన పద్ధతి కాదు. ఈ ప్రపంచం మనకోసం మాత్రమే సృష్టించబడలేదు. పరమేశ్వరుడు రకరకాల మనుష్యులను, జీవజంతువులను సృష్టించాడు. ఇది ఒక సామూహిక పాకశాల ఇక్కడ మనకు ఇష్టమైన వంటకాలు మాత్రమే చేయరు. చేసిన వాటినుండి ఇష్టమైన వాటిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా శ్రేష్ఠులైన వారినుండి మనం ప్రేరణ పొందాలి.*

*ప్రతి ఒక్కరి ఎడలా అనవసరంగా ఉదారతను ప్రదర్శించడం అంత మంచిదికాదు. అందువల్ల స్నేహం చేయాలంటే స్థాయిని అనుసరించి స్థిరం చేసుకోవాల్సి ఉంటుంది. సంస్కారహీనులతో వ్యవహారం చాలా కష్టమౌతుంది. వారిది విచిత్ర మనస్తత్వం. అహంకారం పాలు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వివేకాన్ని ఉపయోగించలేరు. సరి అయిన నిర్ణయాలు తీసుకోలేరు. ఇలాంటివారిని కొట్టి, తిట్టి మార్చలేం. శాసనాలు కూడా వారికి అంతగా పనిచేయవు. అలాంటి వారికి సాధ్యమైనంతదూరంగా ఉండాలి. వారి అహంకారాన్ని దూరం చేయాలంటే మానసిక శాస్త్రం తెలిసి ఉండాలి. మానసిక రోగులపట్ల వ్యవహరించిన విధంగా సున్నితంగా ప్రవర్తించాల్సి ఉంటుంది. క్షమాగుణాన్ని అలవరచుకోవాలి. సేవల నుండి విముఖులుకాకుండా చూచుకోవాలి. సహనంతో పాటు సానుభూతిని ప్రదర్శించాలి అనుకోవడం పొరపాటు. అవినీతి పట్ల అవసరానికి అనుగుణంగా కాఠిన్యాన్ని కూడా ప్రదర్శించాలి. సాహసంతో, ఓర్పుతో, నేర్పుతో ముందుకు సాగిపోతూ ఉంటే ఎలాంటి అహంకారి కూడా క్రమక్రమంగా ఆదర్శవ్యక్తిత్వానికి ఆకర్షింపబడతాడు. చిట్టచివరకు మారితీరుతాడు. వ్యవహారంలో ఔచిత్యాన్ని ప్రదర్శించడమే ఆదర్శవాదం అనిపించుకుంటుంది.*


**మనలో ఉన్నతమైన ఆలోచనలు, సాదా జీవనం ఇతరులు చూడగలగాలి**

## పూజ్య గురుదేవుల అమృతవాణి

# మానవ జీవితం యొక్క గౌరవపూర్ణమైన శ్రేష్ఠత్వము-6

***పరమపూజ్య గురుదేవులు తమ యొక్క ప్రత్యేకమైన ప్రవచనం ద్వారా ప్రతి ఒక్క మనిషికీ అతనికి లభించిన అమూల్యమైన సంపదను పరిచయం చేస్తూ 'మనలో ప్రతి ఒక్కరమూ మానవ జీవితరూపంలో ఒక అద్భుతమైన గౌరవాన్నీ, శ్రేష్ఠత్వాన్నీ వెంటబెట్టుకుని వచ్చాము. మానవునికి లభించిన సంపదలూ, సౌభాగ్యమూ మరి ఏ ఇతర ప్రాణికీ లభించలేదు. అటువంటి సురదుర్లభమైన మానవ జీవితమును కేవలం పొట్ట నింపుకోవటానికీ, కుటుంబాన్ని వృద్ధిచేసుకొనటానికీ మాత్రమే ఉపయోగించినట్లయితే అంతకుమించిన దురదృష్టం మరొకటి లేదు' అని తెలియజేస్తున్నారు. పరమపూజ్య గురుదేవులు ఈ విషయమై ఇంకా ఈవిధంగా ప్రవచిస్తున్నారు. 'మనం ఆత్మపరిశీలన చేసుకుంటూ మన ద్వారా ఈనాడు చెయ్యబడిన కర్మల ఫలితాల ప్రభావం రేపు ఏవిధంగా ఉండబోతున్నదీ అనే అంశానికి విలువనిస్తూ జీవించాలి. అప్పుడే మనం భగవంతుడి దర్బారులో తలెత్తుకుని నిలబడగలము. అంతేకాదు. మనకు లభించిన ఈ మానవ జీవితం అనే అదృష్టానికి న్యాయం చెయ్యగలం కూడా!' రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం!***

### మనుష్య జీవితం



మీకు లభించిన ఈ మానవజన్మ అనే అదృష్టమును గురించి కొంచెం దృష్టిసారిస్తే ఇంక మీరు 'నేను ఏ వంశంలో పుట్టాను? నాకు ఇల్లు ఉన్నదా? లేదా? ఎంతవరకూ చదువుకున్నాను? ఎంతమంది పిల్లలు పుట్టారు? జీవితంలో విజయాన్ని సాధించానా? లేదా? వగైరా వగైరా విషయములను గురించి ఏమాత్రం ఆలోచించవలసిన పనిలేదు. ఎందుకంటే మనుష్య జీవితం అనే ఒక గొప్ప అదృష్టం మీకు లభించింది. దాని గురించి గర్వపడండి. మానవజీవితం లభించడమనేది ఎంత గొప్ప అదృష్టమో ఊహించటానికి కూడా సాధ్యం కాదు. జీవితానికి ఎంతటి ప్రాముఖ్యత ఉన్నదో మనకు ఎంత అరుదైన కానుక లభించిందో జీవితం సమాప్తమైనప్పుడు అర్థమౌతుంది. అంత కన్నా మీకు సమయం దొరికినప్పుడల్లా 'యావత్ ప్రపంచంలోని ప్రతి ఒక్క ప్రాణీ దేనికోసమైతే పరితపిస్తుందో ఆ వరం మనకు లభించింది' అన్న విషయమును గుర్తుచేసుకుంటూ ఉండటం మంచిది. మాట్లాడటం, ఆలోచించడం, చదవటం, వ్రాయటం, సంపాదించటం, నియమిత సమయాలలో ఆహారం పానీయాలను స్వీకరించటం, వస్తువులన్నింటినీ చక్కగా ఏర్పాటుచేసుకొనటం, చక్కటి వస్త్రములను ధరించటం, మంచి స్నేహితులను కలిగియుండటం, స్థిరమైన నివాసం... మొదలైనవన్నీ కలిగియుండగలగటం ఒక్క మానవ జీవితానికే సాధ్యం.

వీటన్నింటిని బట్టి చూస్తే మానవులకూ ఇతర ప్రాణులకూ మధ్య భూమికీ–ఆకాశానికీ నడుమ ఉన్నంత తేడా ఉంటుంది. మనకు లభించి నన్ని సుఖసౌకర్యాలు మిగిలిన ప్రాణులకు ఎక్కడున్నాయి? ఏకాంతంలో కూర్చుని ఆలోచిస్తే 'భగవంతుడు తన దగ్గరున్న సమస్త విలువైన వస్తువులన్నింటినీ ఒక్క మానవుడికి మాత్రమే అప్పగించాడు' అని అర్థమవుతుంది.

### భగవంతుని ఖజానాలోని గొప్ప సంపద మానవ జీవితం

భగవంతుడి ఖజానాలో ఉన్న అత్యంత అరుదైన, విలువైన సంపద మానవ జీవితం. అటువంటి మనుష్యజీవితం సాధించినవాడికి భగవంతుని అనుగ్రహం సంపూర్ణంగా లభించినట్లే! ఇంతకుమించి ఏ ప్రాణికైనా ఇవ్వటానికి ఆయన వద్ద విలువైనది మరేదీ లేదు. 'మరణం సంభవించింది, జీవితం మీనుండి చేజారిపోయింది' అని ఒక్కసారి ఊహించు కోండి. అంతమైపోయిన జీవితం మీద దృష్టిసారించండి. అది

**అందరు, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం వలన మంచి సమాజం తయారవుతుంది**

ఎంత విలువైనదో, తిరిగిపొందలేనిదో అర్థమవుతుంది. ఇప్పుడిక మీరు మరొక యోనిలోకి ప్రవేశించవలసి ఉంటుంది. అది కుక్క, గాడిద, కోతి, గుఱ్ఱం... ఏదైనా కావచ్చు.

ఎంత గొప్ప అవకాశమును మీరు వ్యర్థం చేసుకున్నారో అప్పుడు మీరు కొద్దిగా ఆలోచించండి. దీని ప్రాముఖ్యతను అర్థము చేసుకొనటానికిగానీ, దానితోపాటే దీనిని చక్కగా ఉపయోగించుకొనటానికి ప్రయత్నించటంగానీ చెయ్యలేదనే విషయం మీకు అవగతమవుతుంది. కాబట్టి ఇప్పుడే మీరు ఆ ప్రయత్నమును ప్రారంభించండి. జీవితం గురించి ఒక క్రొత్త పద్ధతిలో ఆలోచించటం మొదలుపెట్టండి.

జీవితం ఒక పొడవైన గొలుసు(శృంఖల) అని గుర్తుంచు కోండి. ఎంత పెద్ద గొలుసు అంటే కొన్ని లక్షల జన్మలవరకూ మీరు ఇందులో జీవించవలసి ఉంటుంది. ఇందులో 'మనుష్య జన్మ' పొందగలిగే అవకాశము ఒక్కసారే వస్తుంది. మానవ జీవితమనే రూపంలో లభించిన ఈ అవకాశంలో, దానితో పాటు జోడించబడున్న భావిజీవితంలో ఏర్పడబోయే అవకాశముల గురించి ఆలోచించండి.

## జీవితాన్ని ఏవిధంగా సద్వినియోగం చేసుకొనగలం?

ప్రతి మనిషీ ఈరోజు చేసే పని ఏదైతే ఉన్నదో అది రేపటిని దృష్టిలో పెట్టుకునే చేస్తుంటాడు. ఇవ్వాళ మీరు ఉద్యోగమో, వ్యవసాయమో ఏదో చేస్తుంటారు. అంటే రేపు సుఖంగా గడవటానికి తగిన ధనం సంపాదించుకొనటానికే గదా? ఇల్లు కట్టుకుంటున్నాం. ఎందుకూ? ఏదో సత్రంలోనో, హోటల్‌లోనో ఉంటే ఈరోజు గడచిపోతుందిగా? కానీ అలా అనుకోము. రేపటి పరిస్థితి ఏమిటి? వయసు మీదపడుతుంది. నేను-నా కుటుంబము ఎక్కడుంటాము? కాబట్టి ఇల్లు కట్టుకోవ లసిందే అని ఆలోచిస్తాము.

రేపు ఏర్పడబోయే పరిస్థితులకు అనుగుణంగా ఈరోజే ఏర్పాట్లు చేసుకొనటం తెలివిగల ప్రతి ఒక్క మనిషీ చెయ్యవలసిన పని. మీరు ఒక దీర్ఘమైన జీవితమును జీవిస్తున్నారు. ఈ జీవితంలో రేపు అనేది గౌరవప్రదంగా ఉజ్జ్వలంగా ఉండటానికి గాను ఈరోజు మీరు ఏం చెయ్యాలి? మీరు చేసే ప్రతి ఒక్క పనిలోనూ 'మన భవిష్యత్తు గౌరవప్రదంగా ఏర్పరుచుకొనటం ఎలా?' అన్న అంశం జోడించబడియుండాలి.

మనలో అధికశాతం మంది మనుష్యులు చేసే పొరపాటు ఏమిటంటే – రేపటిని గురించి అస్సలు ఆలోచించరు. కేవలం ఈరోజు గురించి మాత్రమే ఆలోచిస్తారు. ఇవ్వాళ లాభదాయ కంగా ఉన్నదా? లేదా? అని చూస్తారే కానీ దీని పరిణామం రేపు ఎలా ఉండబోతోంది అని ఆలోచించము. కాబట్టి చెయ్య వల్సినదేమంటే రేపటి పరిణామాలను గురించి బాగా దృష్టి సారించాలి. రేపు మన భవిష్యత్తు గౌరవప్రదంగా ఉండేలాగా ఈనాటి మన కార్యక్రమాలను నిర్ణయించుకోవాలి. అందుకోసం ప్రయత్నం చెయ్యాలి. అప్పుడే మనకు అన్ని విధాలా సుఖ ప్రదమైన, శాంతియుతమైన భవిష్యత్తు లభించేందుకుగాను తగిన విధివిధానాలను ఏర్పరచుకొనగలిగిన సామర్థ్యము లభిస్తుంది.

## రాబోయే రేపటిని దృష్టిలో పెట్టుకొని జీవించండి

ఇతర వ్యక్తులను బాగా గమనించండి. త్వరగా లాభం పొందాలనుకునేవారు ఎంతగా ఆత్రుతపడతారో, ఏవిధంగా తమ జీవితాలను నాశనం చేసుకుంటారో చూడండి. నేరస్థులు, త్రాగుబోతులు, సోమరులు, లంచగొండిపరులు, మోసగాండ్రు మొదలైనవాళ్ళందరూ ఆరోజు పొందగలిగే సుఖం మీదనే దృష్టి పెడతారు. రేపటి భవిష్యత్తు గురించి ఏమాత్రం ఆలోచించరు.. ఈ క్షణం ఆనందం చాలు అనుకుంటారు. కాలేయం పాడై పోతుందా, మెదడు దెబ్బతింటుందా... అనేవి వాళ్ళకు పట్టవు. కుటుంబం ఛిన్నాభిన్నమవుతుందే అని దిగులుపడరు. కానీ తమ కుటుంబాన్ని గురించి, పరువు ప్రతిష్ఠల గురించి, ఆనందాన్ని గురించి, కుటుంబ బాధ్యతలు, గృహస్థధర్మాల గురించీ ఆలోచించేవారికి మద్యపానం యొక్క దుష్ఫలితాల మీద అవగాహన ఉంటుంది. కాబట్టి వారు దురలవాట్లకు దూరంగా ఉంటారు. దూరదృష్టి తక్కువగా ఉన్నవారు కేవలం ఈనాటి గురించే ఆలోచిస్తారు. నేరస్థులు, జూదరులు, త్రాగుబోతులు వగైరాలంతా ఈ కోవలోకే వస్తారు.

ప్రస్తుతానికైతే అంతా సుఖంగానే ఉంటుంది. కానీ మీ భవిష్యత్తు ఎలా ఉండబోతున్నదీ ఒకసారి పరికించండి. ఎవరైనా మీకు సహాయం చేసేందుకు ముందుకు వస్తారా? సహాయం కోసం ఎవరినైనా అడుగుదామన్నా పరిస్థితి మీకు అనుకూలంగా ఉండదు. వాడు పెద్ద దొంగ, మోసగాడు, త్రాగుబోతు అంటూ మీ ప్రక్కన కూర్చొనటానికి కూడా ఇతరులు ఇష్టపడరు. అందు

**ప్రతి ఒక్కరు తాము సమాజంలో భాగమని గుర్తుంచుకోవాలి**

చేత ఎంత దగ్గరివాళ్ళైనాసరే ఏదోవిధంగా ముఖం చాటెయ్యటానికే ప్రయత్నిస్తారు.

'ఎందుకు?' అంటే నేరం, నేరపూరిత మనస్తత్వం మనిషి వ్యక్తిత్వాన్ని నాశనం చేసివేస్తుంది. చెడ్డపనులు చేసేవాళ్ళలో మీరు ఉన్నారు అని తెలిసిందంటే ఇంక ఎవ్వరూ మీకు కష్టంలో సహాయం చేసేందుకు ముందుకురారు. ఎవ్వరూ అప్పు కూడా ఇవ్వరు. ఈవిధంగా మీ భవిష్యత్తును మీరు చేజేతులా పాడు చేసుకున్నారు.

రైతులు, విద్యార్థులు, తోటమాలి, కళాకారులు... మొదలైన వారిని గమనించండి. వాళ్ళకు రేపటిని గురించిన ఆలోచన ఉంటుంది. ఆ ఆలోచనతోనే వాళ్ళు ఈరోజు కష్టపడతారు. రైతు విషయానికొస్తే విత్తనాలు నాటి, ఎరువులువేసి, నీరుపెట్టి, చీడపీడలను తొలగించి, పొలానికి కావలికాసి... ఇలా ఎన్నో విధాలుగా కష్టపడతాడు. రేపు తనచేతికి మంచిపంట అందుతుంది. కుటుంబంతో సుఖంగా గడపవచ్చు అన్న ఆశతో ఈరోజు శ్రమపడతాడు. అనుకున్నంత లాభం రాకపోయినా శ్రమపడటానికి సర్వదా సిద్ధంగా ఉంటాడు.

### దూరదృష్టి లేకపోవటం వల్ల ఏర్పడే పరిణామాలు

అసలైన విద్యార్థి ఫీజు కడతాడు. రోజూ నియమంగా బడికి వెళతాడు. రాత్రింబవళ్ళు చదువుతాడు. మరొకరకం పిల్లలు ఉంటారు. ఇంటినుండి తెచ్చిన డబ్బు ఫీజు కట్టరు. పుస్తకాలు కొనరు. నియమంగా పాఠశాలకు వెళ్ళరు. ఊరికే కాలక్షేపం చేస్తూ అటూఇటూ తిరిగి డబ్బును వ్యర్థంగా ఖర్చు పెడుతూ కాలం వెళ్ళబుచ్చుతారు. ఈరోజు వినోదంగా కాలక్షేపం చేసి-రేపు వాడు పొందేదేమిటి? పరీక్షల్లో ఉత్తీర్ణుడు కాడు. మరుసటి సంవత్సరమూ అంతే. ఫలితంగా ఇంట్లో వాళ్ళు అసహ్యించుకుంటారు, తోటిపిల్లలు గేలిచేస్తారు.

దీనికంతటికి కారణం ఏమిటి? ముందుచూపులేకపోవటం, దూరదృష్టి లేదా ముందుచూపు ఉన్న పిల్లలు ఇటువంటి పనిచెయ్యరు. రాత్రింబవళ్ళు కష్టపడి చదివిన ఫలితంగా మంచిమార్కులతో ఉత్తీర్ణుడవుతాడు. మంచి ఉపకార వేతనం లభిస్తుంది. ముమ్ముందు కాలంలో జీవితమంతా సుఖంగా గడిచిపోయే విధంగా మంచి ఉద్యోగం కూడా లభిస్తుంది. దూరదృష్టి లేకపోవటం చేతనే గదా త్రాగుబోతులు, నేరగాంద్రు జీవితాలను వ్యర్థం గావించుకుంటున్నారు. దూరదృష్టి ఉండటం చేతనే శ్రమపడగలిగే వ్యక్తులు విద్వాంసులు, ధనవంతులు, పహిల్వాన్‌లు అవుతున్నారు. వాళ్ళు రేపటి కోసం ఈరోజు తమను తాము నియంత్రించుకున్నారు. ఒక విశిష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకొని తమనుతాము అందులో లగ్నం చేసుకొని పూర్తి బాధ్యతతో లక్ష్యాన్ని చేరుకొనటానికి తమనుతాము మరచిపోయే విధంగా శ్రమపడి సాధించారు.

### భగవంతుడి దర్బారులో గర్వంగా నిలబడండి

అన్నింటికన్నా ముఖ్య విషయమేమిటంటే మీరు భగవంతుని సభలో హాజరుకావల్సియుంటుంది. దీనినుండి మీరు తప్పించుకొనగలిగే మార్గమేదీ లేదు. మీరు జన్మించిన రోజే మీకు భగవంతుడు ఎంతో విలువైన శరీరము నిచ్చాడు. ఆ శరీరమును సద్వినియోగం చేసుకొని ఉజ్జ్వలమైన భవిష్యత్తును ఏర్పాటుచేసుకొని ఈ ప్రపంచంలో గౌరవంగా నిలబడగలరనీ ఇంత మంచి జీవితాన్ని ప్రసాదించిన ఆ భగవంతుడి సేవ చెయ్యగలరనే నమ్మకంతోనే ఈ శరీరమును మీకు ప్రసాదించాడు. మీరు నెమ్మదినెమ్మదిగా మృత్యువును సమీపిస్తున్నారు. ఇక భగవంతుడి ఎదుట హాజరుకావల్సిన సమయమాసన్నమవుతున్నది. మీరు ఏం జవాబు చెప్పాలనుకుంటున్నారో కొంచెం ఆలోచించండి. ఎన్ని మాలలు జపం చేశారు. ఏమేమి తీర్థాలు దర్శించారు. ఏమేమి కర్మకాండలు చేశారు... వంటి ప్రశ్నలను భగవంతుడు అడుగుతాడని మీరు అస్సలు ఆలోచించవద్దు. భగవంతుడు మీకు ఈ జీవితమనే వరాన్నిచ్చాడు. ఆ జీవితం గురించే ప్రశ్నిస్తాడు. ఎంతో విలువైన ఆ జీవితాన్ని ఏయే పనులకు ఎంతెంత సమయాన్ని ఖర్చుచేశావో చెప్పటానికి మీరు సిద్ధంగా ఉండాలి.

### జీవితాన్ని చేజార్చుకొనకండి, ఉపయోగకరంగా తీర్చిదిద్దుకోండి

ధనం సంపాదించటానికీ, కుటుంబ నిర్వహణకూ మాత్రమే జీవితకాలాన్నంతా వెచ్చిస్తామంటే కుదరదు. మీకున్న అవసరాలను తీర్చుకొనటానికి కావల్సిన ధనం రెండుగంటలలో సంపాదించవచ్చు. అలాగే ఆహారాన్ని తయారుచేసుకొనటానికి ఇంట్లోని అందరూ కలసి పనిచేసుకుంటే ఒక గంట సమయం చాలు. కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ స్వావలంబులుగా, సంస్కారవంతులుగా తయారుచెయ్యాలనే ధ్యేయం మీరు

**నీరక్షీర వివేకం వంటి దూరదృష్టిని అలవరచుకోవాలి**

పెట్టుకుంటే చాలు. అప్పుడు కుటుంబ నిర్వహణలో మీకు ఎంతమాత్రమూ క్లేశం కలగదు. ఇంట్లోని వంట, పని పూర్తైన పిదప గృహిణులు సైతం ఏదో ఒక పనిని చేపట్టి అంటే కుటీరపరిశ్రమలు లాంటి తమ కాళ్ళమీద తాము నిలబడగలిగే ధనాన్ని ఆర్జించవచ్చు. మీరు ఒక్కరే కష్టపడి సంపాదిస్తూ కుటుంబసభ్యులందరినీ కూర్చోబెట్టి పోషించటం అలవాటుచేస్తే అది మీకు అధిక భారమవుతుంది.

అలాగే సగటు భారతీయుని వలె పొదుపుగా జీవించటం అలవాటు చేసుకుంటే ఎంతటి కష్టం వచ్చినా తేలికగా దానిని దాటవచ్చు. పెద్దలనుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిపాస్తులు లేకపోయినా ఫరవాలేదు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారంగా చూసినా రోజుకు 8 గంటలు కష్టపడితే వచ్చే ఆదాయం జీవనానికి సరిపోతుంది. 8 గంటల జీవనోపాధి కోసం శ్రమించగా – 7 గంటలు నిద్రకు కేటాయించవచ్చు. స్నానపానాదులకు ఇతర పనులకు 5 గంటలు ఉపయోగించు కుంటే రోజులో మొత్తం 20 గంటలు ఖర్చవుతాయి. మిగతా 4 గంటలు భగవంతుడి సేవలో నియోగించవచ్చు. భగవంతుని దర్బారులోకి వెళ్ళవలసివచ్చినప్పుడు తలెత్తి ధైర్యంగా నేను ఆత్మహితానికీ, కుటుంబాన్ని సంస్కరించటానికీ, సమాజంలో సత్ప్రవృత్తులను పెంపొందించటానికీ రోజుకు 4 గంటలపాటు విలువైన పనులను చేశాను' అని చెప్పగలరు.

కాబట్టి భగవంతుని ఆ స్థానంలో నిలబడటానికి తగిన ప్రయత్నాలను ప్రారంభించండి. దేవుడికి సరైన సమాధానం ఇవ్వగలిగితే మీరు మహామానవుల స్థాయికి వెళ్ళగలరు. ఋషుల యొక్క, దేవాత్మల యొక్క స్థాయి మీకు లభిస్తుంది.

ఇప్పుడు 'మానవీయ గౌరవంతో' లాభాన్వితులైనారు. భవిష్యత్తులో స్వర్గీయ జీవితాన్ని పొందగలిగే అవకాశం లభించవచ్చు. తద్వారా జీవన్ముక్తులు కాగలరు కూడా! ఇదంతా మీరు జీవితాన్ని సరైన పద్ధతిలో జీవించగలిగినప్పుడే సాధ్యపడుతుంది. జీవితాన్ని ఏదో ప్రాముఖ్యత లేనిదిగా, తిరస్కృతమైనదిగా భావించరాదు. భవిష్యత్తును గురించి ఆలోచించండి. ఈనాడు గౌరవంగా బ్రతకటమే కాదు భవిష్యత్తును కూడా ఉజ్జ్వలంగా చేసుకొనగలిగే ఒక నియమమును, విధి విధానమును అనుసరించండి. జీవితం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకొని, సదుపయోగం చేసుకొని, భవిష్యత్తును ఉజ్జ్వలంగా, సుఖవంతంగా, ఆనందమయం గావించుకోండి.

*– అఖండజ్యోతి, మార్చి 2017*

*శ్రీమతి కె. కృష్ణకుమారి*

## జీవిత భాగస్వామిని ఎన్నుకోవటంలో పశుపక్ష్యాదుల బుద్ధి కుశలత

*డా॥ జె.బి.హక్సలే అనే మహాపురుషుడు పశుపక్ష్యాదుల జీవిత విధానాన్ని ఆసక్తిగా అధ్యయనం చేసేవారు. అమటి అనే ఒక విదేశీ పక్షి వసంత ఋతువు ప్రవేశించగానే తన వివాహానికి ఏర్పాట్లు ప్రారంభిస్తుంది. మగపక్షి ఒక ఎత్తైన ప్రదేశంలో కూర్చొని గానం చేస్తూ ఉంటుంది. అది చెట్టు కొమ్మల్ని ప్రోగుచేసి గూడు నిర్మాణానికి ప్రక్కన సిద్ధంగా ఉంచుకొని తనకు సంరక్షించే శక్తి, పోషించే శక్తి ఉన్నదని పాట ద్వారా తెలియజేస్తూ ఆడపక్షిని ఆకర్షిస్తూ ఆహ్వానిస్తుంది. పాట ద్వారా మగపక్షి మనోభావాలను గ్రహించిన ఆడపక్షి దాని చుట్టూ పదే పదే ఎగురుతూ, మగపక్షి యొక్క వాస్తవికస్థితిని పరిశీలిస్తుంది. అబద్ధపు ప్రలోభాలతో తనను మోసగించటం లేదని నిర్ధారణ చేసుకొన్న తరువాతనే ఆడపక్షి మగపక్షిని సమీపించి తన ప్రణయాన్ని ప్రకటిస్తుంది. అపుడు రెండూ కలసి గూడుకట్టుకొంటాయి. గుడ్లను పొదిగే బాధ్యతను కూడా అవి రెండూ కలసి స్వీకరిస్తాయి.*

*ఇటువంటి ఉదాహరణల ద్వారా మానవుడు ప్రేరణలు పొంది జీవితంలో నేర్చుకోవాలి. వివాహానికి పూర్వమే ఈవిధంగా తమ యోగ్యతలను, సామర్థ్యాన్ని నిజాయితీగా పరీక్షించుకోవాలి. యోగ్యతలు లోపిస్తే మాత్రం వివాహమనే దుస్సాహసాన్ని చేయరాదు.*


*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**సజ్జనత్వం, ఉదార స్వభావం మన ప్రతి పనిలో కనిపించాలి**

నావారితో నా మాట

# నవసృజన యువసంకల్ప సమారోహం "యుగ సృజేత"



### నాగపూర్‌లో ముగియనున్న యువక్రాంతి సంవత్సర వేడుకలు - ఒక బృహత్ సమావేశం

విజయవంతంగా కొనసాగిన యువక్రాంతి సంవత్సరాలు (2016, 2017) దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి ఉత్సాహంతో ముగియనున్నాయి. ముమ్మరంగా కొనసాగిన మేథో మథనం వల్ల చాలా పెద్ద సంఖ్యలో యువకులు తోడయ్యారు. దానితో పాటు మొదటి నుండి మన కుటుంబంలోనే ఉన్న యువకుల్లో కొత్త ఉత్సాహం ఉప్పొంగింది. ఎన్నో విజయాలను సాధించారు. 2000 సంవత్సరంలో బైతూల్ లో జరిగిన యువ సమ్మేళనంలో ఈ కార్యక్రమానికి నాంది పలికారు. 2001 నుండి విదేశాల్లో ప్రతి సంవత్సరం షుమారు ఐదు దేశాల్లో జరిగిన యువ సమ్మేళనాలు (యూత్ కాంప్‌లు-రెసిడెన్షియల్) మరియు యూత్ ఎక్స్‌పోలతో ఈ కార్యక్రమం తీవ్రతరమైంది. మహానగరాల్లో యువత యొక్క సక్రియత మరియు గ్రామీణ స్థాయిల్లో కూడా ఉప్పొంగిన యువశక్తి వల్లనే ఇది సాధ్యమైంది. ఇప్పుడు 2017లో ఇది కొత్త రూపం దాల్చి నూతన అధ్యాయం మొదలుపెట్టబోతోంది. దేశంలో అన్ని రకాలుగా కేంద్ర స్థానమైన నాగ్‌పూర్ (క్రాంతికి ప్రతీక అయిన నగరం)లో 26,27,28 జనవరి, 2018లో ఒక విరాట్ నిర్వహణ, 'యుగసృజేత' తో ముగియబోతోంది. కొత్త ఉత్సాహం, ఆందోళనలతో, యువ దృష్టితో (యూత్ విజన్) మరో తొమ్మిది సంవత్సరాల యాత్ర కొనసాగించబోతోంది.

రాబోయే 2050 సంవత్సరం వరకు అదే వర్చస్సుతో కొనసాగే గొప్ప నిధి - మన దేశ యువత. దేశంలో 65 నుండి 70 % జనాభా యువత. వారు తమ సృజనాత్మక ప్రణాళికలతో మనతో కలవడం ఒక పెద్ద విజయమనే చెప్పాలి. మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు, పాశ్చాత్య దేశాలు, యూరోప్, జపాన్‌లు అన్నీ అలిసిపోయిన వృద్ధతరంతో కాలం గడుపుతున్న తరుణంలో ఒక తాజా శ్వాసతో భారతీయ యువశక్తి, భారతమాతకి ఆశ్వాసననిస్తోంది - "అమ్మ! అవినీతి, వ్యసనాలు, ఫాషన్‌ల నుండి విముక్తి పొందిన ఉత్తేజపూరిత శక్తి వాహినితో ఉన్న యువత రాబోయే రెండు దశాబ్దాలలో ప్రపంచానికి దారి చూపించడానికి తయారుగా ఉంది."

మాఘ శుక్ల నవమి నుండి ఏకాదశి, శుక్ర, శని, ఆదివారాలు 26 నుండి 28 జనవరి, 2018న ఒక విరాట్ నవసృజన సంకల్ప సమారోహం, "యుగ సృజేత" పేరుతో జరగబోతోంది. దేశవ్యాప్తంగా, విశ్వవ్యాప్తంగా జరిగిన యువచైతన్య శిబిరాల గురించి ప్రదర్శనలు, విభిన్న కార్యక్రమాలు మొదటి రెండు రోజులలో జరుగుతాయి. చివరిరోజున విశాలమైన రేషిమ్ బాగ్ మైదానంలో (గాయత్రీ శక్తి పీఠం, జగ్నాడే చౌక్ ఎదురుగా) పెద్ద యూత్ ఎక్స్‌పో జరగబోతోంది. మొదటి రెండు రోజులు నాగపూర్ నుండి 8 కి.మీ దూరంలోని ఉమియా మాత మందిరంలో జరుగుతుంది. దేశవిదేశాలలో గత 15 సంవత్సరాలుగా ఎన్నో ప్రత్యేకతమైన విజయాలు సాధించిన వారు ఆహ్వానింపబడతారు. దేశవ్యాప్తంగా జరిగిన యువ సమ్మేళనాల్లో మేము స్వయంగా పాల్గొని స్నేహితులతో కలిసి దేశాన్ని మథించాం, తపించాం. మొదటి రెండు రోజుల్లో తమ విజయాలను ప్రదర్శిస్తారు. 28 జనవరినాడు వాటి సారాంశాన్ని ప్రముఖుల ముందు వివరిస్తారు.

### వీడియో రథాల ద్వారా దేశవ్యాప్త మథనం

2017 సెప్టెంబరు మూడోవారంలో నాలుగు వీడియో రథాలు బయలదేరబోతున్నాయి. 18.09 న వైష్ణో దేవి, కటరా, జమ్మూకాశ్మీర్ నుండి, 15.09 న ద్వారక, గుజరాత్ నుండి, 21.09 న భీమశంకర్ గువాహాటి, అసోమ్ నుండి, 23.09న కన్యాకుమారి, తమిళనాడు నుండి బయలుదేరి నిర్ధారింపబడిన మార్గాలలో దేశమంతటా సంచరిస్తాయి. ఆధునిక విజ్ఞానంతో వీటిని నిర్మించాం. ప్రొజెక్టర్ ద్వారా దేశవ్యాప్తంగా మన యువశక్తి కార్యకలాపాల గురించి పలుచోట్ల ప్రదర్శనలివ్వ

**దుర్బలులపై, చదువురాని వారిపై స్నేహ సహకారములు కురిపించాలి**

బడతాయి. మిషన్ గురించి, యువ జాగరణ గురించి ప్రత్యేకమైన ఐదు వీడియోలు తయారు చేయబడ్డాయి. 12×8 ఎల్.సి.డి స్క్రీన్ మీద ప్రదర్శించబడతాయి. ఐషర్ (ప్రో 1095 ఎ) ట్రక్‌లో స్థాపించబడ్డాయి. సౌండ్ సిస్టమ్, జెనరేటర్ సెట్ (ఎ.సి మరియు డి.సి. విద్యుత్ వ్యవస్థ) ఏర్పర్చబడి ఉంది. రథం ముందు భాగంలో లాల్‌మషాల్, వెనక కలశం, ప్రచారానికి అవసరమైన సాహిత్య సామాగ్రి, బ్రోచర్లు, పాంప్లెట్లు ఉంటాయి. ఐదుగురు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ వాహనంతో పాటు మరో స్థానిక బండి తిరుగుతుంది. దారి మధ్యలో అన్ని ప్రాంతాల్లో ఉప రథాలు కలుస్తూ వస్తాయి. వీటితో దేశమంతటా కొత్త ఉత్సాహం ఉప్పొంగుతోంది.

**1) మొదటి రథం వైష్ణో దేవి (కటరా):** జమ్ముకశ్మీర్ నుండి 18.09న బయలుదేరుతుంది. పశ్చిమోత్తర క్షేత్రం నుండి మొదలై ఇది పూర్తి జమ్ము క్షేత్రం, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్‌లు తిరిగి తరువాత ఉత్తర్ ప్రదేశ్‌లోని బిజనోర్, మేరఠ్, హాపుఢ్, అమరోహా, లలిత్‌పుర్ తరువాత టీకమ్‌గఢ్ నుండి మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. హృదయ ప్రదేశమైన మధ్యప్రదేశ్ కేంద్రం నుండి బైతుల్ మీదుగా 25.01.2018 న నాగపూర్ చేరుకుంటుంది.

**2) రెండో రథం ద్వారికాధామ్ (గుజరాత్):** నుండి మొదలై పాలన్‌పుర్ (గుజరాత్ మొత్తం) ఆబూ రోడ్, రాజస్థాన్ మొత్తం సంచరించి, ధౌల్‌పుర్ నుండి మురైనా, మధ్య ప్రదేశ్‌కి వెల్తుంది. తరువాత బురహాన్‌పుర్ (దక్షిణ మధ్యప్రదేశ్) నుండి భుసావల్‌కి చేరుకుంటుంది. ఉత్తర మహారాష్ట్ర మొత్తం తిరగి 25.01.2018 న నాగపూర్ చేరుకుంటుంది.

**3) మూడో రథం భీమాశంకర్, గువాహాటి (అసోం):** నుండి బయలుదేరే ముందు, అంతకు ముందు అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లో జరిగిన ఉపయాత్రలు, అసోంలోని పలు జిల్లాలలో తిరిగిన ఉపయాత్రలన్నీ కలుస్తాయి. ఈ పాటికే ఈ రథం భీమశంకర్ నుండి గుహాటీకి చేరుకుంది. ఇక్కడ మన చేతనా కేంద్రం కూడా ఉంది. అక్కడ నుండి పశ్చిమ బెంగాల్, అలీపూర్ ద్వారా ప్రవేశించి టాటానగర్ చేరుకుంటుంది. తరువాత 10 డిసెంబరుకి రాయ్ రంగ్‌పూర్ నుండి ఒడిషాలో ప్రవేశిస్తుంది. 25/12కి ఖరియార్ రోడ్ మీదుగా ఛత్తీస్‌గఢ్‌లో సరాయ్‌పల్లిలో ప్రవేశిస్తుంది. ఇక్కడంతా తిరిగి, మరెన్నో ఉపయాత్రలతో కలిస్తూ గోందియా మీదుగా 25 జనవరికి నాగపూర్ చేరుకుం టుంది.

**4) నాలుగవ యాత్ర కన్యాకుమారి, తమిళనాడు:** నుండి 23.09న మొదలైంది. మొత్తం తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా అంతా తిరిగి 5 నవంబరుకల్లా ఇచ్ఛాపురం (ఆంధ్రప్రదేశ్‌కు) చేరుకోవాలి. తరువాత జగన్నాథపురి, ఒడిషా చేరుకుని మిగిలిపోయిన ప్రదేశాలన్నిటినీ చూసుకుని మల్కాన్‌గిరి నుండి ఛత్తీస్‌గడ్‌లో సుకుమా ప్రాంతానికి డిసెంబరు 5 కల్లా చేరాలి. 30 డిసెంబర్ వరకు ఆ ప్రాంతాన్ని మొత్తం మథించాలి. తరువాత సాకోరీ నుండి మహారాష్ట్రలోకి ప్రవేశించి 25 జనవరికి నాగపూర్ చేరుకోవాలి.

ఈ విధంగా నాలుగురథాలు దేశమంతటా తిరిగి యువ క్రాంతి సందేశాన్ని అందించి 25 జనవరికి నాగపూర్ చేరుకుంటాయి. ఈ యాత్రలో అన్ని మహానగరాలు, ఉపమహా నగరాలు, దారిలో వచ్చే ప్రముఖ ప్రదేశాలన్నీ తాకుతూ లక్ష్యాన్ని చేరుకుంటాయి. దేశంలోని కణకణము జాగృతమవ్వాలని గురువుగారు కన్న కల ఈ యాత్రతో సిద్ధిస్తుందని నమ్మకం. 2018 గణతంత్ర దినోత్సవం ముందు రోజు యాత్ర పూర్తి కావడం విశేషం.

## కార్యక్రమ స్వరూపం

మొదటి రెండు రోజులలో (ఆహ్వానం అందుకున్న వారు మాత్రమే) ఐదు నుండి ఆరు వేల మంది యువ కార్యకర్తలు హాజరవుతారు. గత 17 సంవత్సరాలలో లేదా ఈ రెండు సంవత్సరాలలో మిషన్ కోసం ప్రత్యేకంగా కృషి చేసినవారికి ఆహ్వానం పంపబడుతుంది. భవ్యంగా లేకపోయినా నవ్యంగా చేయడానికి ప్రాముఖ్యతనివ్వాలి. కార్యక్రమం ముఖ్య విషయాలు – స్వచ్ఛత సంవర్ధన, నదుల పరిశుభ్రత మరియు పునర్జాగరణ, నీటి సేద్యం, కాలుష్య నివారణ, వ్యసనముక్తి, గ్రామోద్ధరణ – కొత్త ఆదర్శ గ్రామాల నిర్మాణం, నారీ సాధికారత, బాలసంస్కార శాలల స్థాపన, వృక్షారోపణ, హరిత భూముల విస్తరణ, పర్వతీయ మరియు ఆటవిక ప్రాంతాల సాధికారత, స్వావలంబన, ఆలోచన క్రాంతి మొదలైనవి. రాబోయే మూడు నెలల్లో దీని గురించి విస్తారంగా చదువుతారు. చివరి రోజు కార్యక్రమంలో

**తన పట్ల తాను కఠోరంగా ఉంటూ ఇతరుల పట్ల ఉదారంగా ఉండాలి**

25 వేల మంది హాజరు కాగలరు. అప్పుడు ఉమియా మాత ఆలయం నుండి రేషిమ్ బాగ్ పరిసరాలకు వేదిక మార్చబడు తుంది. ఆ రోజున గౌరవనీయులైన దేశప్రతినిధులు (ప్రధాన మంత్రి లేదా రాష్ట్రపతి) మనల్ని ఉద్దేశించి ప్రసంగించగలరని ఆశిస్తున్నాం. వారి ముందు మన యువక్రాంతి సంవత్సరం యూత్ విజన్ డాక్యుమెంట్ ప్రదర్శించబడుతుంది. అది జనవరి 2018 తరువాత అమలవుతుంది.

అతిథులు సాదా భారతీయ పరంపరకు అనురూపంగా దుస్తులు ధరించాలి. సోదరులంతా పసుపు రంగు కుర్తా, పైజామా లేదా తెల్ల పైజామా, పసుపు కుర్తా లేదా పసుపు టీ-షర్టు వేసుకుంటారు. ప్రత్యేకంగా తయారు చేయబడ్డ స్కార్ఫులు అందరూ ధరించాలి. శిబిరానికి వచ్చినవారంతా ఉండడానికి 25 రాత్రి నుండి 28 పొద్దున వరకు ఉమియా మాత ధామంలో ఏర్పాటు చేయబడుతుంది. (పరిమిత పరిజను లకు మాత్రమే) ఎక్కువ మంది పాల్గొనేవారు 28 ఉదయం నాగపూర్‌కి చేరి ముఖ్య కార్యక్రమానికి మాత్రమే హాజరవుతారు. 15 నుండి 45 సంవత్సరాలలోపు వారు మాత్రమే పాల్గొంటారు. సోదర సోదరీమణులందరూ సాదాదుస్తులతో మర్యాద పూర్వ కంగా వ్యవహరించగలరు. మొత్తం 400 జిల్లాల నుండి ప్రతి నిధులు పాల్గొంటారు. ప్రతి జిల్లా నుండి పది మంది యువత, వారికి తోడుగా అనుభవజ్ఞులైన ఒక శ్రేయోభిలాషి పాల్గొంటారు. నమోదు పత్రాల కోసం ప్రజ్ఞా అభియాన్ పాక్షిక మరియు అఖండజ్యోతి నవంబరు, డిసెంబరు పత్రికలను పరిశీలించ గలరు. అందరికీ ఈ మెయిల్ లేదా ఫోన్లకు మెసేజ్ ద్వారా ప్రవేశపత్రాలు పంపబడతాయి. పాల్గొనడానికి పేర్లు నమోదుకు 10 నవంబరు నుంచి 15 డిసెంబరు వరకు అని గమనించ గలరు.

### కార్యక్రమ విస్తృత రూపం

రాష్ట్రాల వారీగా 14 ప్రదర్శనలు ఇవ్వబడతాయి. ప్రవచనాలు తక్కువ, మేథోమథనం మరియు ప్రదర్శనాలు ఎక్కువ ఉంటాయి. ఆయా కేంద్ర ప్రతినిధులు ప్రదర్శనకు ముందు భూమిక, తరువాత సమీక్షను ప్రెసెంట్ చేస్తారు. యువక్రాంతి కోసం జరిగిన కార్యక్రమాలే ప్రధానంగా ప్రదర్శిం చబడతాయి. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, జార్కండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిషా, గుజరాత్, రాజస్థాన్, బెంగాల్ మరియు ఈశాన్య రాష్ట్రాల సముదాయం, వాయువ్య రాష్ట్రాలు (జమ్ము కశ్మీర్, పంజాబ్ మొదలైనవి), హిమాచల్, ఉత్తరాఖండ్ మరియు దక్షిణ రాష్ట్రాలు (5 దక్షిణ రాష్ట్రాలు కలిపి) - 14 ప్రాంతాల సమూహాలు.

గణతంత్ర దినోత్సవం నాడు జండా వందనం జరుగు తుంది. మనం చేసే కార్యక్రమాలన్నింటికీ విడివిడిగా జండాలు చేయించి ఉంచబడతాయి. ఎల్.ఇ.డి టి.వి స్క్రీన్లు మరియు ఎల్.సి.డి వాల్ ఏర్పాటు చేయబడతాయి. జ్ఞాపిక (సావనీర్)ను రూపొందించే ప్రక్రియ మొదలైపోయింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన సామగ్రి అందరూ విధిగా శాంతికుంజ్‌కి పంపగలరు (ప్రాంతాల వారీగా, విషయాల వారీగా పి.పి.టి. లు). 108 మంది ప్రవాస యువకులకు తిలకధారణ చేసి సాగనంపుతారు. 2026 యూత్ విజన్ అనే డాక్యుమెంట్ ప్రకటించబడుతుంది. అందులో రాబోయే 9 సంవత్సరాల వరకు కార్యప్రణాళిక గురించిన వివరణ ఉంటుంది. "యువ క్రాంతి నవసృజన" అనే సంకల్పంతో ముగిస్తారు.

*- అఖండజ్యోతి, అక్టోబర్ 2017*

*అనువాదం: ఎం.వి.ప్రసాద్*


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి!
చదివించండి!!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


ఎల్లప్పుడు ప్రేమపూర్వకంగా ప్రవర్తించాలి

## ఆరోగ్య సూత్రాలు-3

# డెంగీ జ్వరం

దోమ కాటు ద్వారా డెంగీ వైరస్ మన శరీరంలోకి ప్రవేశించిన 4–6 రోజుల్లో లక్షణాలు ఆరంభమవుతాయి.

• హఠాత్తుగా తీవ్రజ్వరం • తీవ్రమైన తలనొప్పి • కళ్ళ వెనుక నుంచి నొప్పి • ఒళ్ళు–కీళ్ళ నొప్పులు • వాంతి వికారం • ఆకలి లేకపోవటం

...ఇవి ఆరంభ లక్షణాలు... ఈ జ్వరం రెండు మూడు రోజుల్లో తగ్గుతుంది. కానీ ఆ తగ్గుతున్న దశలోనే మరింత జాగ్రత్తగా ఉండాలి.

### ఈ దోమ చాలా స్పెషల్

ఈ దోమలు పగలే కుడతాయి. కుట్టినప్పుడు నొప్పి తెలీదు. మంచి నీటిలోనే ఎక్కువగా పెరుగుతాయి. ఇవి 100 మీటర్లు దాటి ప్రయాణం చెయ్యలేవు. సాధారణంగా శరీరంలో కాళ్ళు, పాదాల వంటి కింది భాగాల్లోనే ఎక్కువగా కుడతాయి. ఇలా డెంగీని మోసుకొచ్చే 'ఈడిస్ ఈజిప్టై' రకం దోమ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. చూడటానికి కూడా ఇది కాస్త పెద్దగా, నల్లటి చారలతో విభిన్నంగా కనబడుతుంది. అందుకే దీన్ని 'టైగర్ దోమ' అని అంటారు. వీటిని గుర్తుపట్టటం తేలికే. కాబట్టి ఈ దోమలకున్న ప్రత్యేకతలను ఆధారంగా చేసుకుని మనం వీటి బారినపడకుండా చాలా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది.

### తప్పించుకునేదిలా?

❖ టైగర్ దోమ మనం మెలకువగా ఉండే సమయంలోనే, పట్టపగలే కుడుతుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా కుడుతుంది. కాబట్టి ఇంట్లోనే కాదు. స్కూళ్ళల్లో, ఆఫీసుల్లో, బస్సుల్లో, ఆఫీసుల్లో, షాపుల్లో, బ్యాంకుల్లో... ఇలా మనం బయటకు వెళ్ళే అన్ని చోట్లా జాగ్రత్తగా ఉండాలి.

❖ టైగర్ దోమలు ఎక్కువ దూరం ప్రయాణించలేవు. కాబట్టి మన ఇళ్ళు, ఆఫీసులు, స్కూళ్ళ పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఎక్కడా నీరు చేరకుండా చూడాలి. ఇది కూడా కష్టసాధ్యమైనదేం కాదు. ఇటీవలి కాలంలో ప్లాస్టిక్ గ్లాసుల వాడకం బాగా పెరిగింది. వాడిన తర్వాత వీటిని ఎక్కడ బడితే అక్కడ పారేస్తుంటారు. వీటిలో నీరు చేరి, దోమలకు ఆలవాలంగా తయారవుతుంది. కాబట్టి మన చుట్టుప్రక్కల వాడి పారేసిన ప్లాస్టిక్ గ్లాసులు, నీళ్ళ సీసాలు, పాత టైర్లు, టెంకాయ చిప్పలు, ఖాళీ కుండీల వంటివేమీ లేకుండా చూస్తే చాలు.

❖ మన పిల్లలు వెళుతున్న స్కూలు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడటం చాలా ముఖ్యం. అవసరమైతే క్లాసు రూముల్లో ముందుగానే మ్యాట్స్, కాయిల్స్ వంటివి పెట్టాలి. స్కూలుకు పంపేటప్పుడు పిల్లలకు పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు, సాక్సులు వెయ్యటం మంచిది. ఇది కుదరకపోతే దోమలు కుట్టకుండా కాళ్ళు చేతులకు దోమల క్రిములు రాసి పంపాలి. క్లాసుల్లో కూడా – బల్లల క్రింద నుంచి, డెస్కుల నుంచి, టేబుల్ సొరుగుల నుంచి, కర్టెన్ల వెనక నుంచి ఈ దోమలు రేగి కుడుతుంటాయి. అందుకే వీటిని తరచూ శుభ్రం చెయ్యాలి.

### జ్వరంలో కాదు, తగ్గేప్పుడు జాగ్రత్త

డెంగీ వస్తే, జ్వరం చాలా తీవ్రంగా 105 వరకూ కూడా రావచ్చు. తలనొప్పి, ఒళ్ళు నొప్పులు చాలా ఎక్కువగా ఉండవచ్చు. అయినా డెంగీలో ఇదేమంత ప్రమాదకర దశ కాదు. ఆ మంటల జ్వరం రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. ఈ తగ్గిపోయే దశ చాలా కీలకం. ఒంటి మీద ఎర్ర మచ్చలు రావటం, ప్లేట్‌లెట్లు పడిపోవటం, బీపి తగ్గటం వంటివన్నీ ఆరంభమయ్యేది ఇప్పుడే. డెంగీలో ఇది ప్రమాదకరమైన దశ. కాబట్టి డెంగీలో జ్వరం ఉన్నప్పుడే కాదు. జ్వరం తగ్గుతున్నప్పుడే మరింత శ్రద్ధగా, అప్రమత్తంగా ఉండాలి. ఈ సమయంలో వైద్యుల సలహా పాటించటం, ఆసుపత్రుల్లో ఉండాలని సూచిస్తే ఉండటం ఉత్తమం. జ్వరం తగ్గాక ఒంటి మీద మచ్చలు వస్తున్నా, తీవ్ర నిస్సత్తువగా ఉన్నా, కాళ్ళుచేతులు చల్లగా ఉంటున్నా, కడుపులో నొప్పి వస్తున్నా, వాంతులు ఎక్కువ

**గురుదేవుల ఆదర్శములను అమలుపరచడం శిష్యుని కర్తవ్యం**

అవుతున్నా... చిగుళ్ళ నుంచి రక్తం వస్తున్నా... పడుకుని లేవ గానే కళ్ళు తిరుగుతున్నా వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువెళ్ళాలి.

### ప్లేట్‌లెట్ల కంటే 'ప్లాస్మా' ముఖ్యం!

మన సమాజంలో చాలామంది డెంగీ జ్వరం అనగానే... ప్లేట్‌లెట్లు పడిపోతాయని భయపడుతుంటారు. కానీ నిజానికి దీనికంటే కూడా ప్రమాదకరమైనది – రక్తనాళాల్లో నుంచి ప్లాస్మా లీక్ అవుతుండటం! మన రక్తంలో ఎర్రకణాలు, తెల్లకణాలు, ప్లేట్‌లెట్ల వంటివన్నీ కలిసి 45 శాతమే ఉంటాయి. మిగిలిన 55 శాతం ద్రవ పదార్థం ప్లాస్మానే. డెంగీ జ్వరం వచ్చినప్పుడు రక్తనాళాల్లో నుంచి ఈ ప్లాస్మా బయటకు అంటే కడుపు, ఊపిరితిత్తులు, కణజాలాల్లోకి లీక్ అయిపోతుంటుంది. దీంతో రక్తం చిక్కబడి, రక్తం పరిమాణం తగ్గి, బీపి పడిపోతుంది. ఈ స్థితిలో శరీర భాగాలకు తగినంత రక్తం, ఆక్సిజన్ అందవు, దీంతో అన్ని అవయవాలు దెబ్బతిని రోగి షాక్‌లోకి వెళ్ళే ప్రమాదం ముంచుకొస్తుంది. డెంగీ జ్వరంతో ఎక్కువగా రోగులు చనిపోయేది ఈ స్థితిలోనే. కాబట్టి మనం కేవలం ప్లేట్‌లెట్లనే పట్టించుకోవటం కాదు. వీరికి 'హెమటోక్రిట్' పరీక్ష చేసి రక్తం చిక్కబడుతోందా? బీపి తగ్గిపోతోందా? అన్నది తరచూ చూస్తుండటం చాలా అవసరం.

### 20 వేల వరకూ తగ్గినా...

డెంగీ జ్వరం వచ్చినప్పుడు రక్తంలో ప్లేట్‌లెట్ కణాలు కొంత తగ్గటం సహజం. అయితే ఈ కొద్దిపాటి తగ్గుదలనే ప్రమాదసంకేతంగా భావిస్తూ బయటి నుంచి ప్లేట్‌లెట్లు, రక్తం వంటివి ఎక్కించెయాల్సిన పనిలేదు. వాస్తవానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం డెంగీ బాధితులకు ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం చాలా అరుదుగానే ఎదురవుతుంది. దీన్ని కాస్త వివరంగా చూద్దాం. సాధారణ ఆరోగ్యవంతుల్లో ప్లేట్‌లెట్లు 1.5 నుంచి 4 లక్షల వరకూ ఉంటాయి. వీటి సంఖ్య 1 లక్ష కంటే తక్కువకు పడిపోతుంటే అప్రమత్తం కావాలి. ఈ స్థితిలో వైద్యుల పర్యవేక్షణ అవసరం. ప్లేట్‌లెట్ల సంఖ్య 20 వేలకు పడిపోతే చాలా జాగ్రత్త అవసరం. ఇది 10వేల కంటే కూడా తగ్గితే రక్తస్రావం అయిపోవచ్చు. పళ్ళ చిగుళ్ళ నుంచి, ముక్కు నుంచి, మలమూత్రాల ద్వారా లేదా వాంతిలో కూడా రక్తం రావచ్చు. అందుకే ప్లేట్‌లెట్లు ఎప్పుడు ఎక్కించాలన్న దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ప్లేట్‌లెట్ల సంఖ్య 20 వేల కన్నా తక్కువగా ఉండి ఒంట్లో రక్తస్రావం లక్షణాలు కనబడుతుంటే వెంటనే ప్లేట్‌లెట్లు ఎక్కించాలి. లేదు ఎలాంటి రక్తస్రావం లక్షణాలు లేకున్నా కూడా వీటి సంఖ్య 10వేల కంటే తక్కువకు పడిపోతుంటే ప్లేట్‌లెట్లు ఎక్కించాలి. కాబట్టి లక్ష కంటే తగ్గగానే ప్లేట్‌లెట్లు తగ్గుతున్నాయంటూ ఆందోళనతో వైద్యులపై ఒత్తిళ్ళు పెంచాల్సిన పనిలేదని గుర్తించాలి.

### మొదటిసారి ఏ సమస్యా ఉండదు!

ఎవరికైనా గానీ, డెంగీ జ్వరం మొదటిసారి వచ్చినప్పుడు అదే తగ్గిపోతుంది, సమస్యలు రావటం అరుదు. డెంగీ వైరస్‌లో నాలుగు రకాల ఉపజాతులున్నాయి. వీటిలో ఒక జాతితో జ్వరం వస్తే జీవితాంతం ఇక ఆ రకం ఉపజాతితో మళ్ళీ జ్వరం రాదు. మన శరీరం అందుకు తగిన నిరోధక శక్తిని పెంచుకుంటుంది. కానీ మొదటిసారి ఒక ఉపజాతితో వచ్చి తగ్గిపోయి, రెండోసారి మరో రకం ఉపజాతితో జ్వరం వచ్చినప్పుడే – తీవ్ర పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. వీటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది – రక్తస్రావమై పోయే 'డెంగీ హెమరేజిక్ ఫీవర్'. అయితే ఇది అందరిలో వచ్చే సమస్య కాదు. డెంగీ బారిన పడిన చాలా కొద్దిమంది మాత్రమే ఈ పరిస్థితిలోకి వెళతారు. కాబట్టి డెంగీ అనగానే వణికిపోవాల్సిన పనిలేదు, వెంటనే ఆసుపత్రిలో చేరాల్సిన పనిలేదు. కాకపోతే డెంగీ జ్వరమని అనుమానం వచ్చినప్పుడు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి. వైద్యులు డెంగీ అని నిర్ధారించినప్పుడు తరచుగా రక్తం చిక్కదనం తెలుసుకునేందుకు 'హెమటోక్రిట్' పరీక్ష చేసి చూస్తుంటారు, అది ముఖ్యం. ఒకవేళ ఈ పరీక్షలో చిక్కదనం పెరుగుతున్నట్టు తేలితే సత్వరమే సెలైన్ పెట్టటం వంటి వైద్యుల సంరక్షణ అవసరం. అలాగే ప్లేట్‌లెట్ కణాలు గణనీయంగా తగ్గిపోతుంటే అప్పుడు వాటిని ఎక్కించాల్సి ఉంటుంది. ఇటువంటి తక్షణ చర్యలతో ప్రాణ ప్రమాదం తగ్గిపోతుంది. కాబట్టి జ్వరం వచ్చినప్పుడు అది డెంగీనా? కాదా? అన్నది నిర్ధారణ చేయించుకోవటం, డెంగీ అయితే జ్వరం తగ్గే దశలో అప్రమత్తంగా ఉండటం ముఖ్యం. డెంగీలో తీవ్ర సమస్యలన్నీ కూడా సాధారణంగా జ్వరం తగ్గిపోతున్న దశలో, ఒకట్రెండు రోజులు మాత్రమే ఉంటాయి.

**తన సుఖసౌఖ్యాలకు తిలాంజలలు ఇచ్చినవాడే ఇతరులకు సుఖం అందించగలడు**

ఆ రెండు రోజులూ వైద్యుల సంరక్షణలో జాగ్రత్తగా ఉంటే చాలు, తర్వాత ఏ సమస్యా ఉండదు.

## నొప్పులు తగ్గించే మందులు వాడొద్దు!

సాధారణంగా తీవ్రమైన ఒళ్ళు నొప్పుల్లాంటి బాధలు తగ్గేందుకు ఐబూప్రోఫెన్ వంటి మందులు వాడుతుంటారు. కానీ డెంగీ జ్వరంలో వీటిని వాడకూడదు. కాబట్టి ఈ సీజన్లో జ్వరం వస్తే – జ్వర తీవ్రత తగ్గేందుకు ఒక్క 'ప్యారాసెటమాల్' తప్పించి మరే మందులూ వాడొద్దు. ముఖ్యంగా ఆస్పిరిన్, ఐబూప్రోఫెన్, నిముసులైడ్, డైక్లోఫెనాస్ వంటి నొప్పులు తగ్గించే బిళ్ళలు అసలుకే వద్దు. కండరాల్లోకి ఇంజక్షన్లు, స్టెరాయిడ్ల వంటివి తీసుకోకూడదు. యాంటీబయాటిక్, యాంటీవైరస్ మందులతో ఎలాంటి ఉపయోగం ఉండదు.

## వైద్యులపై ఒత్తిడి తేవొద్దు

ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గగానే చాలా మంది కంగారు పడిపోతుంటారు. వెంటనే ప్లేట్‌లెట్లు లేదా రక్తం ఎక్కించాలని వైద్యులపై ఒత్తిడి తెస్తుంటారు. ఇది సమంజసం కాదు. ప్లేట్‌లెట్లు, రక్తం ఎప్పుడు ఎక్కించాలనేది డాక్టర్ నిర్ణయానికే వదిలేయటం మంచిది.

## ప్రమాద సంకేతాలు కీలకం

సాధారణంగా ప్లాస్మా లీకేజీ ఎక్కువై అంటే ప్యాక్డ్ సెల్ వాల్యూమ్ ఉండాల్సిన దానికంటే 20% పెరిగినా, రక్తస్రావం ఎక్కువ అవుతున్నా, ఏదైనా అవయవం దెబ్బతిన్నా... దాన్ని 'సివియర్ డెంగీ' అంటున్నారు. (దీన్నే గతంలో డెంగీ హెమరేజిక్ ఫీవర్, షాక్ సిండ్రోమ్ అనేవాళ్ళు). ఇది డెంగీలో చాలా తీవ్రమైన స్థితి. జ్వరం వచ్చిన 3,4 రోజులకు ఈ స్థితి తలెత్తే అవకాశం ఉంటుంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం అసాధారణంగా పెరిగితే దీన్ని అనుమానించాలి. వెంటనే వేగంగా సెలైన్ ఎక్కించటం ఆరంభించాలి. అందుకే డెంగీ జ్వరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య చూడటం కంటే కూడా హెమటోక్రిట్/ ప్యాక్డ్ సెల్ వాల్యూమ్ పరీక్ష ప్రధానమని గుర్తించాలి. నిజానికి ఇది రక్తంలో హిమోగ్లోబిన్ ఎంత ఉందోనని చెప్పే చాలా చిన్న పరీక్ష, ఎక్కడైనా చేస్తారు, అయినా చాలామంది దీనిపై శ్రద్ధ పెట్టకపోవటం వల్ల ప్రాణాపాయాలు సంభవిస్తున్నాయి. రక్తనాళాల నుంచి ప్లాస్మా లీక్ అవుతూ రక్తం చిక్కబడి, హిమోగ్లోబిన్ శాతం పెరిగిపోతుంటే అప్పుడు డెక్స్‌ట్రాన్ 40 లేదా ప్లాస్మా ఎక్కించటం గురించి ఆలోచించాలి. రక్తంలో హిమటోక్రిట్ సాధారణ స్థాయికి చేరుకుని, కనీసం ఒకటి రెండు రోజులు నిలకడగా ఉంటూ, ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతున్నప్పుడు మాత్రమే ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్ళాలి.

## డెంగీ జ్వరానికి హోమియో చికిత్స

డెంగీ జ్వరం హోమియో చికిత్స ద్వారా త్వరగా మరియు సైడ్ ఎఫెక్ట్ లేకుండా తగ్గుతుంది. ఎన్నోవేల మంది ఈ మందుల వల్ల ప్రయోజనం పొందారు.

**యూపాటోరియం పర్ఫ్ 200:** డెంగీ జ్వరానికి చాలా ముఖ్యమైన మందు. డెంగీ జ్వరం రాకుండా ముందు జాగ్రత్తగా ఈ మందును 30సి పొటెన్సీలో రోజుకు రెండుసార్లు వాడవచ్చు. ముఖ్యంగా డెంగీ జ్వరం వచ్చినప్పుడు తీవ్రమైన జ్వరంతోపాటు విపరీతమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు మరియు కనుగుడ్లలో నొప్పులకు బాగా పనిచేస్తుంది. విపరీతమైన తలనొప్పి, వికారం, వాంతులు మరియు ఒళ్ళు పగల కొట్టినట్లుగా నొప్పులు. ఈ లక్షణాలున్నచో ఈ ఔషధం చక్కగా పనిచేస్తుంది. జ్వరంతో పాటుగా చలి తరువాత చెమటలు వస్తాయి.

**జెల్సిమీయం :** యూపాటోరియం పర్ఫ్ తరువాత డెంగీ జ్వరానికి వాడే ముఖ్యమైన మందు ఇది. రోగి మగతగా ఉంటారు. తల వెనుక భాగంలో నొప్పి, తలతిప్పు ఎక్కువ. ఎక్కువగా పడుకొని ఉంటారు ఏ పని చెయ్యరు ఎవ్వరు వారిని పలకరించకూడదని ఆశిస్తారు. వెన్నులో చలి, తలనొప్పితోపాటు కళ్ళు బరువుగా అనిపిస్తాయి ఈ లక్షణాలు ఉన్నచో ఈ మందును వాడాలి.

**ఈ మందులే కాకుండా ఈ జ్వరానికి ఉపయోగపడే మందులు:** ఆర్సెనికం ఆల్బం, రస్‌టాక్స్, బ్రయోనియా

**డెంగీ హెమరేజిక్ ఫీవర్‌కి ఉపయోగపడే మందులు:** ఇపికాక్, క్రోటలస్, సింకోన మొదలైనవి. దీనికి నిపుణులైన హోమియో వైద్యుల సలహా తీసుకొని అవసరమైతే ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలి.

*– డా॥ టంగుటూరి నీలవేణి, బి. హెచ్.ఎమ్.ఎస్.*

**మనస్సును అనుసరించే పరిస్థితులు ఏర్పడతాయి**

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ కలశయాత్ర ప్రారంభం

భారతదేశ శక్తిమంతం, సుసంపన్నాన్ని కాంక్షిస్తూ ఆం.ప్ర. లోని మంగళగిరిలో జనవరి 5 నుంచి 8వ తేది వరకు అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు గాయత్రీ పరివార్ దక్షిణ భారత సంయోజకులు అశ్విని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా మహాయజ్ఞం ప్రచార నిమిత్తం ప్రత్యేక కళశయాత్ర రథం హైదరాబాద్‌లోని మూసాపేట నుంచి ఆరంభమైంది. ఈ సందర్భంగా అశ్విని సుబ్బారావు మాట్లాడుతూ... సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ చేపట్టిన ఈ ఆధ్యాత్మిక కలశయాత్ర రథం 110 రోజులపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తుందన్నారు. జనవరి 5న మంగళగిరికి చేరుకుని అక్కడ నిర్వహించే అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో గాయత్రీ పరివార్ తెలుగు రాష్ట్రాల కో-కన్వీనర్ వేణుగోపాలరెడ్డి, మహేశ్వరి, పూల్‌సింగ్, కృష్ణారావు, తూము ఎల్లారావు, విక్రం, విజయ్‌కుమార్, నిర్మల పాల్గొన్నారు.

## హైదరాబాద్ మీర్‌పేటలో శక్తి కలశయాత్ర

తేది 01.10.2017 ఆదివారం నాడు హరిద్వార్ నుండి వచ్చిన "శక్తి కలశం" హైదరాబాద్ నగరంలోని మీర్‌పేట శివసాయినగర్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయానికి చేరుకుంది.

గాయత్రీ చేతనా కేంద్రము, మూసాపేట ప్రతినిధి శ్రీ గూడ విజయ్‌కుమార్ గారి ఆధ్వర్యంలో వచ్చిన శక్తి కలశానికి ఆలయ ఛైర్మన్ శ్రీ తీగల సుభాష్ రెడ్డిగారు, దేవాలయ కమిటీ మెంబర్లు శ్రీ సంతోష్‌రెడ్డి, శ్రీ కృష్ణారావు, శ్రీ యుగంధర్, శ్రీ కె.వి.రమణ, శ్రీ లక్ష్మీగణపతి, శ్రీ రామ్మోహన్‌రావు, శ్రీ అన్నాజీ రావు, శ్రీ ప్రభాకర్‌రెడ్డి, శ్రీ శ్రావణ్‌కుమార్, శక్తి కలశానికి ఘనస్వాగతం పలుకుతూ కాలనీలోని పురవీధులలో మంగళ వాయిద్యాల నడుమ ఆహ్వానం పలికి కాలనీలోని స్త్రీలు, భక్తులు, హారతితో ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ రమేష్‌శర్మ, శ్రీ గోపాలకృష్ణశర్మ పూజలు నిర్వహించి భక్తులచే మొక్కుబడులు మొక్కించారు.

ఈ కార్యక్రమంలో శివసాయినగర్‌కాలనీ, టి.ఎస్.ఆర్. నగర్ కాలనీ, బాలాజీనగర్ కాలనీ, కేశవరెడ్డినగర్ కాలనీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ శక్తి కలశంతో ఉప్పొంగిన శ్రద్ధ

ఋతుసంధ్యలోని నవరాత్రుల పుణ్యవేళలో అశ్వమేధ శక్తి కలశ రథయాత్ర మంగళగిరిలోని ఎన్.ఆర్.ఐ.వైద్య కళాశాల ప్రాంగణంలోని ధన్వంతరి దేవాలయం (వైద్య నారాయణ) ఆలయ ప్రాంగణం నుంచి ఆసుపత్రి డైరెక్టర్ దంపతులైన డా॥ అక్కినేని సుదర్శన్‌గారు, డా॥ శ్రీమతి మణిగారు, శాంతికుంజ్ దక్షిణభారత విభాగ అధ్యక్షులైన డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీగారి సువర్ణ హస్తములతో, వేదమంత్రాల ఉద్ఘోషతో పచ్చజండా ఊపి వాటిని రవాణా చేయటం జరిగింది. ఈ రథ ప్రస్థానమునకు కావలసిన ఏర్పాట్లు శాంతి కుంజ్ ప్రతినిధి దంపతులైన శ్రీ ఉమేష్‌శర్మగారు, శ్రీమతి ప్రశాంతిశర్మగారు, స్థానిక కార్యకర్తలైన గాయత్రీ చేతనా కేంద్ర ప్రతినిధి శ్రీ వేణుగోపాలరెడ్డిగారు, శ్రీ భోజనపల్లి ప్రసాద్‌గారు, శ్రీ పేర్ల వేంకటేశ్వర్లుగారు, శ్రీ సీతారామశర్మగారు, శ్రీమతి పోలి రమాదేవిగారితో కలిసి పనిచేయటం జరిగింది.

ఒక రథము మంగళగిరి నుంచి దక్షిణ దిక్కుగా బయలుదేరి ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణం చేరుకుని తమ లక్ష్యసాధన దిశగా మొదటి అడుగు వేసింది. అక్కడి స్థానిక కార్యకర్తలు శ్రీమతి రాజ్యలక్ష్మిగారు, శ్రీమతి క్రిష్ణవేణిగారి నేతృత్వంలో సమయాన్ని కచ్చితంగా పాటిస్తూ ఒంగోలు పట్టణంలోని వివిధ ప్రాంతాలైన, గాయత్రీ అనుగ్రహపీఠము, సంతపేట, ఏనుగుచెట్టి, గోపాల్‌నగరము, భాగ్యనగరము, లాయర్‌పేట మొదలైనవి కాక, కరవదీ, గిద్దలూరు, అద్దంకి, అమ్మనబ్రోలు మొదలైన ముఖ్యమైన మండలాలలో

ఇచ్చిపుచ్చుకోవడం అనేది సృష్టి నియమం

అశ్వమేధంతోపాటు మన మిషన్‌ని పరిచయం చేస్తూ అందరిని అశ్వమేధ యజ్ఞంలో పాల్గొనటం, దాని వలన కలిగే లాభాలను వివరించటం జరిగింది. భక్తుల ఉత్సాహం మన నేత్రాలతో చూడవలసినదే.

అక్కడ నుంచి రథము శక్తి కలశముతోపాటు నెల్లూరు జిల్లాలోని కావలి పట్టణం చేరుకుంది. మన స్థానిక నెల్లూరు కార్యకర్తలైన శ్రీమతి భువన, శ్రీ సిద్ధారెడ్డిగారు, శ్రీ కె.టి. నాయుడుగారి మార్గదర్శనంలో సోదరిమణులు అలంకరించిన కలశాలతో ఎన్నో మహత్తులు కలిగిన శక్తి కలశానికి స్వాగతం పలికి తమ జీవిత ధన్యతను మరోసారి అనుభూతి చెందారు. నెల్లూరు జిల్లాలో నెల్లూరు పట్టణము, గూడూరు, రాజపాలెం, వింజమూరు, ఉదయగిరి, వెంకటగిరి, ఆత్మకూరు, పొదల కూరు, చింతలపూడి, కాకివాయి గాయత్రీ ఆశ్రమము, దాని చుట్టుప్రక్కల అశ్వమేధ సందేశాన్ని అందజేసి పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోని చెన్నై పట్టణమునకు తన ప్రస్థానములో చేరుకుంది. మార్గమధ్యంలో గుమ్మడిపుండిలో ప్రజలకు అశ్వమేధ శక్తికలశ దర్శనభాగ్యాన్ని అందిస్తూ (చెన్నై) మహా నగరం చేరుకుంది. చెన్నై మహానగరంలోని మన మూడు బ్రాంచీలు, గురుదేవుల స్వహస్తాలతో ప్రాణప్రతిష్ఠ గావించ బడిన తాంబ్రం శక్తిపీఠము, తిరువళ్ళూరు (సబ్ అర్బన్ ఏరియా లను) చుట్టివస్తూ అందరికి అశ్వమేధ సందేశాన్ని అందించింది. అక్కడి శ్రద్ధావంతులు అందరూ మహాయజ్ఞంలో పాల్గొనటమే కాక, విశేష సహకారం ధన, వస్తు రూపేణ అందించటానికి సంకల్పం చేశారని వారి సంకల్పాలను పూర్తి చేయించటంలో తమ వంతు కృషి చేస్తామని స్థానికంగా కార్యనిర్వహణ బాధ్యతను నిర్వహిస్తున్న శాంతికుంజ్ పరివ్రాజకులు శ్రీ అఖిలేశ్వర్‌సింగ్, శ్రీ రాజేష్ అగర్వాల్, శ్రీ కె.వి.రామకృష్ణ, శ్రీ నారాయణస్వామి, శ్రీరామ్‌లాల్ ఖండేల్వాల్ మొదలైనవారు తెలిపారు. చెన్నై పట్టణము నుంచి శక్తి కలశరథము (కలియుగ వైకుంఠమైన తిరుపతి పట్టణము ఉన్న) చిత్తూరు జిల్లాకు చేరుకొని చిత్తూరు పట్టణము పరిసర ప్రాంతాలు, వరసిద్ధి వినాయకుని స్వస్థలమైన కాణిపాకం చేరుకుని అక్కడి ప్రజలను అనుగ్రహించింది, కార్యకర్తలందరూ కలసి శక్తి కలశ సమక్షంలో విఘ్నహరుడైన విఘ్నేశ్వరుని నిర్విఘ్నంగా యజ్ఞకార్యం జరిపించమని ప్రార్థిం చారు. అక్కడ నుంచి మదనపల్లి చేరుకొని విశేషంగా భక్తులను అనుగ్రహించి వారిని మహాయజ్ఞం కోసం ఆహ్వానించి తన తరువాతి మజిలీ అయిన కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి వేంచేసి ఉన్న తిరుపతి పట్టణం చేరుకుంది. వారి దివ్యచరణ సన్నిధిలో భక్తులకు ఈ మహాయజ్ఞానికి అత్యధికంగా తరలివచ్చి తరించ వలసినది అనే సందేశాన్ని అందిస్తూ, కలియుగ దైవం ఆశీస్సు లను తన వెంట మూటకట్టుకొని తన సన్నిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరికి అందించాలనే దివ్య సంకల్పంతో శక్తికలశ మహా రథము అక్కడ నుంచి శ్రీకాళహస్తికి పయనం అయినది. పంచతత్వాలలోని వాయుతత్త్వానికి ప్రతీకగా నిలిచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో భక్తులకు అశ్వమేధ సందేశాన్ని అందించి తన ప్రయాణాన్ని కొనసాగించింది.

అక్కడ నుంచి బయలుదేరిన శక్తికలశ రథము సుదీర్ఘంగా ప్రయాణించి మన ఆంధ్రప్రదేశ్ రెండో చివరన ఉన్న ఇచ్ఛాపురమునకు చేరుకొని అక్కడ నుంచి ఇచ్ఛాపురము, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలు పలాస, బెండికొండ, మందాస మండలాలు, శ్రీకాకుళం పట్టణం మొదలైన ప్రాంతాలలో అశ్వమేధ ఆహ్వానాన్ని అందించింది. శ్రీ ప్రకాశరావుగారు, వారి బృందం వారి సహకారాన్ని అందించారు. అక్కడ నుంచి విజయనగరం జిల్లా, ఒడిశా ప్రదేశాలలో ప్రస్తుతం తన శక్తి వితరణతోపాటు అశ్వమేధ సందేశాన్ని అందిస్తున్నది.

రెండవ రథము ఉత్తరానికి పయనించి తెలంగాణ రాష్ట్ర రాజధాని చారిత్రాత్మక పట్టణమైన హైదరాబాద్‌కు చేరుకుంది. నవరాత్రుల పుణ్యవేళలో తన దివ్యశక్తిచేత, అశ్వమేధ సందేశాలతో హైదరాబాద్ వాసులను భక్తి పారవశ్యంతో నింపివేసింది. హైదరాబాద్‌లోని మూసాపేట ప్రాంతంలో ఉన్న గాయత్రీ చేతనా కేంద్రమును ముఖ్య కేంద్రంగా చేసుకొని, శ్రీ అశ్విని సుబ్బారావుగారు (దక్షిణభారత ప్రాంత కన్వీనర్) గారి మార్గదర్శనంలోని పాతబస్తీ బేగంబజార్‌లో ఉన్న మన ప్రజ్ఞాపీఠము, ధూల్‌పేట ప్రజ్ఞాపీఠము, సికింద్రాబాద్ ఓల్డ్‌బోయినపల్లి గాయత్రీ జ్ఞానమందిరాలతోపాటు అక్కడి దిల్‌సుఖ్‌నగర్, బాలానగర్, ఎస్.ఆర్.నగర్, దీప్తిశ్రీనగర్ మొదలైన ప్రాంతాలలోని దేవాలయాలలో సందేశాన్ని ఇస్తూ ఎంతోమంది నగర ప్రముఖులకు కూడా తన దివ్య ఆశీస్సులను

**తీసుకుంటే మూల్యం చెల్లించి తీరాలి**

అశ్వమేధ సందేశంతోపాటు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో మన స్థానిక కార్యకర్తలు శ్రీ గోకుల్‌చంద్ ఉపాధ్యాయగారు, శ్రీ బలదేవ్‌సింగ్‌లోథ, శ్రీ రంగారావు-వాణి దంపతులు, శ్రీ ఎమ్.వి.ఎస్.రాజుగారు, శ్రీ బి.అనిల్‌కుమార్ (అశ్విని) గార్ల నేతృత్వంలో 'దియా' బృందం విశేష సహకారం అందించారు. గాయత్రీ చేతనా కేంద్రం ప్రతినిధి శ్రీ వేణుగోపాలరెడ్డిగారు అందరి మధ్యలో సమన్వయకర్తగా వ్యవహరించి శక్తికలశ పూజన కార్యక్రమం, అశ్వమేధ సందేశం జంటనగరాలలో ప్రతి ఒక్కరి దగ్గరకు చేర్చటంలో విశేషంగా శ్రమించారు. ఈ నవరాత్రులలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి మీద ఉన్న గాయత్రీమాత దేవాలయం మౌంట్ శంబలలోని భక్తులకు కూడా విశేష అనుగ్రహాన్ని కల్పించింది.

అక్కడ నుంచి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మిర్యాల గూడ, మాల్, ఇబ్రహీంపట్నం మొదలైన ప్రదేశాలను చేరుకొని అక్కడి భక్తులకు తమ సందేశాన్ని అందించింది. శ్రీ చంద్రమౌళి గారు, శ్రీ రాఘవులు, శ్రీ నర్సింహులుగారు ఏర్పాట్లు చేసినారు. అక్కడి దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్‌లోని వివిధ ప్రాంతాల భక్తులను అనుగ్రహించింది. శ్రీ రాకేష్‌పాల్‌గారు, శ్రీ రామచంద్రరెడ్డిగారి విశేష కృషి దీని వెనుక ఉన్నది.

అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి పట్టణములో తన రెండు రోజుల యాత్రలో భక్తులను అనుగ్రహిస్తూ అశ్వమేధ సందేశాన్ని అందించింది. అక్కడి కార్యకర్తలు శ్రీ దత్తాత్రేయ చౌహాన్‌గారు, శ్రీ పెంటోజీగారు, శ్రీమతి ఉమాదేవి, శ్రీమతి సక్కుబాయి మొదలైనవారు విశేష సహకారం లభించింది. అక్కడి నుంచి అదే జిల్లాలోని జహీరాబాద్‌కు చేరుకుంది, అక్కడ శ్రీ అమృతలాల్‌జాజూగారి బృందం సహకారం అమోఘం. వారి సహకారంతో పరిసర ప్రాంత ప్రజలకు అశ్వమేధ సందేశం ఇవ్వటం జరిగింది. అక్కడి నుంచి పక్క జిల్లా మెదక్, మెదక్ పట్టణం, దాని పరిసర ప్రాంతాలలో సందేశంను అందించింది. దానికి శ్రీ రాజరత్నంగారు ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి తుప్రాన్ భక్తులను అనుగ్రహిస్తూ కామారెడ్డి జిల్లా చేరుకొంది. కామారెడ్డి పట్టణం, పరిసర ప్రాంతాలలో సందేశాన్ని అందించింది. అందుకోసం శ్రీ ఉపేందర్ గారి మార్గదర్శనంలో శ్రీ నరసయ్యగారు రథ బృందాన్ని నడిపించాయి.

తను తరువాత మజిలీ అయిన నిజామాబాద్‌లో శ్రీమతి దక్షా కటారియా సోదరి సహకారంతో దేవ సంస్కృతి దిగ్విజయం - ఉద్యమంలో భాగమైన అశ్వమేధ మహాయజ్ఞం శంఖనాదం భక్తులను వినిపించటం జరిగింది. అక్కడ నుంచి ఆర్మూర్, కిసాన్‌నగర్‌లో కూడా శ్రీమతి సుశీలా తివారీ, శ్రీ అంబలాల్ కిసాన్ మాధ్యమంగా సందేశాన్ని అందించటం జరిగింది. అక్కడ నుంచి నిర్మల్ జిల్లాలోని నిర్మల్ పట్టణం, నర్సాపూర్ మండలాలను చుట్టి వస్తూ అదిలాబాద్ చేరుకుంది. అదిలా బాద్‌లో శ్రీ మహేంద్రగారు, శ్రీ శంకర్‌రావుగారి ప్రణాళికను అనుసరించి భక్తులందరి దగ్గరకు అశ్వమేధ సందేశం చేర్చటం జరిగింది. అక్కడి నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ దాని చుట్టూ ప్రక్కల ప్రాంతాలలోని భక్తులకు, మన మహిళ, ప్రజ్ఞా మండలాలలోని కార్యకర్తల విశేష సహకారం లభించింది. ఇక్కడ శ్రీ రాజేష్ ఖిల్వానిగారు, శ్రీ శ్రీకాంత్ శుక్లాగారు, శ్రీమతి శాంతిపాండేగారు, శ్రీ రాఘవులు, శ్రీ నిర్మల్ హల్దర్‌గారు, శ్రీ లక్ష్మణరెడ్డిగార్లు సహకారం అందించారు.

అక్కడ నుంచి మంచిర్యాల పట్టణము రాజబాబుగారి నేతృత్వంలో భ్రమణం గావించి అక్కడ భక్తులను తరింపజేసి పాత కరీమ్‌నగర్ జిల్లా నుంచి ఏర్పడిన జగిత్యాల, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, కరీమ్‌నగర్ ప్రాంతాలలో డా॥ పులి సత్యన్నారాయణగారి సమన్వయంలో మన కార్యకర్తలందరూ విశేష ఏర్పాట్లు చేసి శక్తి-కలశరథము కోసం సంసన్నధతతో ఎదురుచూస్తున్నారు.

రెండు రథములకు వెళ్ళిన ప్రతిచోట విశేష ఆదరణ లభించటమేకాక, అక్కడి వివిధ ధార్మిక సంస్థల సహకారం కూడా విశేషంగా లభిస్తున్నది. ఈ అశ్వమేధం అందరికోసం మనం అందరి సహకారంతో జరగాలని తమ సహకారం అందిస్తామని ప్రతి ఒక్కరు సంకల్పం చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో భ్రమణం కావిస్తున్న రథములో శ్రీ ప్రేమ్‌లాల్ గారు, శ్రీ మదన్‌మాలవ్యాగారు, శ్రీ ఎస్. నాగేశ్వరరావుగారు, శ్రీ మనేష్ (రథ చోదకుడు) ఉన్నారు. తెలంగాణలో సందేశాన్ని అందిస్తున్న రథంలో శ్రీ మహేష్ పటేల్‌గారి నేతృత్వంలో శ్రీ సహదేవ్, శ్రీ ఫూల్‌సింగ్, శ్రీ గమ్మూలాల్‌యాదవ్ సభ్యులుగా ఉన్నారు.

**తీసుకోవడం తప్ప ఇవ్వడం తెలియనివారు తెలివిలేని మూర్ఖులే**